f /manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ | సోమవారం • 3-4-2023 • సంపుటి:7 • సంచిక:62 • పేజీలు:12 • వెల:రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

చైత్రమాసం, సోమవారం, తిథి: త్రయోదశి, ఉ.6.24 నుంచి రేపు ఉ.8.05 వరకు, నక్షత్రం: పుబ్బ, ఉ.7.24 నుంచి రేపు ఉ.9.36 వరకు, వర్జ్యం: సా.4.08-5.53 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.55-మ.12.43, రాహుకాలం: ఉ.7.44-9.16 వరకు

## ఇస్రో మరో ఘనత..

### పునర్వినియోగ లాంచ్ వెహికల్ ల్యాండింగ్ మిషన్ సక్సెస్



బెంగళూరు, ఏప్రిల్ 2: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో ఘనత సాధించింది. పునర్వినియోగ లాంచ్ వెహికల్ ల్యాండింగ్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. కర్ణాటక చిత్రదుర్గలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ (ఏటీఆర్)లో ఆదివారం పునర్వినియోగ లాంచ్ వెహికల్ అటానమస్ ల్యాండింగ్ మిషన్‌ని చేపట్టింది. డీఆర్డీవో, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌తో కలిసి సంయుక్తంగా పునర్వినియోగ లాంచ్ వెహికల్ ల్యాండింగ్‌ను పరీక్షించినట్లు ఇస్రో తెలిపింది. ప్రపంచంలోనే తొలిసారి రెక్కలున్న లాంచ్ వెహికల్‌ను హెలికాప్టర్ ద్వారా 4.5 కిలోమీటర్ల

..మిగతా 2లో



2

## పాకిస్తాన్‌లో ఆకలి కేకలు..

ఇప్పటికే 20 మంది మృతి..

50 ఏళ్ల గరిష్టానికి ద్రవ్యోల్బణం



## వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపండి..

### కేంద్రం కుట్రలకు పాల్పడుతోంది : కేటీఆర్

రూ.5 వేల కోట్లు కేటాయించాలి

విశాఖ ఉక్కు తెలుగు ప్రజల హక్కు

కార్పొరేట్లకు రూ. 12 లక్షల కోట్ల రుణమాఫీ చేశారు

విశాఖపై ఎందుకు కనికరించరు..

కేంద్రానికి మంత్రి కేటీఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ కేంద్రానికి బహిరంగ లేఖ రాశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరించే కుట్రలను కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తూనే ఉందని తీవ్రంగా మండిపడ్డారు. తాజాగా కేంద్రం దొడ్డిదారిన స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుకు కట్టబెట్టే కుతంత్రానికి తెరలేపిందన్న కేటీఆర్... వర్కింగ్ క్యాపిటల్, ముడి సరుకు కోసం నిధుల సమీకరణ పేరిట స్టీల్ ప్లాంట్ తాళాలను ప్రైవేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు ఏకంగా నోటిఫికేషన్ జారీ

..మిగతా 2లో

### సోషల్ మీడియా కమిటీలను మరింత బలోపేతం చేసుకోవాలి

పార్టీ నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం 2



## కరోనా కలవరం..

### దేశంలో భారీగా పెరుగుతున్న కేసులు

24 గంటల్లో 3,823 పాజిటివ్‌లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 : భారతదేశంలో గత 24 గంటల్లో 3 వేల 823 కొత్త కోవిడ్ -19 కేసులు నమోదయ్యాయి. ఇది నిన్నటితో పోలిస్తే 27 శాతం పెరిగిందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత్‌లో నిన్న 2 వేల 994 ఉండగా కొత్తగా కరోనా కేసులు నమోదయ్యాయి. అయితే ప్రస్తుతం కేసుల సంఖ్య 16 వేల 354కి పెరిగాయి. దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ డ్రైవ్ కింద ఇప్పటివరకు 220.66 కోట్ల డోస్‌ల కోవిడ్-19 వ్యాక్సిన్‌ను అందించినట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. భారతదేశంలో రోజువారీ కోవిడ్ కేసులు గతంలో కంటే ఇవాళ్టితో పోలిస్తే 27% పెరిగిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. 3,824 మందికి కరోనా వైరస్ పాజిటివ్‌గా వచ్చిందని తెలిపింది. శుక్రవారం, దేశంలో రోజువారీ కోవిడ్ కేసులు 3,095.. శనివారం 2995 వద్ద ఉంది. ఇంతలోనే కరోనా కేసులు పెరుగుతుండటం కలవరపెడుతుంది. మొత్తం యాక్టివ్ పేషెంట్ల సంఖ్య 18 వేల 389కు పెరిగింది. వైరస్ బారిన పడిన వారు మొత్తం ఇన్ఫెక్షన్లలో 0.04% (4,47,22,605). మరోవైపు, రికవరీల

..మిగతా 2లో



## నేడు సూరత్ కోర్టుకు రాహుల్..

### జైలు శిక్షపై అప్పీలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: సూరత్ కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షపై రాహుల్ గాంధీ అప్పీల్ చేయనున్నట్లుగా సమాచారం. మోదీ ఇంటిపేరు ఉద్దేశించి చేసిన చేసిన వ్యాఖ్యలపై కోర్టు దోషిగా నిర్ధారిస్తూ రెండేళ్ల జైలు శిక్షను విధించిన విషయం తెలిసిందే. తీర్పుపై అప్పీల్ చేసుకునేందుకు కోర్టు నెల రోజుల సమయం ఇచ్చింది. మెజిస్ట్రేట్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సెషన్స్ కోర్టులో పిటిషన్ వేయగా.. సోమవారం విచారణకు రానున్నట్లు పేరు తెలుపేందుకు ఇష్టపడని ఓ సీనియర్ కాంగ్రెస్ నేత తెలిపారు. ఈ

..మిగతా 2లో



## అల్లరి మూకలను తలకిందులుగా వేలాడదీస్తాం

### బీహార్‌లో బీజేపీని గెలిపించండి..

కేంద్ర హోం మంత్రి అమిత్ షా

పాట్నా, ఏప్రిల్ 2: సీఎం నితీష్ కుమార్ అధికార దాహం వల్లే లాలూ ప్రసాద్ యాదవ్ ఒడిలో కూర్చున్నారని విమర్శించారు కేంద్ర హోంమంత్రి అమిత్ షా. బీహార్ నవడాలో పర్యటించిన ఆయన జేడీయూ-ఆర్జేడీ-కాంగ్రెస్ మహాఘటబంధన్ కూటమిపై విమర్శలు గుప్పించారు. ఆదివారం నవడా జిల్లాలోని హిసువా ప్రాంతంలో జరిగిన బహిరంగ

..మిగతా 2లో

## డిగ్రీ లేని వ్యక్తికి దేశంలోనే పెద్ద ఉద్యోగం

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): దేశంలో నిరుద్యోగ రేటు 7.8 శాతంగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. యువతకు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ ఏమైందంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె ప్రశ్నించారు. మోసపూరిత హామీతో దేశ యువతను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దగా చేసిందని విమర్శించారు. ఈ మేరకు ట్విటర్ వేదికగా బీజేపీ, ప్రధాని మోదీపై ఆమె విమర్శలు గుప్పించారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 10 లక్షల ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తారని కవిత ప్రశ్నించారు. నిజమైన డిగ్రీ సర్టిఫికెట్లు ఉన్న వాళ్లకు దేశంలో ఉద్యోగాలు

..మిగతా 2లో

## కాంగ్రెస్, బీజేపీలది తెలంగాణపై కపట ప్రేమ

ప్రతిపక్షాలను నమ్మడం

కుక్క తోక పట్టుకుని గోదారి ఈదడమే

మేం రైతుల కోసం ఆలోచిస్తున్నాం..

మోదీ అదానీ కోసం ఆలోచిస్తున్నాడు

త్వరలోనే పరీక్షలు, ఉద్యోగాలు

పేపర్ లీక్‌పై మంత్రి హరీష్ రావు స్పందన

2






## రాహుల్ గాంధీ పది జన్మలెత్తినా.. సావర్కర్ కాలేరు

### కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ఇటీవల అనర్హత వేటు అనంతరం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'నా పేరు సావర్కర్ కాదు. క్షమాపణలు చెప్పను' అని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. దీనిపై కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మండిపడ్డారు. రాహుల్ పది జన్మలెత్తినా సావర్కర్‌లా మారలేరని పేర్కొన్నారు. ఢిల్లీలో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో భాగంగా ఠాకూర్

..మిగతా 2లో

## తీగలాగితే డొంక కదిలిందా?! మీకర్థమవుతోందా?

### టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ట్వీట్



హైదరాబాద్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ కేసుపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ తీగలాగితే ప్రగతి భవన్ డొంక కదిలిందా.?! అంటూ రాసుకొచ్చారు. విచారణలో 'బావ'. టీఎస్‌పీఎస్సీలో బావమరిది.? మీకర్థమవుతోందా. అని ట్వీట్లో పేర్కొన్నారు. ఈమాటలకు టీఎస్ పీఎస్సీ సభ్యుడు లింగారెడ్డి బయోడేటా జత చేశారు. ప్రస్తుతం రేవంత్ ట్వీట్ రాజకీయ వర్గాల్లో

..మిగతా 2లో

## సింహం సింగిల్‌గానే వస్తుంది

రాష్ట్రంలో ఎగిరేది బీజేపీ జెండానే

కేసీఆర్‌కు... మోదీని తిట్టడం తప్ప వేరే పని లేదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



హైదరాబాద్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): ఏ సర్వేలు చూసినా ములుగులో ఎగిరేది బీజేపీ జెండానే అని స్పష్టంగా తెలుస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ములుగు జిల్లా పోలింగ్ బూత్ సమ్మేళన సభలో బండి సంజయ్ పాల్గొన్నారు. సర్వేలన్ని బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని బండి సంజయ్ చెప్పారు. వచ్చే ఎన్నికల్లో సింగిల్‌గానే పోటీ చేస్తామని, ఏ పార్టీతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని, వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసి పోటీ చేసే

..మిగతా 2లో



## జనాకర్షక పథకాల కన్నా... జనహిత పథకాలే మిన్న

ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు 2

### మంచిమాట

పువ్వులతో నిండిన తోట
ఎలా అందంగా ఉంటుందో
మంచి ఆలోచనలతో నిండిన
మనసు కూడా అంతే
అందంగా ఉంటుంది.

శుభోదయం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునఃఅభివృద్ధి పనులను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించేందుకు రైల్వే శాఖ ఏర్పాట్లు

తెలంగాణ పర్యటనకు విచ్చేస్తున్న నరేంద్రమోదీ రూ. 11,355 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు

రైల్వేస్టేషన్ నందు చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేయనున్నారు

## 8న రాష్ట్రానికి ప్రధాని మోదీ



హైదరాబాద్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 8వ తేదీన రాష్ట్రానికి రానున్నారు. ప్రధాని రాకను పురస్కరించుకుని పలు రైల్వే అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వే సిద్ధమవుతోంది. తెలుగు రాష్ట్రాల మధ్య సికింద్రాబాద్-తిరుపతి వరకు నడిచే రెండో వందేభారత్ రైలును అదేరోజు ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. దీంతో పాటు ఎంఎంటీఎస్ రెండో దశ పనులను, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునఃఅభివృద్ధి పనులను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించేందుకు రైల్వే శాఖ ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ పర్యటనకు విచ్చేస్తున్న నరేంద్రమోదీ రూ. 11,355 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్ట నున్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి నేరుగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుని సికింద్రాబాద్ - తిరుపతి మధ్య

..మిగతా 2లో



## టీఎస్పీఎస్సీ కమిటీ తొలగించి.. కొత్త కమిటీ వేయాలి

టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం 2

## పాకిస్తాన్‌లో ఆకలి కేకలు..

ఇస్లామాబాద్, ఏప్రిల్ 2 : తీవ్ర ఆర్థిక, ఆహార సంక్షోభంతో దాయాది దేశం పాకిస్తాన్ అల్లాడుతోంది. కనీసం అక్కడి ప్రభుత్వం ప్రజలకు తినేందుకు తిండిని కూడా ఇవ్వలేకపోతోంది. ఎక్కడ చూసినా ఆహారం కోసం తొక్కిసలాటలు, కొట్లాటలు జరుగుతున్నాయి. పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్, పంజాబ్, సింధ్, ఖైబర్ ఫఖ్తుంఖ్వా ఇలా అన్ని ప్రాంతాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇతర దేశాల నుంచి వచ్చే తిండి గింజలు ప్రజలకు చేరకముందే రాత్రికి రాత్రి మాయం అవుతున్నాయి. పాకిస్తాన్ ద్రవ్యోల్బణం 50 ఏళ్ల గరిష్టానికి చేరుకుంది. మార్చిలో 35.37 శాతానికి చేరుకుంది. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం నెలవారీ ద్రవ్యోల్బణం 3.72 శాతం కాగా.. గతేడాది సగటు ద్రవ్యోల్బణం రేటు 27.26 శాతంగా ఉంది. దీంతో పాకిస్తాన్ వ్యాప్తంగా నిత్యావసరాలు, పెట్రోల్, డిజిల్, గ్యాస్ ఇలా అన్నింటి రేట్లు ఆకాశాన్ని అంటుతున్నాయి. రాజకీయ అస్థిరత, ఉగ్రవాదం, సైన్యం పెత్తనం ఇలా సవాలక్ష సవాళ్లు పాకిస్తాన్ ముందు ఉన్నాయి. మరోవైపు ఐఎంఎఫ్ బెయిలౌట్ ప్యాకేజీ 1.1 బిలియన్లను విడుదల చేయకపోవడంతో పాకిస్తాన్ లో తిండికోసం అంతర్యుద్ధం చెలరేగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. 22 కోట్ల జనాభా ఉన్న పాకిస్తాన్‌లో రంజాన్ మాసంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆహార పంపిణీ కేంద్రాల వద్ద భారీ ఎత్తున ప్రజల క్యూ లైన్లు కనిపిస్తున్నాయి. సరుకులు తీసుకునేందుకు భారీ ఎత్తున జనాలు రావడంతో తొక్కిసలాట జరుగుతోంది. గత 10 రోజుల్లో ఇలా తొక్కిసలాటల్లో 20 మంది ప్రజలు చనిపోయారు. శుక్రవారం కరాచీలో జరిగిన ఘర్షణల్లో 12 మంది మరణించారు. ముఖ్యంగా దిగుమతులపై ఆధారపడిన పాకిస్తాన్ వద్ద ప్రస్తుతం విదేశీమారక నిల్వలు అడుగంటాయి.

## ఇస్రో మరో ఘనత..

(మొదటిపేజీ తరువాయి)

ఎత్తుకు తీసుకెళ్లినట్లు పేర్కొంది. అనంతరం ఆకాశం నుంచి సురక్షితంగా రన్‌వేపై ల్యాండింగ్ చేసినట్లు వెల్లడించింది. కాగా, ఆదివారం ఉదయం 7:10 గంటలకు భారత వైమానిక దళానికి చెందిన చినూక్ హెలికాప్టర్ ద్వారా తిరిగి వినియోగించే లాంచ్ వెహికల్ 4.5 కిలోమీటర్ల ఎత్తుకు ఎగిరినట్లు ఇస్రో తెలిపింది. అనంతరం ఇంటిగ్రేటెడ్ నావిగేషన్, గైడెన్స్, కంట్రోల్ సిస్టమ్ను ఉపయోగించి దానికదే రన్వేపై ల్యాండ్ అయినట్లు చెప్పింది. చిత్రదుర్గలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ (ఏటీఆర్)లో ఆదివారం ఉదయం 7:40 గంటలకు ఆటోమేటిక్ ల్యాండింగ్‌ను అది పూర్తి చేసినట్లు వెల్లడించింది. మరోవైపు మానవరహిత రీయూజబుల్ లాంచ్ వెహికల్ అంతరిక్షం నుంచి చాలా వేగంగా, ఖచ్చితత్వంతో వచ్చి భూమిపై ల్యాండ్ అయ్యిందని ఇస్రో తెలిపింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్, సెంటర్ ఫర్ మిలిటరీ ఎయిర్వర్తినెస్ అండ్ సర్టిఫికేషన్, ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్మెంట్, ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్మెంట్ వంటి సంస్థలు ఈ పరీక్షకు సహకరించినట్లు పేర్కొంది. విజయవంతమైన ఈ ప్రయోగానికి సంబంధించిన వీడియో క్లిప్‌ను ట్విట్టర్లో షేర్ చేసింది.

## నేడు సూరత్ కోర్టుకు రాహుల్..

(మొదటిపేజీ తరువాయి)

విషయంపై రాహుల్ తరపున న్యాయవాదులను స్పందించగా.. ఆయన స్పందించలేదు. 2019లో కర్ణాటకలోని కోలార్‌లో ఓ ఎన్నికల సభలో నీరవ్ మోదీ, లలిత్ మోదీ, నరేంద్ర మోదీ.. దొంగలందరూ మోదీ ఇంటిపేరుతోనే ఉన్నారెందుకు? అంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దీనిపై బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పూర్ణేష్ మోదీ సూరత్ కోర్టు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై పలుమార్లు విచారణ జరిపిన కోర్టు.. మే 23న రాహుల్‌ను దోషిగా నిర్ధారిస్తూ రెండేళ్ల జైలు శిక్షను విధించింది. ఆ తర్వాతి రోజు వయనాడ్ నుంచి ఎంపీగా కొనసాగుతున్న రాహ్కు లోక్‌సభ సెక్రటేరియట్ అనర్హత వేటు వస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. మరో వైపు రాహుల్ గాంధీని దోషిగా నిర్ధారించిన తర్వాత 14 రాజకీయ పార్టీలు సంయుక్తంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. ఈ పిటిష్ప ఏప్రిల్ 5న విచారణ జరిపేందుకు కోర్టు అంగీకరించింది.

## అల్లరి మూకలను తలకిందులుగా వేలాడదీస్తాం

(మొదటిపేజీ తరువాయి)

సభలో ప్రసంగించారు. బిహార్‌లో రామనవమి రోజుల చెలరేగిన మతఘర్షణల గురించి ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. జంగిల్ రాజ్ లాలూ ప్రసాద్ యాదవ్‌తో ఉన్న ప్రభుత్వం బిహార్‌లో శాంతిని నెలకొల్పుతుందా..? అని ప్రశ్నించారు. నేను ససారం వెళ్లాల్సి ఉంది, అయితే దురదృష్టవశాత్తు అక్కడ మతఘర్షణలు చెలరేగాయి. ప్రజలు చంపబడుతున్నారు, బుల్లెట్ల కాల్పులు, టియర్ గ్యాస్ షెల్లింగ్ జరుగుతున్నాయని అమిత్ షా అన్నారు. జేడీయూ నేతలకు ఎన్డీయే తలుపులు మూసుకుపోయాయని ఆయన జేడీయూతో ఇకపై బంధం ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నితీష్ కుమార్, లాలూ ప్రసాద్ యాదవ్ తప్పుడు ఆశలతో జీవిస్తున్నారని, నితీష్ కుమార్ ప్రధాని కలలు నెరవేరవు అని అమిత్ షా అన్నారు. లాలూ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బిహార్‌లో జంగిల్ రాజ్ తిరిగి వచ్చిందని ఆరోపించారు. అయోధ్యలో రామ మందిరాన్ని కాంగ్రెస్, జేడీయూ, ఆర్జేడీ, టీఎంసీ వ్యతిరేకించాయని, కానీ మోదీ అక్కడ ఆకాశమంత ఎత్తైన ఆలయాన్ని నిర్మిస్తున్నారని అన్నారు. ససారం, బీహార్ షరీఫ్ పట్టణాల్లో మత హింసను అరికట్టడంలో బీహార్ ప్రభుత్వం విఫలం అయిందని అన్నారు. 2025లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకువస్తే అల్లరిమూకలను తలకిందులుగా వేలాడదీస్తాం అంటూ హెచ్చరికలు జారీ చేశారు. బీహార్‌లో చెలరేగిన మతఘర్షణలు సమసిపోవాలని కోరారు. అంతకుముందు ససారం వెళ్లాల్సిన అమిత్ షా, మత ఘర్షణల కారణంగా అక్కడ 144 సెక్షన్ విధించడం వల్ల ఆయన పర్యటన రద్దు అయింది.

## రాహుల్ గాంధీ పది జన్మలెత్తినా.. సావర్కర్ కాలేరు

(మొదటిపేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడారు. 'సావర్కర్‌ను అవమానించినందుకు రాహుల్ గాంధీని దేశం ఎప్పటికీ క్షమించదు. ఆయన పది జన్మలెత్తినా.. సావర్కర్ కాలేరు. సావర్కర్ తన జీవితమంతా స్వాతంత్ర్యం కోసం పోరాడారు. రాహుల్ మాత్రం తన సమయాన్ని.. బ్రిటిషర్ల సాయంతో భారత ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రచారం చేసేందుకే కేటాయించారు' అని ఠాకూర్ విమర్శించారు. మరోవైపు.. బిహార్, పశ్చిమ బెంగాల్‌లలో ఇటీవల చెలరేగిన హింసాత్మక ఘటనలు దురదృష్టకరమని పేర్కొన్నారు. బిహార్లో జంగిల్ రాజ్(ఆటవిక పాలన) తిరిగి వచ్చిందని ఆరోపించారు. 'బిహార్‌లో శాంతిభద్రతలు దిగజారాయి. లాలూ హయాంలో ఉన్న జంగిల్ రాజ్.. మళ్లీ నితీశ్ కుమార్, తేజస్వీ యాదవ్‌ల హయాంలో తిరిగి రావడం దురదృష్టకరం' అని ఠాకూర్ వ్యాఖ్యానించారు. మరోవైపు బెంగాల్లో.. సీఎం మమతా బెనర్జీ నిద్రపోతున్నారని విమర్శించారు. 'దీదీ నిద్రపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆమె కేవలం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. ఇలాగైతే.. ముఖ్యమంత్రిగా ఉండి ప్రయోజనం ఏంటి?' అని ప్రశ్నించారు.

# వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపండి..

(మొదటిపేజీ తరువాయి)

చేసిందన్నారు.



**విశాఖ ఉక్కుకు రూ.5 వేల కోట్లు కేటాయించాలి**

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నమంత్రి కేటీఆర్... స్టీల్ ఉత్పత్తి రంగాన్ని నాన్ స్ట్రాటజిక్ రంగంలోకి మార్చడంలోనే కేంద్ర ప్రభుత్వం కుట్ర దాగి ఉందన్నారు. ఒకప్పుడు సిమెంట్ పరిశ్రమలను ప్రైవేటు పరం చేసిన ప్రభుత్వాలు... ప్రస్తుతం స్టీల్ పరిశ్రమను కూడా అదే రీతిన ప్రైవేట్ కంపెనీలకు అప్పగించేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. నష్టాలను సాకుగా చూపించి తన కార్పొరేట్ కంపెనీల మిత్రులకు రూ.12.5 లక్షల కోట్ల రుణాలను రద్దు చేసిన ప్రధాని మోదీకి... వైజాగ్ స్టీల్ ప్లాంట్ విషయంలో కనీసం కనికరం ఎందుకు ఉండటం లేదని ప్రశ్నించారు. విశాఖ ఉక్కుకు కేంద్రం రూ.5 వేల కోట్లు కేటాయించాలన్న కేటీఆర్... ఉక్కు ఉత్పత్తులను కేంద్రం కొనాలని పేర్కొన్నారు. సెయిల్లో విశాఖ ఉక్కు విలీనంపై పరిశీలించాలని లేఖలో కోరారు.

**వైజాగ్ స్టీల్ ప్లాంట్ తెలుగు ప్రజల హక్కు**

సెయిల్ సంస్థ ఈ దిశగా ముందుకు వస్తే తెలంగాణ ప్రభుత్వం ఎన్నాళ్లుగానో డిమాండ్ చేస్తున్న బయ్యారం స్టీల్ ప్లాంట్‌తో పాటు కడపలోనూ మరో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఈకో సిస్టం ఏర్పడుతుందని కేటీఆర్ అన్నారు. ప్రస్తుతం మూలధనం అందించి స్టీల్ ఉత్పత్తులను కొనుగోలు చేయాలనే పేరుతో ఏర్పాటు చేసిన ఎక్స్ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ నోటిఫికేషన్ కేంద్రం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలన్న చిత్తశుద్ధి బీఆర్ఎస్‌కు ఉందన్న కేటీఆర్... వైజాగ్ స్టీల్ ప్లాంట్ తెలుగు ప్రజల హక్కు అని, దాన్ని కాపాడుకోవడం కోసం తెలుగువారందరూ కలిసి రావడం అవసరమని భావిస్తున్నామన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలకు సంఘీభావం తెలపాలని ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోటా చంద్రశేఖర్‌కు సూచించిన కేటీఆర్... కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా చేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలను ఆపేందుకు లక్షలాది పీఎస్‌యూ కార్మికులు బీఆర్ఎస్‌తో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

# సోషల్ మీడియా కమిటీలను మరింత బలోపేతం చేసుకోవాలి

హైదరాబాద్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): రాష్ట్రంలో ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణను ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. భారత రాష్ట్ర సమితి ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణపై ఆదివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనాలు కొనసాగుతున్న తీరుపై పార్టీ సీనియర్ నేత, మాజీ స్పీకర్ మధుసూదనాచారి ఆధ్వర్యంలో 10 మందితో కూడిన కమిటీ ఏర్పాటైందని వెల్లడించారు. ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలు జరుగుతున్న తీరును పరిశీలిస్తుందన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఎమ్మెల్యేలు కమిటీకి సహకరించాలని కేటీఆర్ సూచించారు. ఈ కమిటీ ద్వారానే కేసీఆర్ పార్టీ కార్యక్రమాల అమలు పర్యవేక్షణ తీరు, వాటికి సంబంధించిన అభిప్రాయాలు తీసుకుంటారని వెల్లడించారు. ఎన్నికల ఏడాదిలో ప్రతి ఎమ్మెల్యే అత్యంత చురుకైన పార్టీ కార్యకర్తలతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. ఈ బృందం ద్వారా అటు పార్టీకి ప్రజలకు నిరంతరం సమాచారం అందించడంతోపాటు, పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించుకునేందుకు ఉపయోగించుకోవాలని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలు తీసుకుపోయేందుకు సోషల్ మీడియా కమిటీలు మరింత బలోపేతం చేసుకోవాలని తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనాలు మే వరకు నిర్వహించుకోవచ్చని సీఎం కేసీఆర్ అనుమతి ఇచ్చిన నేపథ్యంలో మరింత విస్తృతంగా, కూలంకషంగా, అత్యంత పకడ్బందీగా నిర్వహించుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని పార్టీ ఎమ్మెల్యేలకు సూచించారు.

**సమాచార సైనికులుగా పార్టీ కార్యకర్తలు..**

ప్రతి ఆత్మీయ సమ్మేళనం కచ్చితంగా సీఎం కేసీఆర్ కార్యకర్తలకు రాసిన ఆత్మీయ సందేశంతోనే ప్రారంభించుకోవాలని కేటీఆర్ సూచించారు. సీఎం ఆత్మీయ సందేశం ప్రతి కార్యకర్తకు అందేలా అవసరమైన కరపత్రాల వంటి మెటీరియల్స్ సిద్ధం చేసి విస్తృతంగా పంపిణీ చేసుకోవాలన్నారు. పార్టీ తరపున ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పదవుల్లో కొనసాగుతున్న ప్రతి ఒక్కరూ ఈ ఆత్మీయ సమ్మేళనాల్లో హాజరయ్యేలా ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని చెప్పారు. ఈ ఆత్మీయ సమ్మేళనాల ద్వారా రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల వద్దకు తీసుకుపోయేందుకు అవకాశం లభిస్తుందన్నారు. తెలంగాణ సాధించిన అభివృద్ధిపైన విస్తృతంగా మాట్లాడేందుకు ప్రజాప్రతినిధులు, వక్తలను ప్రత్యేకంగా ఇందుకు ఉపయోగించుకోవాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాకముందు ఉన్న పరిస్థితులు, రాష్ట్రం వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి, అందివచ్చిన సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ కార్యకర్తలను సమాచార సైనికులుగా తయారు చేసేందుకు ఆత్మీయ సమ్మేళనాలు అద్భుతంగా ఉపయోగపడతాయని కేటీఆర్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీలది తెలంగాణపై కపట ప్రేమ

హైదరాబాద్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ ఘటనపై మంత్రి హరీశ్ రావు స్పందించారు. అలా జరగకూడదని దురదృష్టకమని అన్నారు. పేపర్ లీక్ అయితే ప్రతిపక్షాలు బయటపెట్టాయా.. మా ప్రభుత్వమే గుర్తించిందని అన్నారు. నిందితులపై కేసులు పెట్టి బొక్కలో వేసిందన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే పరీక్షలు పెడుతామని, ఉద్యోగాలు ఇప్పిస్తామని తెలిపారు. ప్రతిపక్షాల వలలో పడి అభ్యర్థులు మీ సమయం వేస్ట్ చేసుకోవద్దని సూచించారు. ప్రతిపక్షాలను నమ్ముకుంటే కుక్క తోక పట్టి గోదావరి ఈదినట్టే అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాయలున్న చెట్టుకే రాళ్ల దెబ్బలు పడుతాయి.. మట్టి పనికైనా ఇంటి పనికైనా మనోడు ఉండాలే అని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కి తెలంగాణపై ప్రేమ ఉంటది.. కాంగ్రెస్, బీజేపీ వాళ్లకి పెదవులపై ప్రేమ.. తెలంగాణపై కపట ప్రేమ అన్నారు. కేసీఆర్ తెలంగాణ పునర్నిర్మాణం కోసం పాటు పడుతున్నాడని అన్నారు. బీజేపోడు సమాధులు తవ్వుతా అంటాడు.. కాంగ్రెసోడు కూలగొడుతా అంటాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని వారి నాలుకకు నరం లేదని అన్నారు. కాళేశ్వరం దండగ అన్నారు.. వాళ్లవి అన్నీ గ్లోబెల్ ప్రచారాలు అని తెలిపారు.. కాళేశ్వరం దండగ కాదు పండుగ అని అన్నారు. కేసీఆర్ అనే అద్భుత దీపం రాదే రాదన్న తెలంగాణను తెచ్చిండని గుర్తు చేశారు. కానే కాదన్న కాళేశ్వరంని పూర్తి చేసి నీళ్లను అరకిలో మీటర్ పైకెత్తి నీళ్లను తెచ్చిండు పంట పండిందని తెలిపారు. ఢిల్లీలో కూర్చొని కాళేశ్వరం దండగ అంటున్నారు.. ఢిల్లీలో ఉన్నోనికి ఏం తెలుసు.. గల్లీలో ఉన్నోనికి కాళేశ్వరం గురించి తెలుసని హర్షం వ్యక్తం చేశారు. కాళేశ్వరానికి పెట్టిన పెట్టుబడి ఎప్పుడో తీరిపోయిందని అన్నారు మంత్రి. మహారాష్ట్ర నుంచి రైతులు మూడు బస్సులలో తెలంగాణ అభివృద్ధిని చూడటానికి వచ్చారన్నారు. దేశంలోని రైతులందరూ కేసీఆర్ వైపే చూస్తున్నారు.. మాకు కేసీఆర్ నాయకత్వం కావాలంటున్నారని తెలిపారు. మనం రైతుల కోసం ఆలోచిస్తున్నాం.. మోదీ అదానీ కోసం ఆలోచిస్తుందని ఎద్దేవా చేశారు. వడ్లు కొనమంటే కొనమని బీజేపీ చెప్పింది అదానీకెమో 12 వేల కోట్ల రూపాయలు మాఫీ చేస్తారు గానీ.. 4 వేల కోట్లు పెట్టి వడ్లు కొనడం చేతకాదా? అంటూ ప్రశ్నించారు. రైతు బిడ్డగా రేతు చేయి కింద పడొద్దని కేసీఆర్ అనుకుంటున్నారని తెలిపారు. 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం సచివాలయం దగ్గర పెడుతున్నామని తెలిపారు. సచివాలయానికి ఓ వైపు అమరుల త్యాగస్థూపం.. మరో వైపు అంబేడ్కర్ విగ్రహం అని స్పష్టం చేశారు. నెలకు 1500 కోట్లు ఖర్చు పెట్టి రైతులకు ఉచిత కరెంట్ ఇస్తున్నది సీఎం కేసీఆర్ అని గుర్తు చేశారు. జాతీయ స్థాయి అవార్డులు సాధించిన ఘనత సిద్దిపేట జిల్లాది అన్నారు. కాంగ్రెస్ పార్టీ 40 ఏళ్లు పాలించిన ఎవరికి ఏం చేయలేదన్నారు. ఈ నెల 16 నుంచి గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్ అందజేస్తాం.. రెండు సార్లు ఈ కిట్ ఇస్తామన్నారు. మెనిఫెస్టోలో లేని పథకాలు కూడా ఇస్తున్నాం.. ఓట్ల కోసం ఇదంతా చేయట్లేదని తెలిపారు. సద్ది తిన్న రేవు తలవాలన్నారు. గతంలో లాగా రైతుల ఆత్మహత్యలు లేవు.. గంజి కేంద్రాలు లేవు అన్ని మాయమైపోయాయని మంత్రి హరీశ్ రావు అన్నారు.

# సింహం సింగిల్‌గానే వస్తుంది..

(మొదటిపేజీ తరువాయి)

ఆలోచనలో ఉన్నాయంటూ ఆరోపించారు. చివరికి కేసీఆర్ సర్వే కూడా బీజేపీదే విజయం అని తేల్చిందన్నారు. పాలించమని కేసీఆర్‌కు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని ఉన్న పరిశ్రమలే మూతపడే స్థితికి తీసుకొచ్చాడన్నారు. కేసీఆర్ పరిశ్రమలు మూసివేయిస్తుంటే మోదీ రామగుండంలో మూతపడ్డ యూరియా ఫ్యాక్టరీని ఓపెన్ చేయించారన్నారు. కుర్చీ వేసుకుని కూర్చొని పోడు భూముల సమస్య పరిష్కారం చేస్తా అన్నారు. గిరిజన బిడ్డ మొదటి సారి రాష్ట్రపతి అవుతుంటే అడ్డుకునే కుట్ర చేశారంటూ ఆరోపించారు. విదేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకు వేల కోట్లు కేసీఆర్ కుటుంబానికి ఎక్కడి నుంచి వచ్చాయో తెలపాలన్నాడు. రెండు సార్లు కేసీఆర్‌కు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని 5 లక్షల కోట్ల అప్పుల్లోకి తీసుకువచ్చాడని, మళ్లీ అవకాశం ఇస్తే రాష్ట్రం మరింతం దిగజారుతుందన్నారు. మోదీ దేశాన్ని శక్తివంతమైన దేశంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నారు. కేసీఆర్ తెలంగాణలో బెంగాల్ తరహా పాలన సాగించేందుకు కుట్ర చేస్తున్నాడని బండి సంజయ్ అన్నారు. భారతీయ జనతా పార్టీ ఏ మతానికి, కులానికి కొమ్ము కాయదు. అలాగని హిందూ సమాజానికి అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు. మతఛాందస వాదులకు వ్యతిరేకమన్నారు. ఎక్కడ పచ్చ జెండాలు ఎగిరాయో అక్కడ కాషాయ జెండాలు ఎగరేసిన ఘనత బీజేపీది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ సిద్ధంగా ఉన్నారన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్న సంజయ్.. రుణమాఫీ, నిరుద్యోగ భృతి వెంటనే క్లియర్ చేయాలన్నారు. గిరిజనుల అభివృద్ధికి ఎన్నికోట్లు ఖర్చు చేశారో కేసీఆర్ శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**మోదీని తిట్టడం తప్ప వేరే పని లేదు..**

సీఎం కేసీఆర్‌పై బండి సంజయ్ తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. ధనిక రాష్ట్రాన్ని అప్పులమయం చేసిన కేసీఆర్‌కు... మోదీని తిట్టడం తప్ప వేరే పని లేదని విమర్శించారు. ప్రశ్నపత్రాల లీకేజీపై ముఖ్యమంత్రి ఇంతవరకూ ఎందుకు స్పందించట్లేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే.. కచ్చితంగా డబుల్ ఇంజిన్ సర్కార్ రావాల్సిందేనని స్పష్టం చేశారు.

# జనాకర్షక పథకాల కన్నా.. జనహిత పథకాలే మిన్న

హైదరాబాద్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): దేశంలో జనాకర్షక పథకాల కన్నా జనహిత పథకాలకు ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లో స్వర్ణ భారత్ ట్రస్ట్, యశోద హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముచ్చింతల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. పేదలకు దీర్ఘకాలిక మేలు కలగాలంటే తాత్కాలిక, జనాకర్షక పథకాల బదులు శాశ్వత ప్రాతిపదికన జనహితమైన కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేయాలని అన్నారు. అందుకోసం జనహితమైన విద్య, వైద్యం, నైపుణ్యాల పెంపు పథకాలకు నిధులు కేటాయించి అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలకు సూచించారు. పాశ్చాత్య ధోరణుల ఒరవడిలో కొట్టుకుపోతూ చిన్న పిల్లలు, యువత సహజసిద్ధమైన ఆహారం కానటువంటి జంక్‌ఫుడ్ తింటూ అనారోగ్యాలు కొని తెచ్చుకుంటున్నారని ప్రస్తావించారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు నిత్యం ఉదయం 6 గంటలకు నిద్ర లేచి వ్యాయామం, యోగా, ధ్యానం చేసినట్లైతే ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని తెలిపారు. మానవ మేధస్సు, సృజనాత్మక శక్తి ఉండాలంటే యువత సొంతంగా ఆలోచించాలి తప్ప.. ప్రతిదీ గూగుల్‌పై ఆధారపడవద్దని అన్నారు. అలాగే కొనసాగితే కొద్ది రోజుల్లో సొంత ఆలోచనలు పోయి పూర్తిగా నిస్తేజమవుతారని హెచ్చరించారు. అతిగా మొబైల్ ఫోన్ల వాడకం కూడా సరికాదని.. ప్రకృతితో మమేకమై పుస్తక పఠనంపై ప్రత్యేక దృష్టి సారిస్తే చురుకు పెరుగుతుందని సూచించారు. నెల్లూరు, విజయవాడ, హైదరాబాద్లో స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా, వైద్యం సేవలతో పాటు గ్రామీణ మహిళలు, యువత సొంత కాళ్లపై నిలబడేందుకు అవసరమైన నైపుణ్యాల పెంపు కోసం వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉపాధికి ఉత్తమ బాటలు వేస్తున్నామని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. స్వర్ణ భారత్ ట్రస్టు సేవలను ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం కొనియాడారు. అట్టడుగు వర్గాల పేదలను గుర్తించి వారికి సేవ చేయడం నిజంగా అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కామినేని శ్రీనివాస్, యశోద హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ సురేంద్రరావు తదితరులు పాల్గొన్నారు. 'పేదలకు దీర్ఘకాల మేలు కలగాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాత్కాలిక, జనాకర్షక పథకాల బదులు శాశ్వత ప్రాతిపదికన జనహితమైన కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేయాలి. శాశ్వత జనహితమైన విద్య, వైద్యం, నైపుణ్యాల పెంపు పథకాలకు నిధులు కేటాయించి అమలు చేయాలి. పేద ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో హైదరాబాద్, నెల్లూరు, విజయవాడలో స్వర్ణ బారత్ ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు, విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తున్నాము' అని వెంకయ్య నాయుడు అన్నారు.

## కరోనా కలవరం..

(మొదటిపేజీ తరువాయి)

సంఖ్య 4,41,73,335 (98.77%)కి పెరిగింది. ఇప్పటివరకు కరోనా మహమ్మారి కారణంగా మొత్తం 5,30,881 మంది ప్రాణాలు (1.19%) కోల్పోయారని కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కరోనా టీకా విషయానికొస్తే, రెండు సంవత్సరాల క్రితం జనవరి 16న ప్రారంభమైన దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ డ్రైవ్ కింద 2.2 బిలియన్ల కంటే ఎక్కువ మందికి కోవిడ్-19 వ్యాక్సిన్లు వేశారు. ఇందులో గత 24 గంటల్లో 2,799 డోస్లు ఇవ్వబడ్డాయి. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

## డిగ్రీ లేని వ్యక్తికి దేశంలోనే పెద్ద ఉద్యోగం

(మొదటిపేజీ తరువాయి)

రావని.. కానీ, డిగ్రీ లేని వాళ్లకు మాత్రం దేశంలోనే అత్యున్నత ఉద్యోగం ఉందని మోదీని ఉద్దేశించి ఆమె పరోక్షంగా ట్వీట్ చేశారు. కాగా.. ప్రధాని మోదీ విద్యార్హతలకు సంబంధించి ఎలాంటి డిగ్రీలు చూపించాల్సిన అవసరం లేదని గుజరాత్ హైకోర్టు ఇటీవల తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అయితే, దీనిపై ప్రతిపక్షాలు తమదైన శైలిలో విమర్శలు చేస్తున్నాయి. ఈ తీర్పుతో ప్రధాని మోదీ విద్యార్హత విషయంలో అనుమానం మరింత పెరిగిందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శనివారం అన్నారు. మోదీ విద్యావంతుడైతే పెద్ద నోట్ల రద్దు వంటి నిర్ణయాలు తీసుకుని ఉండకపోయేవారని విమర్శించారు.

## తీగలాగితే డొంక కదిలిందా?! మీకర్థమవుతోందా?

(మొదటిపేజీ తరువాయి)

చర్చనీయాంశంగా మారింది. అసలు ఆయన చెప్పిన బావబామ్మర్దులు ఎవరన్నదానిపై జోరుగా చర్చ సాగుతోంది. మరోవైపు పేపర్ లీక్ కేసులో సిట్ దూకుడు పెంచింది. ఇందులో భాగంగానే కమిషన్ సభ్యులకు నోటీసులు కూడా ఇచ్చింది. ఈ క్రమంలో టీఎస్పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, కమిషన్ సభ్యుడు లింగారెడ్డిలను సిట్ సుదీర్ఘంగా విచారించి వాంగ్మూలాలు నమోదు చేసింది. ఈ కేసులో అరెస్టయిన రమేష్, లింగారెడ్డి వద్ద పీఏగా పనిచేస్తున్నాడని, వీరిద్దరి మధ్య ఉన్న సంబంధాలపై సిట్ దర్యాప్తు చేస్తోంది. ఇది ఇలా ఉంటే.. ఇక మరోవైపు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి శుక్రవారం ఈడీకి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. లక్షల రూపాయలు చేతులు మారాయని, హవాలా కోణం కూడా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ లక్షలాది మంది ఉద్యోగుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందన్నారు. మనుషుల ముసుగులో మృగాళ్లు రాష్ట్రాన్ని పాలిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రిక్రూట్ మెంట్ ప్రక్రియ జాగ్రత్తగా జరగాలని రేవంత్ దుయ్యబట్టారు. ప్రశ్నపత్రాలు వందల కోట్లకు అమ్ముడుపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులపై అక్రమ అరెస్టులు, కేసులు పెడుతున్నారని రేవంత్ ఫైర్ అయ్యారు. అయతే రేవంత్ చేసిన ట్వీట్ ఇప్పుడు వైరల్ అవుతుంది. ఆ బావబామ్మర్దులు ఎవరు? అంటూ ఉత్కంఠంగా మారుతుంది.

## 8న రాష్ట్రానికి ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

సేవలనందించనున్న వందేభారత్ రైలును పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారు. ఇది దేశంలో ప్రవేశపెట్టనున్న 13వ రైలు. ఈ రైలు కారణంగా సికింద్రాబాద్ - తిరుపతిల మధ్య ప్రయాణ సమయం 12 గం.ల నుండి 08.30గం.ని.లకు తగ్గిపోతుంది. అనంతరం రూ.715కోట్లు ఖర్చు చేసి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నందు చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేయనున్నారు. ఇందులో భాగంగా రాబోయే 40 సంవత్సరాల వరకు ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను అందించటానికి వీలుగా రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న 25,000 మంది ప్రయాణికుల నుండి రద్దీ సమయంలో 3,25,000 మంది ప్రయాణికులకు కూడా సౌకర్యాలను అందించగలిగేలా రైల్వే స్టేషన్ సామర్థ్యాన్ని పెంచనున్నారు. రైల్వే స్టేషన్ లో ప్రస్తుతం ఉన్న 11,427 చదరపు మీటర్ల బిల్డింగ్ ఏరియాను అంతర్జాతీయ ప్రమాణాలతో 61,912 చదరపు మీటర్లకు పెంచటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. టెర్మినల్ బిల్డింగ్ నుంచి అన్ని ప్లాట్ ఫామ్స్‌ను కలిపేలా 108 మీటర్ల ప్రత్యేక డబుల్ లెవెల్ వంతెనను ఈ స్టేషన్ నందు ఏర్పాటు చేయనున్నారు. ఆధునికీకరణ పనులలో భాగంగా ఈస్ట్, వెస్ట్ మెట్రో స్టేషన్లకు, రాటిఫైల్ బస్ స్టేషన్‌కు నేరుగా కనెక్టివిటీని ఏర్పాటు చేయనున్నారు. మల్టీలెవెల్ కార్ పార్కింగ్, వచ్చే/వెళ్ళే ప్రయాణికులకు ప్రత్యేక మార్గాల ఏర్పాటు వంటి అనేక వసతులను అభివృద్ధి పనులలో భాగంగా కల్పించనున్నారు. సికింద్రాబాద్ - మహబూబ్ నగర్ మధ్యన రూ. 1,410 కోట్లు ఖర్చు చేసి పూర్తి చేసిన 85 కి.మీ.ల పొడవైన డబ్లింగ్ రైల్వే లైన్ ను జాతికి అంకితం చేయనున్నారు. సామాన్య ప్రజల రైలుగా మన్ననలు పొందిన ఎంఎంటీఎస్ ఫేజ్ -2లో భాగంగా హైదరాబాద్ నగర శివారు పట్టణాల వరకు నిర్మించిన నూతన రైల్వే లైన్ల మీదుగా నడవనున్న 13 కొత్త ఎంఎంటీఎస్ సర్వీసులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. ఎంఎంటీఎస్ ఫేజ్ - 2లో భాగంగా బొల్లారం మరియు మేడ్చల్ మధ్యన 14 కి. మీ. లు, ఫలక్ నుమా - ఉందానగర్ మధ్యన 14 కి. మీ. ల పొడవున కొత్త డబ్లింగ్ లైన్లను నిర్మించడం జరిగింది. ఈ అభివృద్ధి పనులు, వాటి ప్రయోజనాలకు సంబంధించి రూపొందించిన షార్ట్ ఫిల్మ్ ప్రదర్శనను ప్రధాని తిలకించనున్నారు. ఇకపై నగరం శివారు ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే సామాన్య ప్రజలు అతి తక్కువ ఖర్చుతో ప్రయాణించవచ్చు. అనంతరం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి పరేడ్ గ్రౌండ్ నందు ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ప్రధానమంత్రి చేరుకోనున్నారు. పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్న తరువాత మొదట రూ.7,864 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించను న్న 6 జాతీయ రహదారులకు, రూ.1,366 కోట్లతో బీబీనగర్ ఎయిమ్స్ నందు చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించ నున్నారు. బీబీ నగర ఎయిమ్స్ నందు అకడమిక్ కోర్సులకు అనుగుణంగా బిల్డింగ్ బ్లాక్‌ల నిర్మాణం, ఆడిటోరియం, స్టాఫ్ క్వార్టర్లు, హాస్టల్స్, గెస్ట్ హౌస్‌లు, హాస్పిటల్ బ్లాక్ ఆధునికీకరణ వంటి పనులను చేపట్టనున్నారు. ప్రాజెక్టుల భూమిపూజ కార్యక్రమం అనంతరం బహిరంగ సభకు హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు.

## టీఎస్పీఎస్సీ కమిటీ తొలగించి.. కొత్త కమిటీ వేయాలి

హైదరాబాద్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మరోసారి స్పందించారు. తాము ప్రశ్నాపత్రాల వ్యాపారాల పోరాట కమిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో అన్ని పార్టీల నేతలు, ప్రజాసంఘాలు, విద్యార్థి నేతలు కూడా ఉంటారన్నారు. టీఎస్పీఎస్సీ కమిటీని తొలగించి, కొత్తకమిటీ వేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఆ తర్వాతే భర్తీ చేయాలని కోరారు. ఈ లీకేజీ కారణంగా విద్యార్థులకు ఎంతో నష్టం జరిగిందని.. కాబట్టి ఒక్కొక్కరికి రూ. 1 లక్ష ఇవ్వాలని కోరారు. ఈ వ్యవహారంపై తాము ఒక పెద్ద కార్యక్రమాన్ని నిర్వహిద్దామని, హైదరాబాద్‌లో పెద్ద ధర్నా చేద్దామని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన వెళ్లి ఈ లీకేజీ గురించి వివరిద్దామన్నారు. తమని అరెస్ట్ చేసినా సరే, విద్యార్థులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నిరుద్యోగులకు భరోసా కల్పిస్తామన్నారు. ధర్నాకు ముందు పెద్దఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేద్దామన్నారు. లేకలేక ఒక నోటిఫికేషన్ వేసి, దాని పేపర్లు కూడా అమ్ముకున్నారని ఆరోపించిన ఆయన.. ప్రజలకు ఇదే చెబుదామన్నారు. అంతకుముందు.. టీఎస్పీఎస్సీ విషయంలో ఉద్యోగులే ప్రశ్నాపత్రాలు లీక్ చేసి, వ్యాపారం చేస్తున్నారని కోదండరాం ఆరోపించారు.

# కామ్రేడ్ బేబక్క సంతాప సభల వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ



కొత్తగూడ, ఏప్రిల్ 2 (మనం న్యూస్ ): సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సీనియర్ నాయకురాలు ఆదర్శ విప్లవ కమ్యూనిస్టు యోధురాలు కామ్రేడ్ బేబక్క( నిమ్మగడ్డ సరోజన ) సంతాప సభల వాల్పోస్టర్స్ ను పాకాల కొత్తగూడ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కామ్రేడ్ పాలడుగు కృష్ణ స్మారక భవనంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఖమ్మం వరంగల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన సంతాప సభల వాల్ పోస్టర్స్ ను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా యాదగిరి యుగంధర్ అఖిలభారత రైతు కూలి సంఘం మండల ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మార్చి 27 నుండి ఏప్రిల్ 10 వరకు కామ్రేడ్ బేబక్క సంతాప సభలను గ్రామ గ్రామాన జరపాలని ఏప్రిల్ 6న పాకాల కొత్తగూడా సెంటర్లో జరుగు బేబక్క సంతాప సభను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు కామ్రేడ్ బేబక్క ఆదివాసి ఆత్మబంధువు, పోడు భూముల పోరు పతాక ఆదర్శ విప్లవ కమ్యూనిస్టు యోధురాలు అని అన్నారు కామ్రేడ్ బేబక్క ఆశయాలను ముందుకు తీసుకపోవడంలో ప్రజలంతా ఐక్యమై ఉద్యమించాలని అన్నారు ఐఎఫ్టియు ఏరియా కమిటీ కార్యదర్శి పసునూరి రాజమల్లు ఐలబోయిన నరేష్ చిరబోయిన చేరాలు కాసర్ల సదయ్య కల్తి లింగ స్వామి గొంది కృష్ణ ఎతటి రామ్ రెడ్డి కిరణ్ స్వప్న వాల్పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లా

### పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎంఇఒ పూల్ చంద్
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- ఎస్ఐ బానోత్ వెంకన్న
- మండల వ్యాప్తంగా 346 మంది

పదవ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు

గార్ల, ఏప్రిల్ 2 (మనం న్యూస్) : పదవ తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీగా అన్ని ఏర్పాటులు చేసినట్లు మండల విద్యాధికారి పూల్ చంద్ ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు.గార్ల మండలంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలను కలుపుకొని మొత్తం 346 మంది విద్యార్ధిని విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఇఒ పేర్కొన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ,ఆశ్రమ పాఠశాలలో సెంటర్లు ఏర్పాటు చేసినట్లు విద్యార్థులు ఉదయం 8గం.30 ని.ల కల్లా పరీక్షా కేంద్రాలవద్దకు చేరుకోవాలని కోరారు.పదవ తరగతి పరీక్షలు ఉదయం 9.30 గం.ల నుండి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు నిర్వహించనున్నట్లు, విద్యార్థులకు, ఇన్విజిలేటర్స్ కు పరీక్షా హాల్ లోకి ఎటువంటి ఎలక్ట్రానిక పరికరాలు అనుమతి లేదని అన్నారు. రెండు పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఎంఇఒ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రెండు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అములు చేస్తన్నందున ఇద్దరి కంటె ఎక్కువగా గుంపులుగా ఉండరాదని పరీక్షా కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్ లను మూసివేయాలని గార్ల ఎస్ఐ బానోత్ వెంకన్న పేర్కొన్నారు.

### నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిన వారిని కఠనంగా శిక్షించాలి

బాదావత్ ప్రతాప్



గార్ల, ఏప్రిల్ 2 (మనం న్యూస్) : టి.ఎస్.పి.ఎస్ పేపర్ లీకేజ్ లో భాగస్వాములై నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిన ప్రతిఒక్కరిని తక్షణమే శిక్షించాలని ఇల్లందు నియోజకవర్గ బిఎస్పి అధ్యక్షులు బాదావత్ ప్రతాప్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో బహుజన్ సమాజ్ పార్టీ ఇల్లందు నియోజకవర్గ అధ్యక్షులు బాదావత్ ప్రతాప్ మాట్లాడుతూ టిఎస్పిఎస్ నిర్లక్ష్యం వలన 30 లక్షల విద్యార్థుల శ్రమ వృధా అయ్యిందని వారి జీవితాలు అస్తవ్యస్తంగా, నిరాశ్రయులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం యొక్క అసమార్థతల వలన 30 లక్షల విద్యార్థులు జీవితాలు చీకటిమయమయ్యాయని ఆరోపించారు. ఈ పేపర్ లీకేజీలో ఎంత పెద్ద వారైనా వారిని వెంటనే కఠినమైన శిక్షలు వేయాలని బిఎస్పి పార్టీ డిమాండ్ చేస్తున్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను, విద్యార్థులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ తన బిఆర్ఎస్ పార్టీ గురించి తప్ప రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి భద్రాద్రి జిల్లా కార్యదర్శి లేత ఆకుల కాంతారావు, ఇల్లందు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చిట్లపల్లి శ్రీనివాసరావు, గార్ల మండల అధ్యక్షులు అజ్మీరా వెంకన్న , బీఎస్పి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### మతుడి కుటుంబాన్ని పరామర్శించిన దొంతి



నెక్కొండ, ఏప్రిల్ 2, మనం న్యూస్ : మండలంలోని సూరిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొంకల చంద్రమౌళి ఇటీవల అనారోగ్యంతో మరణించారు ఆదివారం అతని దశదినకర్మకు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చంద్రమౌళి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, ఓబిసి జిల్లా కార్యదర్శి రాచకొండ రఘు, నాయకులు కుసుమ చెన్నకేశవులు, ఈదునూరి సాయికష్ణ, బండి శివకుమార్, మాదాటి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షులు కవిరాజ్, కోటగిరి సాంబయ్య, భాస్కర్, ప్రశాంత తదితరులు ఉన్నారు.

## మహనీయుల జయంతులే మా పండుగలుదళిత రత్న : ఎన్సిఎస్



వరంగల్, ఏప్రిల్ 2, మనం న్యూస్ : ఏప్రిల్ నెల అంటేనే గుర్తుకు వచ్చేది మహనీయుల జయంతులు అని (ఎమ్మార్పీఎస్ టిఎస్) జిల్లా అధ్యక్షులు, ఎస్సీ /ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మనిటరింగ్ కమిటీ మెంబర్. దళిత రత్న నమిండ్ల చిన్నస్వామి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నెల అంటేనే చరిత్ర ఆధారాలు ఏమైనా ఉన్నాయా అంటే ఉన్నాయని అంటున్నారు భారతదేశపు మొదటి ఉప ప్రధాని, గొప్ప పరిపాలన దాక్షుడు అగ్రవర్ణాల ఆగడాలను ధిక్కరించిన భారత అధికార స్వరం, నిమ్న జాతుల వర్గాలకు అభ్యున్నతికి అహర్నిశలు పోరాటం చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రావు జన్మించిన నెల. ఏప్రిల్ 5 భారతదేశంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టిన భారతదేశానికి బౌద్ధమే మార్గమని నమ్మి ఆచరించిన మొట్టమొదటి జ్ఞాన అశోక చక్రవర్తి జన్మించిన రోజు ఏప్రిల్ 9. అక్షరం కొందరిది కాదు అందరిదీ కావాలని ఆకాంక్షించిన ఆచరించిన భారతదేశ సామాజిక తొలి విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే జన్మించిన రోజు ఏప్రిల్ 11. భారతదేశానికి రాజ్యాంగం అందించిన ప్రపంచ మేధావి ప్రపంచ జ్ఞాన సూర్యుడు పనికిరాని మూఢనమ్మకాలను నడ్డి విరిచి ప్రతి ఒక్కరికి ఒక సీటు అని ప్రపంచానికి దిక్సూచిగా నిలిచిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జన్మించిన రోజు ఏప్రిల్ 14. తెలంగాణ ప్రాంతంలో పెట్రేగిపోతున్న భూస్వామ్య వ్యవస్థను రూపుమాపడానికి పురుడు పోసిన అడవి బిడ్డ కొమరం భీమ్ జన్మించిన రోజు ఏప్రిల్ 22. మరి ఇంత మందికి జన్మనిచ్చిన ఇంత గొప్ప మహత్తరమైన నేలను మనము మహనీయులను ప్రతి జిల్లాలో ప్రతి మండలాలలో ప్రతి గ్రామ గ్రామాన పండగ దినముగా జరుపుకోవాలని ఆ దేవుళ్ళ విగ్రహాలకు పూల మాలలు అభినందనలు ప్రతి ఒక్కరు తెలపాలని కోరారు.

### చనిపోయిన కుటుంబాలకు 40 వేల రూపాయలను అందించిన వైస్ ఎంపీపీ చల్ల సుధీర్ రెడ్డి



స్టేషన్ఘన్పూర్, ఏప్రిల్ 2, మనం న్యూస్ : తాటికొండ గ్రామంలో ఇటీవల కాలంలో వివిధ వార్డు లో మరణించిన 3 వార్డు, 4వార్డు,5వార్డు, 7 వార్డు, 8 వార్డు లోని నారదాస్ పాపమ్మ, పండుగ కొమరమ్మ, మారపాక వివేక్, మారపాక ఎల్లమ్మ, మారపాక ఎల్లయ్య, బలిజ అగమల్లమ్మ, మారపాక వెంకటమ్మ, వేణుముద్దల దామోదర్ రెడ్డి, వీరంతా ఇటివల కాలంలో మరణించగా ఘనపూర్ స్టేషన్ వైస్ ఎంపీపీ చల్ల సుధీర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఒక్కొక్క కుటుంబ సభ్యునికి 5000 రూపాయలు చొప్పున 8 మంది కుటుంబ సభ్యులకు 40,000 రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మారపాక రాములు, వార్డు మెంబెర్స్ బోయిని ఎల్లయ్య, ఉమ్మగోని రమ రాజు, మారపాక పద్మ నాగరాజు, పండుగ లక్ష్మి అశోక్, మారపాక రేణుక ఎల్లస్వామి, గ్రామ శాఖ అధ్యక్షులు పోన్నం శ్రీనివాస్, గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ గుర్రం దశరథం, పానుగంటి భాస్కర్, పండుగ రాజేశ్వర్, పండుగ కనకయ్య, పండుగ నర్సయ్య, పండుగ బుచ్చయ్య, నారదాసు కుమారస్వామి, మారపాక రామచందర్, అక్కనపల్లి వెంకటయ్య, మారాపాక సుధాకర్, యూత్ నాయకులు మారపాక శ్రీధర్, మారపాక సంపత్, మరాపాక శ్రీను, దామెర శ్రీను, బొల్లం నాగరాజు, బలిజ రాజు, పాలకుర్తి నాగరాజు, పులి రవి,బండ సంపత్, మారపక బాబు, మహిళలు పండుగ నర్సమ్మ బలిజ కొమరమ్మ, ఇస్రము జయ, గ్రామ, సిబ్బంది, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గార్లలో ఘనంగా మట్టల పండుగ మహోత్సవం

గార్ల, ఏప్రిల్ 2 (మనం న్యూస్) :గార్ల మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ నగర్ లోని సి ఎస్ ఐ క్రైస్తవ మందిరంలో ఆదివారం పాస్టర్ యాన్ డ్రోస్ ఆధ్వర్యంలో ఫామ్ సండే వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత భక్తి శ్రద్ధలతో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మట్టల ఆదివారాన్ని పురస్కరించుకొని గార్ల పట్టణ పురవీధుల గుండా సంఘ పెద్దలు మట్టలు పట్టుకొని ప్రభువైన ఏసుక్రీస్తు స్తుతింపబడునని క్రీస్తు పేరిట వచ్చే వారికి జయము జయము అంటూ పాపాల నుండి రక్షించడం కోసం యేసు క్రీస్తు ఈ భూమికి దిగి వచ్చారని చాటుతూ పెద్ద ఎత్తున విజయోత్సవంతో ర్యాలీ నిర్వహించారు పట్టణ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా పాస్టర్ యాంట్రోస్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు సిలువలో తన ప్రాణాన్ని అర్పించి మనుషుల పాపాన్ని విమోచించడానికి చివరిసారిగా విజయోత్సవముతో యెరుషలేములోనికి ప్రవేశించిన రోజున కొందరు మట్టలు పట్టుకుని ఆయనను స్తుతించిన రోజును గుర్తు చేసుకుంటూ మట్టల ఆదివారం జరుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్రీస్తు విశ్వాసులు



సెక్రటరీ రవితేజ, ట్రెజరర్ జోశ్న ,దేవా ,బిక్షం, సంఘ పెద్దలు జానీ, విజయ్, కిష్టాపర్, రాజు ,శోభారాణి, శాంతకుమారి తదితరులు ఉన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

### అంబేడ్కర్ సెంటర్ నుండి బస్ డిపో వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించిన పద్మశాలి సంఘ నాయకులు.... పాల్గొన్న ఎమ్మెల్యే చల్లా

పరకాల టౌన్, ఏప్రిల్ 2, మనం న్యూస్ : పరకాల పట్టణంలోని బస్ డిపో జంక్షన్ లో నూతనంగా ఏర్పాటుచేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆదివారం ఉదయం స్థానిక శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి ఆవిష్కరించారు. మొదటగా అంబేద్కర్ సెంటర్ నుండి బస్ డిపో జంక్షన్ వరకు ఏర్పాటుచేసిన భారీ బైక్ ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించి పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ హితామహుడు, స్వాతంత్ర సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టి నన్ను భాగస్వామిని చేసిన పద్మశాలి కులబాందవులకు కతజ్ఞతలు, నిరంకుశ నిజాం వ్యతిరేక, తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖుడిలో ఒకరు మన కొండా లక్ష్మణ్ బాపూజీ. కొమురం భీం జిల్లా వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27 న జన్మించిన బాపూజీ స్వాతంత్ర్యోద్యమంలో, నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నాడు. 1952 లో ఆసిఫాబాదు నుంచి ఎన్నికై హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్ శాసనసభలకు ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత కూడా శాసనసభ్యుడిగా నుంచి ఎన్నికై 1971 వరకు శాసనసభ్యునిగా కొనసాగారు. నిఖార్సయిన తెలంగాణ వాదంతో తెలంగాణ కోసం మంత్రి పదవిని కూడా తణప్రాయంగా వదిలిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయవేత్తగా నిలిచి తెలంగాణ ఉద్యమాలలో పాల్గొన్నారు. రాష్ట్ర చేనేత సహకార రంగానికి కూడా వారు ఎంతో కషిచేశారు. పివి నరసింహారావు తర్వాత ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చినా, ఇందిరాగాంధీ ఒప్పుకున్ననూ నాకు తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కావాలని కోరారు. సచివాలయం సమీపంలో హుస్సేన్ సాగర్ తీరాన (ప్రస్తుత నెక్లెస్ రోడ్డుపై) భూమి కొని జలదశ్యం నిర్మించుకుంటే ఆనాటి ప్రభుత్వం కూల్చివేసింది. కానీ తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు తర్వాత అదే స్థలంలో ప్రభత్వం అదే స్థలంలో బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఉద్యానవన విశ్వవిద్యాలయంకి కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంగా పేరు పెట్టడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా రాష్ట్రవ్యాప్తంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను నిర్వహిస్తోందని తెలిపారు. మహాత్మా గాంధీనే పద్మశాలి వత్తిని



చేపట్టారు. సూరత్, బీమండి తదితర ప్రాంతాలకు బ్రతుకుదెరువు కోసం వలసలు వెల్లినవారిలో మన ప్రాంతం వాళ్ళే అధికం. ఎందుకంటే ఆ ప్రాంతాలలో కేసీఆర్ ఆదేశం మేరకు స్టడీ టూర్ వెళ్ళడం జరిగింది. అది చూసే వారందరినీ తిరిగి రప్పించడం కోసమే సిఎం కేసీఆర్ మన నియోజకవర్గంలో కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమ ఏర్పాటు చేశారు. ఈ వస్త్ర పరిశ్రమలో పూర్తి స్థాయిలో కంపెనీలు స్థాపిస్తే దాదాపు ఒక లక్ష యాభైవేలకు పైగా ఉపాధి దొరుకుతుంది. ఇప్పటికే రైతుల సహకారంతో 1350 ఎకరాల భూసేకరణ చేసి కంపెనీలతో ఒప్పందం కుదిరింది. సూరత్, బీమండీ తదితర ప్రాంతాలకు వలసలు వెళ్లిన వారితో మాట్లాడి స్వంతగా కంపెనీలు ఏర్పాటు చేసుకునే మెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. మార్కండేయ గుడి నిర్మాణంలో తప్పకుండా నావంతు సహకారం ఉంటుంది. సహకార సంఘాల భవన నిర్మాణాలకు కూడా నిధులు కేటాయిస్తానని తెలిపారు. చేనేత కార్మికులకు కూడా ప్రభుత్వం అండగా నిలిచి వారి అభివద్ధికి కషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, మాజీ జెడ్పి చైర్మన్ సాంబారి సమ్మారావు, ఈగ మల్లేశం, మున్సిపల్ పాలక వర్గం, ఆయా మండలాల ఎంపిపిలు, జెడ్పిటిసి లు, సర్పంచులు, ఎంపిటిసి లు, పోపా అధ్యక్షులు డా పోతాయని రాజేశ్వర ప్రసాద్, బాలసాని దయాకర్, మార్త రాజు, దుంపేటి నాగరాజు, చిదురాల దేవేందర్, పద్మశాలి కుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 9న రాంజీ గోండ్ వర్ధంతిని జరుపుకోవాలని పిలుపునిచ్చిన తుడుందెబ్బ

కొత్తగూడ, ఏప్రిల్ 2 (మనం న్యూస్): ఆదివారం రోజున కొత్తగూడ గ్రామ పంచాయతీ ఆవరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలూరి రాజు అధ్యక్షతన జరిగిన సమావేశం లో రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి పాల్గొని మాట్లాడుతూ 1860 ఏప్రిల్ 9,న, ప్రాణత్యాగం చేసిన మర్సా కోల రాంజీ గోండు తో సహా 1000 మంది ఆదివాసి యోధుల బలిదానాన్ని కొమరం భీమ్ వారసుల ఆశయాలను కొనసాగించేందుకు .. ఆదివాసి తుడుందెబ్బ జెండాను పట్టుకొని ప్రతి ఇంటిపై ప్రతి గ్రామంలో ఆదివాసి తుడుందెబ్బ జెండాను ఎగరవేయాలని చదువుకున్న మేధావులు,విద్యార్థులు, ఉద్యోగులు, ఆదివాసీ పోరాట యోధుల స్మరిస్తూ ఆదివాసీల చైతన్యం కోసం ఆలోచన చేయాలని మన ఆదివాసీ జాతి పోరాట వీరుల చరిత్ర ఒకవేళ పుస్తకాల్లో లికించి ఉంటే చరిత్ర రాసి ఉంటే గనుక గోండ్వాన రాజ్యాలు(103) బయటికి వచ్చేవని ఆదివాసీల చరిత్రను కనుమరుగు చేసే విధంగా నేటి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్ని ఈ రాష్ట్ర ము కు సంబంధం లేని వారి ఉత్సవాలను అధికారికంగా నిధులు కేటాయించి నిర్వహించడం శోచనీయమని ఆదివాసీల పైన కొనసాగుతున్న దమన కాండకు వ్యతిరేకంగా మరిన్ని పోరాటాలు చేయాలని ఇందుకోసం తెలంగాణ వ్యాప్తంగా ఏప్రిల్ 9న రాష్ట్రము లోని అన్ని ఆదివాసీ గూడ లలో ప్రతి పల్లె,మండలం,జిల్లా కేంద్రలలో ప్రతి గ్రామంలో గోండుల తొలి పోరాట యోధుడు రాంజీ గోండ్ వర్ధంతిని రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకోవాలని ఘనంగా నివాళ్ళు అర్పిందాం అని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ విజ్ఞప్తి చేసింది బ్రిటిష్ -నిజాం నిరంకుశత్వాలకు ఎదురు నిలబడి ప్రాణాలర్పించిన ఘనత తొలి ఆదివాసి పోరాట యోధుడు మరసుకొల రాంజీ గోండ్ దని నిర్మల్ నడిబొడ్డున ఉన్న ఊడలమర్రి చెట్టుకు 1000 మంది ఆదివాసి పోరాట యోధులను 1860 ఏప్రిల్ 9న ఉరి తీశారన్నారు ఆదివాసీలను సంఘటితం ఐక్యమత్యం చేసే పనిలో భాగస్వాములు అవ్వాలని అదేవిధంగా రాంజీ గొండ్ 163,వ, వర్దంతి నీ ఘనంగా నిర్వహించుకోవాలని,రాజకీయ పార్టీల ప్రతి మీటింగ్ కి ప్రతి సమావేశాలకు క్రమం తప్పకుండా పిలవగానే హాజరైతున్న మనం మన గ్రామంలో మన ఆదివాసి జెండాను ఎగరవేసి రాంజీ గోండు వర్ధంతిని నిర్వహణ కోసం విస్తృతంగా సమాలోచన చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి



తుడుం దెబ్బ పిలుపునిచ్చింది ఈ సమావేశం లో ఆదివాసీ విద్యార్థి సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు సువర్ణపాక బాబీ, సిద్దబోయిన లక్ష్మీనారాయణ,ఆదివాసీ రైతు సంఘం నాయకులు సిద్దబోయిన జీవన్, ఉమ్మడి మండలం దొర పటేల్లా సంఘం అధ్యక్షులు బీరబోయిన సమ్మయ్య మనోజు తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్‌లో శుభప్రద్ పటేల్ ఆధ్వర్యంలో

# షాన్ దార్ ఇఫ్తార్ విందు

**తాండూర్ లో వెల్లివిరిసిన మత సామరస్యం**

**ఇఫ్తార్ విందుకు పెద్ద ఎత్తున హాజరైన ముస్లింలు**

**గంగా జమునా తెహజీబ్ కు తెలంగాణ ప్రతీక: శుభప్రద్ పటేల్**



తాండూరు ఏప్రిల్ 02 మనం న్యూస్ రంజాన్ మాసం సందర్భంగా తాండూర్ లో ముస్లింలకు రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ ఇఫ్తార్ విందును నిర్వహించారు. ఏ.ఆర్ గార్డెన్ ఫంక్షన్ లో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఛైర్మన్ తారిఖ్ అన్సారీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇఫ్తార్ దావత్ కు వచ్చిన ముస్లీం మత పెద్దలను టోపీ, రుమాల్ ధరింప చేసి శుభప్రద్ పటేల్ స్వాగతం పలికారు. దాదాపు 2 వెల మందికి పైగా ముస్లింలు హాజరై రోజా విరమించి అక్కడే ప్రత్యేక ప్రార్ధనలు ( నమాజ్ ) నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లీం పెద్దలను శుభప్రద్ పటేల్ గారికి ఆశీర్వదించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ.. రంజాన్ పండుగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా ముస్లింలు నెల రోజులు ఎంతో నిష్ఠతో ఉపవాసం పాటిస్తారన్నారు. వారు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు





చేయడం జరిగిందన్నారు. దేశంలోనే తెలంగాణ గంగా, జమునా తెహజీబ్ ఆదర్శ ప్రాయమని పేర్కొన్నారు. తెలంగాణలో అన్ని మతాలు, కులాలు సమానమేనని, గత ఐదేళ్ల నుంచి మత సామరస్యం మరింత వెల్లివిరుస్తోందని అన్నారు. భవిష్యత్తులో సైతం తాండూర్ లో గంగా జమునా తెహజీబ్ మరింత ఆదర్శంగా కొనసాగాలని శుభప్రద్ పటేల్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు సీనియర్ ఉద్యమకారుడు ఆబిద్ చౌష్, నాయకులు ముస్తఫా పటేల్, జావీద్ లాల, షేక్ ఫరీద్, సాదిక్, సయ్యద్ కమల్ అత్తర్, ముజీబ్, రహీం అబ్దుల్ గని, శుభప్రద్ యువసేన సభ్యులు భాను ప్రసాద, కుర్వబాలు, శ్రీశైలం, విజయ్, నరేష్ గౌడ్ ,రాము, రామ కృష్ణ, ఆబిద్ చౌష్, హరీష్ అనువార్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ | రంగారెడ్డి వికారాబాద్

### శ్రీ భవాని మాత 49వ జాతర ఉత్సవాలు రెండవ రోజు అమ్మవారికి కుంకుమార్చన





బషీరాబాద్ ఏప్రిల్ 2 మనం న్యూస్: బషీరాబాద్ మండలం లో భవాని నగర్ గ్రామం దామర్ చేడ్ లో 49వ భవాని మాత జాతర ఉత్సవాల సందర్భంగా రెండవ రోజు శ్రీ అంబభవాని మాత దేవస్థానంలో శ్రీ శంకర్ స్వామీజీ ఆధ్వర్యంలో జరుగుతున్న స్వామీజీలు మరియు108 దంపతులు అమ్మవారికి అభిషేకాలు చేసినారు అలాగేవివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలచే లక్ష కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మరియు యజ్ఞ కార్యక్రమం కూడా నిర్వహించడం జరిగిందని శంకర స్వామీజీ పేర్కొన్నారు.

### అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణకు బహుజనులు తరలిరండి ప్రజా సంఘాల నాయకులు



బషీరాబాద్ ఏప్రిల్ 2 మనం న్యూస్: భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశజోతి డా. బాబా సాహెబ్ విగ్రహా ఆవిష్కరణ లో బహుజనులు అంత వెళది గా తరలి రావాలని దళిత సంఘాల నాయకులు పిలుపు నివ్వడం జరిగింది... బషీరాబాద్ మండల్ కంసాన్ పల్లి బి గ్రామం లో ఏప్రిల్ 5వ తేదీ నా అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని ఇట్టి కార్యక్రమంలో దళిత బహుజన సంఘాల నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంని విజయవంతం చేయాలనీ బహుజన సంఘాల నాయకులు గ్రామా పెద్దలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ వెంకటయ్య కొడంగల్ నియోజకవర్గం అంబేద్కర్ సంఘం అధ్యక్షులు రమేష్ బాబు ఎంఎస్ పి బషీరాబాద్ ఇంచార్జి కృష్ణ, కేవిపిస్ మండల అధ్యక్షులు ఎడ్ల సురేష్, వెంకటప్ప, శివ, శామప్ప, బసవరాజు తదితరులు పాల్గొన్నారు...

### దేవాలయాల అభివృద్ధికి కృషి కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి



ఎల్బీనగర్ ఏప్రిల్ 2(మనం న్యూస్): దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయి అని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు.రంగారెడ్డి జిల్లా యాచారం మండలంగున్ గల్ గ్రామం లో నూతనంగా నిర్మిస్తున్న ముదిరాజ్ కులస్థుల కుల దైవం పెద్దమ్మ తల్లి, గంగ దేవి ఆలయ నిర్మాణానికి రూ.25000 లను విరాళంగా ఆదివారం ఆర్కే పురం డివిజన్ లోని తన నివాసం లో అందచేశారు. సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కోసం కమిటీ సభ్యులు సంప్రదించగా తన వంతు 25 వేల రూపాయలు విరాళం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గిరమోని బిక్షపతి ముదిరాజ్, సంఘం సభ్యులు గిరమొని దుర్గయ్య, గిరమోని నాగేష్, గిరమొని రవీందర్, పూజారి రాకేష్, గొట్టం మహేష్, గొట్టం మధుకర్, మారమొని రవి, కాల్వ రాజు తదితరులు పాల్గొన్నారు.

### చిరుధాన్యాలు తీసుకోవడంపై అవగాహన సదస్సు




తాండూర్ టౌన్ ఏప్రిల్2( మనం న్యూస్) జాతీయ పార్టీ పిలుపుమేరకు ప్రవాస్ యోజనలో భాగంగా మిల్లెట్స్ పై అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ బాలింతలకు పోషక ఆహారాలు ఏ విధంగా తీసుకోవాలి, ఏ పోషకారాలు తీసుకుంటే ఆరోగ్యపరంగా ఉండవచ్చు అనే దానిపై వైద్యులచే సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయిన బాలింతలకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో జాతీయ నాయకులు కరుణాసాగర్, మహిళా మోర్చా ఇంచార్జ్ ప్రసన్న, జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహు శ్రీలత, జిల్లా కన్వీనర్ శృతి, జిల్లా మహిళా మోర్చా సెక్రెటరీ రేణుక, వైస్ ప్రెసిడెంట్ ఆరతి, బషీరాబాద్ మండల అధ్యక్షురాలు వీరమని, తదితర మహిళలు పాల్గొన్నారు.



### హనుమాన్ మందిర నిర్మాణానికి 51 వేల రూపాయలు అందజేసిన బిఆర్ఎస్ నాయకులు వడ్ల నందు



వికారాబాద్/ధారూర్ ఏప్రిల్ 2 మనం న్యూస్:ధారూర్ మండల కేంద్రంలో హనుమాన్ మందిర ఆలయ నిర్మాణానికి వడ్లనందు ఫౌండేషన్ చైర్మన్ వడ్ల నందు ఆదివారం 51000 రూపాయల నగదును గ్రామస్తులకు అందజేశారు.హనుమాన్ మందిర ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా ఆర్థిక సాయం అందజేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.భగవంతుని ఆశీర్వాదంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ధారూర్ మండల పరిషత్ ఉపాధ్యక్షులు విజయ నాయక్, భారాస నాయకులు యూనుస్, ఫజిల్ ,లక్ష్మయ్య, అంజయ్య ,కాంగ్రేస్ నాయకులు బుజ్జయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### పిల్లల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసే ఆట చెస్




సూర్యాపేట టౌన్ ఏప్రిల్ 02 మనం న్యూస్ః చెస్ పోటీలు పిల్లల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీస్తాయని, వారిలో మేధాశక్తిని పెంపొంది స్తాయని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టిటిడి కళ్యాణ మండపంలో అండర్ 7, 13, 17 చెస్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... చెస్ పోటీలను బాలబాలికలకు వేరువేరుగా నిర్వహించి వివిధ కేటగిరిలో గెలుపొందిన 12 మంది విజేతలను ఈ నెల 8న రాష్ట్ర స్థాయిలో నిర్వహించబోయే పోటీలలో పాల్గొనేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెస్ పోటీలలో పాల్గొన్న చిన్నారుల తల్లిదండ్రులు, నాగరాజు, సతీష్, తెరటపల్లి సతీష్, మురళి, జానయ్య, సాయికూమార్ తదితరులు పాల్గోన్నారు.

### పది పరీక్షలకు బందోబస్తు సీఐ అప్పయ్య



వికారాబాద్/ధారూర్ ఏప్రిల్ 2 మనం న్యూస్:పది పరీక్షల కేంద్రాలు ధారూర్, కోట్ పల్లి, బంట్వారం పరీక్ష కేంద్రాల సమిపంలో 144 సెక్షన్ విధించడం జరిగిందని తెలిపారు,కావున కేంద్రాల వద్ద ఎక్కువ మంది గుమి గూడరాదన్నారు.దీంతో పాటు జిరాక్స్ కేంద్రాలను మధ్యాహ్నం ఒకటి గంటల వరకు మూసివేయాలని అన్నారు. కేంద్రాల లోపలికి విద్యార్థులకు, ఇన్విజిలేటర్లు,పరీక్ష పర్యవేక్షణఅధి కారులకు మాత్రమే అనుమతి ఉంటుందని,గేటుమూసిన తరువాత లోపలికి వెళే అనుమతి ఇతరులకుఉండదన్నారు.పరీక్షా కేంద్రాల వద్ద ఏదైనా అవాంచనీయ సంఘటనలు జరిగితే డయల్ 100 లేదా పోలీసులకుఫిర్యాదు చేయాలని సూచించారు.పరీక్షలు ప్రశాంతంగా ముగిసేంత వరకు అందరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల తల్లిదండ్రులు బంధువులు పరీక్ష కేంద్రాల వద్ద ఉండి విద్యార్థులకు ఏమైనా బయట నుండి అందించాలని ప్రయత్నం చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సిఐ హెచ్చరించారు. విద్యార్థులు ఏలాంటి వత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు.

### రాష్ట్రంలో అవినీతి పరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి




నడిగుడెం ఏప్రిల్ 02 మనం న్యూస్ః రాష్ట్రంలో అవినీతి పరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తమిళనాడు బిజేపి మహిళా మోర్చా ఇంచార్జ్ నదియా శ్రీనివాసన్ అన్నారు. ఆదివారం తెలంగాణ ప్రవాస్ రెండు రోజుల కార్యక్రమంలో ఆమె పాల్గోన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..... ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశ పెడుతున్న పథకాలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ పేరు మారుస్తు తప్పు దోవ పట్టిస్తున్నారని అన్నారు. అదేవిధంగా ప్రధాని మోడీ ప్రవేశ పెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మారుమూల గ్రామాలకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళమోర్చా నాయకురాళ్లు బోరా శకుంతల, పరిణిత, పద్మారెడ్డి, సులోచన, ప్రమీల, బ ండారు శోభారాణి, కొండయ్య, లతీఫ్, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గోన్నారు.

### డాక్టర్ రామ్మూర్తి యదవ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు

సూర్యాపేట టౌన్ ఏప్రిల్ 02 మనం న్యూస్ః పట్టణానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయడు జ్యోతి కరుణాకర్ జన్మదిన వేడుకలను డాక్టర్ రామ్మూర్తి యాదవ్ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రామ్మూర్తి యాదవ్ మాట్లాడుతూ..... కరుణాకర్ ఇలాంటి జన్మదినవేడుకలను ఎన్నో జరుపుకోవాలని, ప్రజాసేవ కార్యక్రమాలను ఎన్నో నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రత్యేక తయారు చేయించిన కేకును కట్ చేయించారు. అనంతరం ఆలేటి అనాథ, వృద్ధుల, వికలాంగుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడిపుడి వెంకటేశ్వర్లు, రాజా, లక్ష్మణరావు, లక్ష్మీకాంత్, ఆంగోతు బావ్ సింగ్, నిమ్మల వెంకన్న, తదితరులు పాల్గోన్నారు.



### ఎమ్మెల్యే సహకారంతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు



కోడంగల్ ఏప్రిల్2 మనం న్యూస్కోడంగల్ ఎమ్మెల్యే పట్నంనరేందర్ రెడ్డి సహకారంతో కోడంగల్ పట్టణంలో ఐదులక్షల రూపాయలతో రెండు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. రెండవ వార్డు కౌన్సిలర్ మధుసూదన్ రావు యాదవ్ దగ్గరుండి కోడంగల్ పట్టణంలో రెండు చోట్లా హైమాస్ట్ లైటు ఏర్పాటు చేయించారు. ఈసందర్భంగా ఆయా కాలనీ వాసులు ఎమ్మెల్యే పట్నంనరేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### విద్యార్థులను ప్రోత్సహిస్తే రాణింపు చైర్మన్ ఎం వెంకటనారాయణ




ఎల్బీనగర్ ఏప్రిల్ 2 (మనం న్యూస్): ప్రాథమిక స్థాయిలోని విద్యార్థులను బలమైన పునాదులు వేసే బాధ్యత ఉపాధ్యాయులదని, వారిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఉన్నత పౌరులుగా రాణిస్తారని గౌతమ్ వరల్ పాఠశాల చైర్మన్ ఎం వెంకటనారాయణ అన్నారు. సరూర్ నగర్ లోని గౌతమ్ వరల్ పాఠశాల 4వ ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల చైర్మన్ ఎం వెంకటనారాయణ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్య అభ్యసించినప్పుడు పొందే ఆనందం అందించడం కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎంతో భావోద్వేగాలతో ఆనందోత్సాహాలతో నిర్వహించడం జరిగిందన్నారు.విద్యార్థులకు పాఠశాల దశ ఎంతో ముఖ్యమైనది అన్నారు. క్రమశిక్షణ, పెద్దల యందు గౌరవం లను చిన్న అప్పటినుంచి అలవాటు చేయాలని అన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి.ఈ కార్యక్రమంలో సెక్రటరీ కరస్పాండెంట్, డైరెక్టర్స్ శ్రీకాంత్, భరత్, ప్రిన్సిపల్స్ ప్రత్యూష ,కవిత,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నల్గొండ సూర్యాపేట-యాదాద్రి

# నేటి నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 107 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 19414 మంది విద్యార్థులు
- పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- డి ఈ ఓ బిక్షపతి



నల్లగొండ, ఏప్రిల్ 2 (మనం న్యూస్): నేటి నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాటను పూర్తి చేసింది. ఈ నెల మూడో తేదీ నుండి 13వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించను న్నారు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. పదవ తరగతిలో ఆరు సబ్జెక్టులకు11 పరీక్షలు కాకుండా ఆరు పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ సంవత్సరం విద్యార్థులు 5 నిమిషాలు ఆలస్యంగా పరీక్ష కేంద్రానికి వచ్చినా కూడా అనుమతినిచ్చే వెసులుబాటు కల్పించారు. హాజరుకానున్న 19414 మంది విద్యార్థులు ఈ సంవత్సరం జిల్లాలోని 32 మండలాలలో 107 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన 19414 పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 19234 మంది, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు 180 ఉన్నారు. పరీక్షా కేంద్రాలకు సంబంధించిన అధికారులకు,ఇన్విజి లెటర్లకు ఒకసారి శిక్షణ పూర్తి అయినది. 107 మంది చీఫ్ సూపరెంటెంట్లు, 107 మంది డిఓ లు, ఇంకా కస్టోడియన్ అధికారులను నియమించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుజిల్లాలోని 107 పదవ తరగతి పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే అధికారులు ప్రశ్నపత్రాలను ఓపెన్ చేయనున్నారు. విద్యార్థుల కోసం విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం, వైద్య సౌకర్యాలను కల్పించారు. పరీక్షా కేంద్రాల మధ్య వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉండనున్నారు. విద్యార్థులు హాల్ టికెట్లను ఆన్లైన్లో డౌన్లోడ్ చేసే విధంగా సౌకర్యం కల్పించారు పరీక్ష కేంద్రాల వద్ద, పరీక్షా కేంద్రాలలో అధికారులకు గాని, విద్యార్థులకు సెల్ ఫోన్ అనుమతి లేదు. పరీక్షా కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరు తమ వెంట గుర్తింపు కార్డులను కోరారు.

జిల్లాకు చేరిన ప్రశ్న పత్రాలునల్గొండ జిల్లా సంబంధించిన జిల్లా కేంద్రంలోని డిఈఓ కార్యాలయానికి చేరాయి. వాటిని పోలీసు బందోబస్తు మధ్య భద్రపరిచారు. అన్ని మండలాల పోలీస్ స్టేషన్ల కు ప్రశ్నపత్రాలను శనివారమే తరలించారు. పరీక్ష రోజు గంట ముందు కస్టోడియన్లు పోలీస్ సిబ్బందితో కలసి ప్రశ్నపత్రాలను పరిషత్ కేంద్రాలకు తీసుకువెళ్తారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు 40 నిమిషాల ముందే చేరుకోవాలి డిఇఓ బిక్షపతి విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు 40 నిమిషాలకు ముందుగానే చేరుకోవాలి. పరీక్షా కేంద్రాల చిరునా మాను ముందుగానే తెలుసుకుంటే బాగుంటుంది. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వచ్చేటప్పుడు పరీక్ష ప్యాడు పెన్ను పెన్సిల్ ఎరేజర్ తీసుకొని రావాలి. పరీక్షలు రాసేటప్పుడు ఎలాంటి భయాందోళనలకు గురి కావద్దు. ప్రశాంతమైన వాతావరణం లో పరీక్షలు రాసి మంచి ఫలితాలు వస్తాయి.

## పదవ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



గుండాల, ఏప్రిల్ 2 (మనం న్యూస్): ఈనెల 3 నుండి ప్రారంభమయ్యే 10 వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాధికారి శ్రీధర్ తెలిపారు ఆదివారం రోజున ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు మొత్తం 213 మంది ఉన్నారని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్లో ఫర్నిచర్ లైటింగ్ ఫ్యాన్లు సీసీ కెమెరాలు చేశామని తెలిపారు 11 పరీక్షలకు గాను ఈసారి ఆరు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పరీక్షలు రాసే విద్యార్థులు ఉదయం ఎనిమిది గంటల 30 నిమిషాలకు పరీక్షా సెంటర్ కు హాజరు కావాలని కోరారు పరీక్షలు ఉదయం తొమ్మిది గంటల 30 నిమిషాల నుండి 12:30 వరకు పరీక్షలు జరుగుతాయని అన్నారు పదవ తరగతి పరీక్షలకు 15 మంది ఇన్విజిలేటర్లను నియమించబడినట్లు తెలిపారు.

## ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి



మోత్కూరు, ఏప్రిల్ 2 (మనం న్యూస్): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భముగా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని ఆదివారం మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యములో పాపన్న గౌడ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీపిరెడ్డి సావిత్రి మేఘారెడ్డి కమీషనర్ సి.శ్రీకాంత్ వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, వార్డు కౌన్సిలర్లు పురుగుల వెంకన్న, కారుపోతుల శిరీష, వనం స్వామి, బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి, కో ఆప్షన్ సభ్యులు గణగాని నర్సింహ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాల ధరల పెంపుపై హర్షం వ్యక్తం చేసిన రైతులు



గుండాల, ఏప్రిల్ 2 (మనం న్యూస్): విజయ డైరీలో లీటర్ పాలకు ఏడు రూపాయలు పెంచడంపై ఆదివారం రోజున మండలంలోని తురకల షాపురం గ్రామ పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా పాల సంఘం చైర్మన్ కొమ్ము మల్లయ్య మాట్లాడుతూ విజయ డైరీ పాల సెంటర్లో ఒక లీటర్ పాలకు 10 ఫ్యాట్ వస్తే ఏడు రూపాయలు అదనంగా అందుతాయని తెలిపారు దీనితో లీటర్ కు 80 రూపాయలు పొందవచ్చని తెలిపారు. నర్రముల సోమన్న వీరబోయిన లింగస్వామి లింగయ్య రమేష్ సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి

గుండాల, ఏప్రిల్ 2 (మనం న్యూస్): బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న 313 వ వర్ధంతిని పురస్కరించుకొని మండలములోని గ్రామాల తోపాటు మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం రోజున నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రాజ్యాధికారం కోసం పోరాడిన వీరుడు దొరల అరాచకాలను మొగులాయి దౌర్జన్యాలను ఎదిరించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాండ్ర అమరావతి శోభన్ జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎండి ఖలీల్ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు దారా సైదులు గిరి కత్తుల శ్రీనివాస్ సుధ గాని రామచంద్రు పొడిచేటి వెంకన్న గూడ మధుసూదన్ సోదగాని గిరి బాలరాజు కనకయ్య ఏక స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

-బుర్రు.అనిల్ కుమార్ ఎస్. ఎఫ్.ఐ. జిల్లా అధ్యక్షులు



మోత్కూరు, ఏప్రి ల్ 2 (మనం న్యూ స్): మాస్ కాపీయింగ్ కు పాల్పడితే ఉద్యమా లు ఉదృతం చేస్తాం అని ఎస్. ఎఫ్.ఐ. జిల్లా అధ్యక్షులు బుర్రు.అనిల్ కుమార్ అన్నారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ మూడవ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించలని ఎస్.ఎఫ్.ఐ. జిల్లా అధ్యక్షులు బుర్రు.అనిల్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు.గతంలో యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా పలు సెంటర్లలో మాస్ కాపీయింగ్ పాల్పడిన సంఘటనలు ఎన్నో ఉన్న కూడా అధికారులు చూసి చూడనట్టు వ్యహరిస్తున్నరే తప్ప కనీసం మాస్ కాపీయింగ్ ను అరికట్టడంలో పూర్తిగా విఫలమైందనరని ఆరోపించారు.ఈ సారి అయిన మాస్ కాపీయింగ్ కు పాల్పడకుండా స్థానిక డిఇఓ,యంయిఓ,తగ్గిన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ గా డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్. ఎఫ్.ఐ. మండల అధ్యక్షులు ఇంజ ప్రశాంత్, వినయ్,భాస్కర్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన వ్యక్తిని సస్పెండ్ చేయడం అప్రజాస్వామికం



మర్రిగూడ, ఏప్రిల్ 2 (మనం న్యూస్) ప్రతి ఒక్క వ్యక్తికి ప్రతిక్షణం అందుబాటులో ఉంటు నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన వ్యక్తిని ఇలా అర్ధాంతరంగా బాధ్యతల నుండి తొలగించడం ఆప్రజాస్వామికమని మర్రిగూడ మాజీ ఎంపీపీ అనంతరాజు గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రాలోని పత్రికా విలేకరుల సమావేశంలో మర్రిగూడ మాజీ ఎంపీపీ అనంత రాజు గౌడ్ మాట్లాడుతు పిఆర్టియు సంఘంలో గత 20 సంవత్సరాల నుండి సంఘం బలోపేతానికి నిరంతరం శ్రమిస్తూ కిందిస్థాయి నుండి పలు బాధ్యతలు నిర్వర్తించి నాడు జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించే స్థాయికి ఎదిగినటువంటి వ్యక్తి సుంకరి బిక్షం గౌడ్ అని అంతేకాని సంఘానికి కళంకం తెచ్చేటువంటి దిగజారుడు పనులు చేసే వ్యక్తి కాదని, అలాంటి వ్యక్తిని కొంతమంది సంఘం నాయకులు అతని ఎదుగుదలను చూసి ఓర్వలేక వారి స్వలాభం కోసం కక్షపూరితంగా చేస్తున్నటువంటి కుట్రలో భాగంగానే అతన్ని సస్పెండ్ చేశారని. అతన్ని సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని అనంత రాజు గౌడ్ అన్నారు. అతన్ని సస్పెండ్ చేయడం పీఆర్టియు రాష్ట్ర నాయకత్వానికి లేదని అతను నామినేటెడ్ గా ఎన్నుకోబడలేదని, ఎలక్షన్స్ ద్వారా పీఆర్టియు సంఘంలోని ప్రాథమిక సభ్యత్వం కలిగిన సభ్యులు, ప్రధాన కార్యదర్శిలు ఓటు వేసి ఎన్నుకున్నారని. కావున అలాంటప్పుడు అతనిపై వచ్చిన ఆరోపణలు నిర్ధారణ అయితే వారే తొలగిస్తారని మొదటగా అతనిపై వచ్చిన ఆరోపణలను రుజువు చేయాలని, ఎలాంటి ఆధారాలు చూపించకుండా సస్పెండ్ చేయడం ఒక బీసీ బిడ్డ అయినందుకేనా అని పిఆర్టియు రాష్ట్ర నాయకత్వాన్ని ప్రశ్నించారు. సంఘం కొరకు నిరంతరం శ్రమించినటువంటి వ్యక్తిని సస్పెండ్ చేయడం బహుజనుల ఎదుగుదలను నీరుకార్చే విధంగా ఉందని అన్నారు. సుంకరి బిక్షం గౌడ్ ను పిఆర్టియు జిల్లా బాధ్యతల నుండి తొలగించ డంపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయనీలు పలువురు నిరంతరం సంఘం శ్రేయస్సు కొరకు శ్రమించే ఇలాంటి వ్యక్తిని సస్పెండ్ చేయడం పట్ల వారు చాల ఆందోళన పరిస్థితుల్లో ఉన్నారని. ఈ సందర్భంగా అతను తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర నాయకత్వం వెంటనే పునరాలోచన చేసి అతన్నికి మరల పిఆర్టియు జిల్లా బాధ్యతలు అప్పజెప్పాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర మొత్తం ఏకధాటిగా ధర్నాలు రాస్తారోకలు నిర్వహిస్తామని పిఆర్టియు రాష్ట్ర నాయకత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడ బీసీ నాయకులు పందుల రాములు గౌడ్, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్ గౌడ్, మర్రిగూడ పిఎసిఎస్ చైర్మన్ పందుల యాదయ్య గౌడ్, బీసీ సంఘం నాయకులు వీరమళ్ళ లోకేష్, నల్ల శేఖర్, పందుల యాదయ్య తదితరులున్నారు.

## శ్రమజీవుల రాజ్యం సాధించడమే సర్దార్ సర్వాయి పాపన్నకు నిజమైన నివాళి

చండూర్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): నేడు అధికారం సంపన్నుల చేతిలోకి వెళ్లిపోయింది అని, శ్రమజీవుల రాజ్యం సాధించడమే సర్దార్ సర్వాయి పాపన్నకు నిజమైన నివాళి అని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ్య గౌడ్ అన్నారు. ఆదివారం చండూరు మండల పరిధిలోని నేర్మట గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాన్యమైన కల్లుగీత కార్మిక కుటుంబంలో జన్మించిన పాపన్న తన మిత్రులతో కలిసి, సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారని వారన్నారు. తెలంగాణలో గోల్కొండ కోట తోపాటు 20కోటలను జయించిదాదాపు కొన్ని ఏళ్ళు రాజ్యపాలన చేసిన బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని వారు కొనియాడారు. మంచి పరిపాలన దక్షకుడిగా చరిత్రలో నిలిచిన దీరుడు అని వారు అన్నారు. పాపన్న స్ఫూర్తితో నేటి తరం శ్రామిక రాజ్యం కోసం పోరాడాలని అన్నారు.ఈ కార్యక్రమంలోతెలంగాణ కల్లుగీత కార్మిక సంఘంనేర్మట గ్రామ శాఖ అధ్యక్షులు బురకల అంజయ్య గౌడ్, ఉపాధ్యక్షులుబండమీది వెంకటయ్య,బుర్కల నగేష్,కట్ట వెంకన్న,ఈరగట్ల యాదయ్య, కొత్తపల్లి వెంకన్న, సరస్వతి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా జరిగిన పరిశుద్ధ మట్టల ఆదివారం పండగ

కోదాడ, ఏప్రిల్ 2 (మనం న్యూస్): స్థానిక నయా నగర్ లోని బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ వి యేసయ్య ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే కు ముందుగా వచ్చే ఆదివారం పరిశుద్ధ మట్టల ఆదివారం పండుగా క్రైస్తవులు ఎంతో భక్తిశ్రద్ధలతో సంతోషంగా ఖర్జూర మట్టలు చేతపట్టుకుని ఏసుప్రభు వారికి స్వాగతం పలుకుతూ ఘనంగా జరుపుకుంటారు అని అన్నారు. ప్రభువు వారు రాజుగా యెరూషలేములో శాంతి దూతగా ప్రవేశించిన రోజున ఎంతో ప్రశస్తమైన రోజుగా క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభువును స్తుతిస్తూ ఆరాధిస్తారు.పిఆర్ టియు జిల్లా గౌరవ అధ్యక్షులు బొల్లికొండ కోటయ్య,నడిగూడెం ఎంపీపీ యాతాకుల జ్యోతి మధు బాబు,జగ్గు నాయక్,కళ్యాణ్,మోజస్,గురునాథ్,శ్యాం బాబు,జోయల్ ,రాంబాబు, తబిత,మౌనిక,మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్సీ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడిలకు గురికాకుండా ఉత్సాహంగా పరీక్షలు రాయాలి



నల్లగొండ, ఏప్రిల్ 2 (మనం న్యూస్): పదో తరగతి విద్యార్థులు భయపడకుండా పరీక్షలు ఉత్సాహవంతంగా రాయాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు కందాల పాపిరెడ్డి, డి ఈ ఓ బిక్షపతి విద్యార్థులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంగం ఆధ్వర్యంలో పదవ తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో ట్రస్మా కార్యవర్గ నాయకులు, ఆదివారం పానగల్లు ఛాయా సోమేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు పాపిరెడ్డి,నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి కి ట్రస్మా నాయకులు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలుకగా ఆలయ అర్చకులు అజయ్, ఉదయ్ శర్మలు పూర్ణకుంభం అందజేశారు. పూజా కార్యక్రమం అనంతరం డిఓ ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు పాపిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు వెళ్లే విధంగా తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులు చూడాలన్నారు. డీఈవో బిక్షపతి మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పరీక్షలు సజావుగా జరిగేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలన్నారు. మొదటిరోజు పరీక్షకు విద్యార్థులు పరీక్ష సెంటర్లకు 45 నిమిషాల ముందుగానే చేరుకోవాలని, పరీక్షలపై ఎలాంటి వదంతులు నమ్మవద్దని, పరీక్షలు బాగా రాసి నల్లగొండ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గౌరవ ఉపాధ్యక్షులు యానాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎస్సి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా సంతోషంగా పరీక్షలు రాయాలని, ఆహారం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ట్రస్మా నల్లగొండ జిల్లా అధ్యక్షులు కోడి శ్రీనివాస్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని డిఇఓ కు విజ్ఞప్తి చేశారు. ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి రావు మాట్లాడుతూ విద్యార్థులు ఒక ప్రణాళికా బద్ధంగా చదవాలని, మనోవేదనకు తమ పిల్లలు గురికాకుండా తల్లిదండ్రులు చూసుకోవాలని అన్నారు. సంగం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఛాయా సోమేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి , పుచ్చకాయల వెంకట్ రెడ్డి, మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు దైవ అనుగ్రహం కలగాలని, మంచి మార్కులతో ఉత్తీర్ణులై నల్గొండ జిల్లాకు, తల్లిదండ్రులకు, చదివిన పాఠశాలలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ పూజ కార్యక్రమంలో ట్రస్మా ట్రెజరరీ మట్ట చెన్నయ్య గౌడ్ , సంఘం నాయకులు అజీజ్, లక్ష్మీనారాయణ, జహంగీర్, శ్రీనివాస్, గిరిధర్ గౌడ్, పాముల అశోక్, బిక్షం, రవి, ముఖ్ఖముల నరసింహ, అశోక్ మూర్తి, తిరుమల్ రెడ్డి, గిరిబాబు, యానాల రాధిక, కర్ణాకర్ రెడ్డి, పులిజాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రాయరావుపేటలో క్రికెట్ క్రీడాకారులకు బ్యాట్ల పంపిణీ

బీబీనగర్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): మండలంలోని రాయరావుపేట గ్రామంలోని క్రికెట్ క్రీడాకారులకు స్థానిక వార్డు సభ్యుడు, ఓబీసీ మోర్చ కార్యవర్గ సభ్యుడు నాశబోయిన సాయి తన సొంత డబ్బులతో క్రికెట్ బ్యాటులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

## పేదోళ్ల రాజు, వెలుగులోకి రాని యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న

బీబీనగర్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): ఆంగ్లేయులు మనదేశంపై కన్నేయడం కన్నా ముందే.. సామ్రాజ్య కాంక్షతో దేశాన్ని.. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతాన్ని పట్టిపీడిస్తున్న కొందరు పాలకుల అరాచకాన్ని ఎదిరించి తానే సొంతంగా రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్న యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఎంపీపీ యర్కల సుధాకర్ గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పాపన్న వర్ధంతి వేడుకలు గౌడ కులస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుధాకర్ గౌడ్, గౌడ సంఘం నాయకులు పంజాల జైహింద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీటీసీ పంజాల రామాంజనేయులు గౌడ్, బీజేపీ జిల్లా నాయకుడు పొట్టోళ్ల శ్యామ్ గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు చెరుకు బాలరాజ్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ కొంతం లింగయ్య గౌడ్, పింగలన్న సేవాదళ్ ప్రధాన కార్యదర్శి కాసుల రఘునందన్ గౌడ్ లు పాల్గొని పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

చిన్నతనం నుంచే జమీందార్లు, దొరల అరాచకాలను చూస్తూ పెరిగిన సర్వాయి పాపన్నలో సహజంగానే రాచరికపు వ్యవస్థపై వ్యతిరేకత కూడా పెరుగుతూ వచ్చింది. తల్లి కోరిక మేరకు గౌడ కుల వృత్తిని చేపట్టిన సర్వాయి పాపన్నకు.. దొరల చేతుల్లో, మొగల్ సామ్రాజ్య సైనికుల చేతిలో ఎదుర్కొన్న అవమానాలు వారిపై ఉన్న వ్యతిరేకభావాన్ని మరింత పెరిగేలా చేశాయని తెలిపారు. పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండారు ఆగమయ్య గౌడ్, పంజాల వెంకటేశం గౌడ్, పంజాల సత్తయ్య గౌడ్, కాసుల సత్యనారాయణ గౌడ్, కాసుల సాయి గౌడ్, సిద్దగోని శ్రీకాంత్ గౌడ్, బొమ్మగోని బస్వయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా స్వచ్ఛతపై అవగాహన



భువనగిరి, ఏప్రిల్ 2 (మనం న్యూస్): స్వచ్ఛ సర్వేక్షన్ 2023 లో భాగంగా భువనగిరి పురపాలక సంఘ పరిధిలో స్వచ్ఛత పై అవగాహన కల్పించుటకు మన భువనగిరి వారసత్వపు కోటను శుభ్రం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తరుణ్ జోషి ఐపీఎస్, ఐజి పోలీస్ పాల్గొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నబోయిన అంజనేయులు, వైస్ చైర్ పర్సన్ చింతల కిష్టయ్య మునిసిపల్ కమీషనర్ బి. నాగిరెడ్డి వారిని ఆహ్వానిస్తూ భువనగిరి కోటపై ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, యువకులు అన్ని రంగాల వారు పాల్గనడం చాలా సంతోషంగా ఉన్నదని, అందరు కూడ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదేవిధంగా వారసత్వపు ప్రాంతాలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ అంబాసిడర్ అన్విత రెడ్డి, అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా అభ్యున్నతి కోసం బీజేపీ ప్రభుత్వ కృషి



కరీంనగర్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో నిలదొక్కుకునేలా పటిష్ట చర్యలు తీసుకుంటోందని, మహిళల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేస్తుందని బిజెపి మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు శాంతాల భట్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిడబడాలనే ఉద్దేశంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం అనేక చర్యలు చేపట్టిందన్నారు. మహిళల కోసం కేంద్రం తీసుకువచ్చిన అనేక పథకాలు

**మోడీ పథకాలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేయడం లేదు**

**బిజెపి మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు శాంతాల భట్**

రాష్ట్రం సక్రమంగా అమలు చేయడం లేదని ఆమె ఆరోపించారు. మహిళల భవిష్యత్తుకు భరోసా కల్పించే మోడీ ప్రభుత్వం తీసుకున్న అనేక నిర్ణయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. మహిళల కోసం రాష్ట్రంలోని కెసిఆర్ ప్రభుత్వం ఇన్నేళ్లలో చేసిందేమీ లేదని, మహిళలను కేవలం ఓటు బ్యాంకుగానే బిఆర్ఎస్ భావిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు రాష్ట్రంలో ఉన్నాయని, ముఖ్యంగా విచ్చలవిడి మద్యం, అత్యాచారాల కారణంగా తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం తీసుకున్న పటిష్ట విధానాలు, పథకాలు మహిళా సమాజానికి వివరించడానికి మహిళా మోర్చా తగిన కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరాల జ్యోతి, జిల్లా మహిళా మోర్చా వైస్ ప్రెసిడెంట్ మామిడాల చైతన్య, జిల్లా మహిళా మోర్చా సెక్రెటరీ ప్రేమలత, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ తమ్మడి మాలతి తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ పెద్దపల్లి

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



వీణవంక- ఏప్రిల్02 (మనం న్యూస్): మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాజోజుల శంకరాచారిగత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం గ్రామస్తులు సేకరించిన ఒక లక్ష యాభైవేల రూపాయలు మృతుని కూతురు పేరు మీద డబ్బులు బ్యాంకులో డిపాజిట్ చేసి పాస్‌బుక్ ను సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో పల్లెర్ల కిరణ్, రాజోజుల అంజయ్య, ఎలుబాక శ్రీనివాస్, గోనెల సమ్మయ్య, సాంబమూర్తి, కోలిపాక రామస్వామి, సంధి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోల్కొండ కోటను ఏలిన ఏకైక బహుజన వీరుడు సర్వాయి పాపన్న



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 2 (మనం న్యూస్): భారతదేశ చరిత్రలో దళిత బీసీ కుల నాయకత్వంలో దళిత, బహుజనులు ఏకమై ఉద్యమిస్తే రాజ్యాధికారం సాధించవచ్చని చాటి చెబుతూ, 17వ శతాబ్దంలోనే గోల్కొండ కోటను ఏలిన ఏకైక బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని రాజన్న సిరిసిల్ల జిల్లా గోపా అడ్వైజరి మెంబర్ గుగ్గిళ్ళ జగన్ గౌడ్, జిల్లా కన్వీనర్ కంచర్ల అమరేందర్ గౌడ్ లు అన్నారు. ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 324వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో గోపా రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో పాపన్న వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గోప అడ్వైజరి మెంబర్స్ బుర్ర వెంకటేశం గౌడ్, వీరగొని ఆంజనేయులు గౌడ్, లక్ష్మణ్ గౌడ్, అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ నేరెళ్ల తిరుమల్ గౌడ్, చక్కిళ్ళ మహేష్ గౌడ్, నాగుల శ్రీనివాస్ గౌడ్, వికృతి లక్ష్మీనారాయణ గౌడ్, బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, తాళ్లపల్లి అంజ గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, బాల గౌడ్, శ్రీధర్ గౌడ్, యాదగిరి గౌడ్, దేవయ్య గౌడ్, ప్రవీణ్ గౌడ్, అనిల్ గౌడ్, నాగరాజు గౌడ్, రమేష్ గౌడ్, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఎస్సీ మోర్చా కార్యవర్గ సమావేశం

కరీంనగర్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా కరీంనగర్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు సోమిడి వేణు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ హాజరయ్యారు.ఈ సమావేశంలో రాజకీయ తీర్మాణాన్ని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్ రెడ్డి ప్రవేశపెట్టగా, ఎర్రోళ్ల ప్రశాంత్ బలపరిచారు. ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాద తీర్మానాన్ని ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తూర్పాటి రాజు ప్రవేశపెట్టగా, పుల్లమల్ల ప్రసాద్ బలపరిచారు. అనంతరం కుమ్మరి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ ఓట్లతో అధికారం చేపట్టి దళితులను మోసం చేస్తోందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు మూడెకరాలు భూమి, దళిత బంధు, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, ఎస్సీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు తదితర ఏ ఒక్క హామీ నెరవేర్చక తిరిగి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ సారి దళితులందరూ ఏకమై కెసిఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 13 నుండి మే 5వ తేదీ వరకు అంబేద్కర్ జయంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్ రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు గుడిపాక రాములు ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తుర్పాటి రాజు, పుల్లమల్ల ప్రసాద్, ఉపాధ్యక్షులు



జెల్ల మల్లేష్, ఎలుక రాజేష్, అధికార ప్రతినిధులు ఎర్రోళ్ల ప్రశాంత్, వినయ్, సాగర్, కోశాధికారి వేణుగోపాల్, గన్నేరువరం మండల అధ్యక్షులు బామండ్ల రాజు, హుజరాబాద్ పట్టణ అధ్యక్షులు బోరగల సారయ్య, నార్త్ జోన్ అధ్యక్షులు జక్కుల నిఖిల్, ప్రధాన కార్యదర్శులు బండారు శ్రావణ్, రంజిత్, ప్రణయ్, సురేష్, గోదారి నరేష్, దుర్గం ఆంజనేయులు, జాడి కనకయ్య, దుర్గం భూమయ్య, చంద్రగిరి వేణు, లక్ష్మీరాజం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల నియోజకవర్గ ఎన్నికలు



మెట్ పల్లి, ఏప్రిల్ 2 (మనం న్యూస్): కోరుట్ల నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టల ఎన్నికలు జిల్లా అధ్యక్షులు దాసం కిషన్, ప్రధాన కార్యదర్శి మల్యాల సతీష్ కుమార్, గౌరవాధ్యక్షులు బూరం సంజీవ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షులుగా బలిజ సంతోష్, ప్రధాన కార్యదర్శిగా పింజారి శివకుమార్, ఉపాధ్యక్షులుగా బొల్లం రాజు, ఎన్నం రాజశేఖర్, సహాయ కార్యదర్శులుగా ఊడుగుల గంగాధర్, అల్లం రాజేష్, కోశాధికారిగా ఇంద్రాల హరీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తరి రాజశేఖర్, గౌరవాధ్యక్షులుగా గోరమంతల నారాయణ, గౌరవ సలహాదారుగా మిడిదొడ్డి మల్లేష్, కార్యవర్గ సభ్యులుగా గూడపాటి దుర్గాప్రసాద్, బాణాల శ్రీధర్, బాణావత్ శ్రీనివాస్ నాయక్, అజ్మీర గంగాధర్ నాయక్, ఇటిక్యాల నరేష్, సభావత్ మల్లేష్, చట్ పల్లి లక్ష్మణ్, పింజారి రజినీకాంత్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## బహిరంగ మద్యపానంపై నిషేధం పొడిగింపు

**కరీంనగర్ సిపి సుబ్బారాయుడు**



కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 2 (మనం న్యూస్):సాధారణ పౌరులు, ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు కరీంనగర్ పోలీస్ క మిషనర్ ఎల్.సుబ్బారాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో నిషేధాజ్ఞలు పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు. మద్యంప్రియుల ఆగడాలకు కళ్ళెం వేయడంతోపాటు ప్రజల భద్రత, రక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగర పోలీసు చట్టం, ఐపిసి 188, ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేదాజ్ఞలు ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

## ముస్లింల పట్ల బిఆర్ఎస్ ప్రభుత్వ కపట ప్రేమ

**సామాజిక కార్యకర్త అమీర్**



కరీంనగర్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): ముస్లింల సంక్షేమం పట్ల రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం కపట ప్రేమను చూపిస్తోందని సామాజిక కార్యకర్త మహ్మద్ అమీర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ముస్లీం వర్గ ప్రజల సంక్షేమం కోసం పాటుపడాల్సిన బిఆర్ఎస్ మైనార్టీ విభాగం నాయకులు ఒక జేబులో ఫొటోలు, మరో జేబులో పాల ప్యాకెట్ పెట్టుకుని నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేయడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. గత తొమ్మిదేళ్లుగా బిజెపిని బూచిగా చూపుతున్న బిఆర్ఎస్ పార్టీ ముస్లింలను ఓటు బ్యాంకుగానే వాడుకుంటుందని పేర్కొన్నారు. ఇమామ్, మౌజంలకు ఇచ్చే గౌరవ వేతనాన్ని నాలుగు మాసాలుగా ఎందుకు చెల్లించడం లేదని అమీర్ ప్రశ్నించారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ హామీ ఇంతవరకు అమలు కాలేదని, షాదీ ఖానాలు ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదని పేర్కొన్నారు. గత తొమ్మిదేళ్లుగా బిఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం ఏం చేసిందనేది, మైనార్టీ ప్రజలు ఆలోచించాలని, మైనార్టీ నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని కోరారు.

## పటేల్ తీర్పు లఘుచిత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి గంగుల



కరీంనగర్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): పసుల క్రియేషన్ యూట్యూబ్ ఛానల్ ఆధ్వర్యంలో రూపొందించిన పటేల్ తీర్పు లఘుచిత్ర పోస్టర్‌ను రాష్ట్ర బిసి సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పటేల్ తీర్పు లఘుచిత్రాన్ని రూపొందించి, తన తండ్రి మల్లయ్యకు అంకితమిచ్చిన పసుల క్రియేషన్స్ అధినేత పసుల చరణ్‌ను అభినందించారు. ప్రజలకు ఉపయోగపడే, సమాజాన్ని చైతన్య పరిచే లఘుచిత్రాలను నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, నగర మేయర్ సునీల్ రావు, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లా హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పర్లపల్లి సర్పంచ్‌ను అభినందించిన వినోద్ కుమార్



తిమ్మాపూర్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ సథత్ వికాస్ పురస్కారాలలో భాగంగా పచ్చదనం, పరిశుభ్రత విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు పొందిన సందర్భంగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామ సర్పంచ్ మాదాడి భారతి నర్సింహారెడ్డిని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ ఆదివారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ కెసిఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి, తెలంగాణ కు హరితహారం కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేసిన సర్పంచ్ భారతి పర్లపల్లి గ్రామంలో హరిత విప్లవం తీసుకువచ్చి, ఇతర గ్రామ పంచాయతీలకు ఆదర్శంగా నిలిచారన్నారు.

## ఇంటింటికి తెలుగుదేశం



ఏన్కూరు, ఏప్రిల్ 2 (మనం న్యూస్): ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని ఆదివారం మండల పరిధిలోని తూతకలింగన్నపేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ వైరా నియోజకవర్గ నాయకులు ఆరెం రామయ్య విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పార్టీ యొక్క మేనిఫెస్టోను కార్యకర్తలకు వివరిస్తూ గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆరెం రామయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో గడిచిన 8 ఏళ్లలో అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. సీఎం కేసీఆర్ రైతు సమస్యలను గాలికి వదిలేసారని మండిపడ్డారు. ఎన్నికలవేళ ఇచ్చిన అనేక హామీలను టిఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. రాబోవు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుస్తుందని, రాష్ట్రంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కొనకంచి రామకృష్ణ, ఆళ్ల సూర్యనారాయణ, జూజురి ప్రసాద్, డాక్టర్ కోపాల రామారావు, నరసింహారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశీలి డాక్టర్ కందేపి రాణీప్రసాద్

**- సమాజ చైతన్యంలో తన వంతు పాత్ర... బాల సాహిత్యంలో కొత్త ప్రయోగాలు**

**- కవితలు, వ్యాసాలు, చిత్రాలతో వినూత్న కార్యక్రమాలు**

**- సాహిత్య సేవల్లో ఎన్నో బిరుదులు, పురస్కారాలు, ప్రశంసలు అందుకున్న రాణి ప్రసాద్**



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 2 (మనం న్యూస్): మహిళను వంటింటి మహారాణి అన్నారు. వంటింట్లో ఉండే కందిపప్పు, కాఫీ పొడి, లవంగాలు, యాలకలు లాంటి వాటితో మహిళా చిత్రాలను చిత్రిస్తే, ఆ చిత్రాలు మహిళల సమస్యలను పదిమంది దగ్గరకు చేర్చగలిగితే అంతకంటే రావాల్సింది ఏముంది. అదే జరిగింది. ఆ చిత్రాల రూపకర్తకు రాష్ట్ర ప్రభుత్వ మహిళా శిశు సంక్షేమ శాఖ నుండి విశిష్ట మహిళాపురస్కారం తెచ్చిపెట్టింది. ఆ రూపకర్త ఎవరో కాదు రాజన్న సిరిసిల్ల జిల్లావాసి డాక్టరే కందేపి రాణిప్రసాద్. బాలసాహితీ వేత్తగా, పిల్లల ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ గా ఆమె విశేష గుర్తింపును తెచ్చుకున్నారు. ఆమె సాగించిన ప్రయాణం 'మనం' దినపత్రికలో మీ కోసం...

డాక్టర్ కందేపి రాణీప్రసాద్ అక్టోబర్ 19, 1969లో జన్మించారు. తల్లిదండ్రులు అంగల కుదిటి సుందరాచార్యులు, గోవిందమ్మలు. తండ్రి పారిశ్రామిక వేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు. తల్లి సాహితీ వేత్త, టికిటాం బుర్ర, పుష్పాంజలి పుస్తకాలను వెలువరించారు. రాణి ప్రసాద్ పుట్టుకతోనే సాహితీకారుల కుటుంబంలో జన్మించారు. ఆమె ఇల్లు కవులు, కళాకారులతో మినీ రవీంద్రభారతిలా అలరారేది. ఆమె కాలేజీ రోజుల్లోనూ సాహిత్యంలో, చిత్రలేఖనంలో అనేక బహుమతులు అందుకున్నారు. ఆమె భర్త డా కందేపి ప్రసాదరావు పిల్లల డాక్టరు అయినందున రాణిప్రసాద్ పిల్లల గురించి రాయటం మొదలుపెట్టారు. పిల్లల సాహిత్యంలో ఎన్నో కొత్తరకాల ప్రయోగాలు చేపట్టి, పిల్లల తరుపున నిలబడ్డ లాయర్ లాగా వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్నారు. ఎంసెట్లు, నీట్లు వంటి పరీక్షల సమయంలో కలిగే ఒత్తిడి గురించి అనేక వ్యాసాలు రాసి పిల్లలను జాగృత పరుస్తున్నారు. పిల్లల కోసం నలభై పుస్తకాలను రచించారు. పది పుస్తకాలను ఇంగ్లీషు నుండి అనువాదం చేశారు. రాణీప్రసాద్ బాలల కోసం రచించిన సాహిత్యానికి గాను తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలతో సహ తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఢిల్లీ రాష్ట్రాలలో పలు అవార్డులు అందుకున్నారు. ఆమె సాహితీసేవకు కళాభారతి, కవితావాణి, కళారాణి, బాలపూర్ణిమ, బాల సాహితీ కౌముది వంటి బిరుదులను అందుకున్నారు. వందలాది స్కూళ్ళలో తన బొమ్మలతో ఎగ్జిబిషన్లు నిర్వహించి, పిల్లలకు సైన్స్, చరిత్ర పట్ల అవగాహనను కల్పిస్తూ సేవ చేస్తున్నారు. తమ ఆసుపత్రి గోడల నిండా బాలల కోసం అనేక పొడుపు కథలను రచించి పాత ప్రక్రియలను గుర్తుకు తెస్తున్నారు.

ఆసుపత్రి ప్రిస్క్రిప్షన్ ప్యాడ్ మీద ఒక పాటను ముద్రించటం సాహసోపేతమైన చర్య. దానికి ఆమోదించిన డాక్టర్ ప్రసాదరావు మాతృ భాషాభిమానం వెలకట్టలేనిది. రాణీప్రసాద్ తన మూడో ఏటనే తల్లిదండ్రులతో సహా పద్యకవిత్య పుస్తక కవర్ పేజీలో ఫోటో ప్రచురింపబడింది. తల్లిదండ్రుల ప్రోత్సాహముతో సాహిత్య బీజాలు పడితే వాటికి నీరు పోసి వృక్షంలా తీర్చిదిద్దిన వారు భర్త ప్రసాదరావు. సాహిత్యాభిమానులైన కుటుంబంలో జర్మించినందు వల్ల రాణీ ప్రసాద్ కు ఎలాంటి అడ్డుకులు రాలేదు. ఆమె పిల్లలిద్దరూ కూడా రెండు పుస్తకాలను రచించారు. వాళ్ళను చదివించేటపుడు వచ్చిన సమస్యలను వ్యాసాలుగా, కథలుగా, కవితలుగా మలిచారు. సరియైన టీచర్లు లేనందున పిల్లలకు పాఠాలు చెప్పుకోవలసిరావడంతో పిల్లలకు పాఠాలు ఎలా చెప్పాలి అనే విషయంలో అనేక లోటుపాట్లను గమనించి, వ్యాసాలు రాశారు. పిల్లలనుహాస్టల్లలో వేస్తే వాళ్లు మనల్ని ఓల్డేజ్ హోమ్ లో వేస్తారనే కవితను 30 ఏళ్ళ కిందటే వారి ఆసుపత్రి గోడల మీద కనిపించింది. రాణీప్రసాద్ ఆసుపత్రిని నిర్వహిస్తున్న సమయంలో డిప్రెషన్, ఆటిజమ్, టెన్షన్ వంటి అనేక మానసిక సమస్యలతో ఉన్న చిన్నారులను చూశారు. ఆయా వ్యాధులకు సంబంధించిన జాగ్రత్తలు, సూచనలు, కారణాలతోపాటుగా వ్యాసాలు రాసి తల్లిదండ్రులకు అవగాహన కల్గించటం మొదలు పెట్టారు. అంతే కాకుండా చాలా చిన్న చిన్న తప్పుల వలన తమ పిల్లల ప్రాణాలను పోగొట్టుకుంటున్న తల్లిదండ్రులను జాగృత పరచేందుకు 'డాక్టర్ చెప్పిన కథలు' పుస్తకాన్ని రచించారు. తలసేమియా, డయాబెటిస్, క్యాన్సర్, గుండెపోటు, ఎయిడ్స్ వంటి వ్యాధుల గురించిన కవితలు, పొడుపు కథలు, ముగ్గులు, చార్టులు, వెజిటబుల్ కార్వింగ్ వంటి ఎన్నో కళా ప్రక్రియల ద్వారా చైతన్యపరుస్తున్నారు. రాణీప్రసాద్ తల్లీబిడ్డల సంక్షేమం కొరకు రచయితగా, ఆసుపత్రి ద్వారా ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలు చేపడుతూ ఉన్నారు. సామాజిక చైతన్యం కలిగించేందుకు ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఆసుపత్రిలో పిల్లల కోసం మ్యూజియం నూ, రైబ్రరీని నిర్వహించటం హర్షించదగ్గ విషయం. పలు విషయాల పట్ల చైతన్యం కలిగిస్తూ స్కూల్ ఓత్తిడిని, ఆరోగ్యాన్ని కాపాడుకునేలా

తన ప్రయాణం సాగించడం పట్ల రచయిత్రి డాక్టర్ కందేపి రాణి ప్రసాద్ ని అభినందిద్దాం.

## మహబూబ్‌నగర్
### నారాయణపేట-వనపర్తి

## యేసుక్రీస్తు నామంలోనే జయం

### రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్ రాజు



కరుణాపురం, ఏప్రిల్ 2, మనం న్యూస్ : లోక రక్షకుడు యేసుక్రీస్తు నామంలోనే జయం ఉందని క్రీస్తుజ్యోతి మినిస్ట్రీస్, ఫౌండర్ రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్ రాజు అన్నారు. హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురంలో ఆదివారం సొసైటీ ఆఫ్ క్రైస్ట్, కరుణాపురం ఆద్వర్యంలో జరిగిన మట్టల ఆదివారం సందర్భంగా పాల్సన్ రాజు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు జననం మరణం అంతా ప్రపంచ మానవాళి కోసమేనని అన్నారు. యేసుక్రీస్తు జెరూసెలంలో ప్రవేశించిన నేటి రోజు నుండి పవిత్ర వారంగా ప్రపంచవ్యాప్తంగ జరుపుకుంటుందని అన్నారు. మట్టల ఆదివారం ఈస్టర్ డే కి ముందు చివరి ఆదివారం నాడు జరుపుకుంటారని వివరించారు. మినిస్ట్రీ కార్యదర్శి రెవరెండ్ డాక్టర్ జయప్రకాశ్ గోపు మాట్లాడుతూ యేసుక్రీస్తు శిలవ త్యాగం జ్ఞాపకం చేసుకోవాలన్నారు. యేసు మార్గంలో కొనసాగితే శాంతి, సమాధానము, ప్రేమ కలిగిన సమాజం ఆవిర్భవిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కరుణాపురం పురవీధుల గుండా అనాడు యేసుక్రీస్తు గాడిదపై కూర్చుని విజయోత్సవ ర్యాలీగా కొనసాగిన మాదిరిగా ఖర్జూర మట్టలు పట్టుకుని ప్రదర్శన జయకరంగా కొనసాగింది. ఈ ప్రదర్శన ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సంగాల యిర్మియా, బ్రదర్స్ రవిపాల్, ప్రభాకర్, అంద్రెయ, సమూయేల్, హనోకు, సిస్టర్స్ ప్రిస్కిల్ల, తబిత, రాహేల్, యోహన్నపాల్, కరుణ్మయి, వాలంటీర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

### క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యనందిస్తున్నాం

**- తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు రావాలి**

**నిపుణులైన ఉపాధ్యాయులు శ్రీ విద్యానికేతన్ ప్రత్యేకతలు**

**- శ్రీవిద్యానికేతన్ ఛైర్మన్ గొల్లపూడి రామ్‌ప్రసాద్**

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (మనం న్యూస్) : సువిశాలమైన ప్రాంగణం, విద్యార్థులకవసరమైన సౌకర్యాలు, నిపుణులైన ఉపాధ్యాయులతో క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యనందిస్తున్నామని శ్రీవిద్యానికేతన్ ఛైర్మన్ గొల్లపూడి రామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. విద్యారంగ పరిస్థితులు, పాఠశాల ప్రత్యేకతలు, తల్లిదండ్రుల ఆలోచనల్లో వస్తున్న మార్పులు తదితర అంశాలపై మనం ప్రతినిధితో మాట్లాడారు. విద్యారంగ పరిస్థితులు, పిల్లల ఆలోచనలు, వారి మానసిక స్థితులు గమనించాక పాఠశాల స్థాపించాలనుకున్నానని, పిల్లలకు విలువలు, సంస్కారం తెలియాలంటే పాఠశాలలోనే జరగాలనే సదుద్దేశంతో పాఠశాలను స్థాపించినట్లు తెలిపారు. ప్రారంభం నుండి నేటి వరకూ క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రుల ఆలోచనలు పిల్లలపై రుద్దబడుతున్నాయని, ఫీజు కట్టడం వరకే తమ బాధ్యతని వారనుకుంటున్నారే తప్ప పిల్లలు ఎలా చదువుతున్నారనే ఆలోచన చేయడం లేదన్నారు. ఇంట్లో ఉన్న పరిస్థితులకు, పాఠశాలలో నేర్పిన దానికి భిన్నమైన పరిస్థితులు పిల్లలకు ఎదురవుతున్నాయని, అందుకే ప్రస్తుతం తల్లిదండ్రులలో ఎక్కువగా మార్పు రావాలని అనుకుంటున్నానని, అందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కరోనా వల్ల విద్యారంగం పూర్తిగా దెబ్బతిందని, కరోనా సమయంలో ఆన్లైన్ క్లాసుల ఉండడంవల్ల పిల్లలకు ఫోన్ ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చిందని, దీంతో పిల్లలు ఫోన్కు అలవాటు పడి మంచికంటే చెడుకే ఎక్కువగా వాడుతున్న పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఫోన్ వాడడం వల్ల కలిగే అనర్థాలేంటో పిల్లలకు తల్లిదండ్రులు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్ని కార్పొరేట్ స్కూల్స్ వచ్చినా అద్భుతమైన సౌకర్యాలతో, సువిశాలమైన ప్రాంగణంలో స్కూల్ నడుపుతున్న మేము అనుకున్న ప్రకారం విద్యను అందిస్తామని, మా విధానం ప్రకారమే ముందుకు పోతామని అన్నారు. నిపుణులైన ఉపాధ్యాయులు, విద్యార్థికి కావాల్సిన అన్ని సౌకర్యాలు, సువిశాలమైన క్లాస్ రూములు, విశాలమైన ఆటస్థలం శ్రీ విద్యానికేతన్ ప్రత్యేకతలు అని పేర్కొన్నారు.

## 'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

### ఎంఈఓ డి.జయరాజు

ఏన్కూరు, ఏప్రిల్ 2 (మనం న్యూస్): మండలంలో నేటి నుంచి జరగబోయే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం మండల పరిధిలోని ఏన్కూరు, తిమ్మారావుపేటలోని రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ పరీక్షలకు 314 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీటి, విద్యుత్ వంటి సదుపాయం కల్పిం చామని, పరీక్ష కేంద్రాల ఆవరణంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారన్నారు. పరీక్షల సమయంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. ఈ పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెంట్ లుగా ఎస్.కె గౌస్, ఏ. శైలా, డిపార్ట్మెంట్ ఆఫీసర్ లుగా రామకృష్ణ, చక్రపాణి బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా చూడాలన్నారు.

# శ్రీని మనోజ్‌ను సన్మానించిన బీజేపీ కౌన్సిలర్‌లు

వనపర్తి ప్రతినిధి ఏప్రిల్02 (మనం న్యూస్): తెలంగాణ ప్రవాస్ యోజనలో భాగంగా ఆదివారం కేరళ రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీమతి శ్రీని మనోజ్ వనపర్తి బిజెపి నాయకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి కృష్ణ నివాసం ను సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ బిజెపి కౌన్సిలర్లు బి రమాదేవి, బి పద్మలు శ్రీని మనోజ్ ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రెండు రోజులపాటు వనపర్తి నియోజకవర్గంలో మహిళా సంక్షేమం, నూతన యువ ఓటర్స్, అంగన్వాడి కేంద్రాలలో మహిళలకు పోష్టికా ఆహారం, మహిళా మేధావుల తో సమావేశాలు కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు బి కృష్ణ, సబి రెడ్డి వెంకట్ రెడ్డి, రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి, పరుశురాం, రమణ, మహిళా మోర్చా అధ్యక్షులు కల్పన, ప్రధాన కార్యదర్శి రాధా పాల్గొన్నారు.



# ఘనంగా మట్టల ఆదివారపు వేడుకలు

చెన్నారావుపేట, ఏప్రిల్ 2, మనం న్యూస్ : మండలంలోని పలు గ్రామాలలోని చర్చిలలో ఆదివారం మట్టల ఆదివారపు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ భక్తులు పూలతో అలంకరించిన ఈత మట్టలు చేతపట్టుకుని గ్రామ వీధులలో సెన్నకు జయము జయము అని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రార్ధన మందిరంలో భక్తులనుద్దేశించి రెవ ఇ సెదర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఇ స్వప్న, వరంగల్ గ్రూప్ సెక్రెటరీ ఆకుల అశోక్ గౌడ్, పాస్టెట్ సెక్రటరీ గోపి శ్రీనివాస్ రెడ్డి, ట్రెజరర్ బండారి బిక్షపతి, మిషన్ అండ్ ఇవాంజిలిజం సెక్రటరీ గట్ల రవీందర్, యూత్ సెక్రెటరీ గట్ల హనోక్, ట్రెజరర్ శంకేశి రంజిత్, స్త్రీల మైత్రి సెక్రెటరీ గాండ్ల మంజుల, ట్రెజరర్ ఆకుల సుభాషిని, పెద్దలు ఎం సాంబయ్య, కన్నం భాస్కర్, కందిక సునీల్, పెంతల శ్రీనివాస్, నవీన్, జన్ను రవి, సింగారపు అశోక్, బద్రు, జయరాం, నాగు, శ్రీను, దేవేందర్ తదితరులు ఉన్నారు.





# వెంకటేశ్వరపల్లిలో రైతులకు గోవుల పంపిణీ

### మహేష్ అగర్వాల్

రాయపర్తి, ఏప్రిల్ 2, మనం న్యూస్ : మండలంలోని వెంకటేశ్వరపల్ల గ్రామంలో నిరుపేద రైతులకు గోవులను బాలాజీ గోశాల ఆధ్వర్యంలో పంపిణీ చేసినట్లు గోషాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు మహేష్ అగర్వాల్ అన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఒక్కొక్కరికి రెండు చొప్పున 10 మంది రైతులకు 20 గోవులను అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవులను పెంచుకోవడం ద్వారా రైతులకు వ్యవసాయ అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక చింతన కూడా పెంపొందుతుంది అని వారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గోశాల అధ్యక్షులు గాడిపెల్లి రాజేశ్వరరావు, గోషాల సూపరింటెండెంట్ దుర్గం జ్యోతి, గ్రామ పంచాయతీ సర్పంచ్ గూబా యకమ్మ, ఎల్ రవిందర్ పాల్గొన్నారు అనంతరం పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు పెన్నులు, పరీక్షల ప్యాడ్స్ అందించారు.







## స్వయం ఉపాధి పొందాలిః వట్టె

సూర్యాపేట టౌన్ ఏప్రిల్ 02 మనం న్యూస్ః యువత ప్రభుత్వ ఉద్యోగాల కొరకు ఎదురు చూడకుండా స్వయం కృషితో స్వయంగా ఉపాధి పొందేలా వ్యాపారాలను ప్రారంభించుకోవాలని డసిఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 42వ వార్డులో అమ్మరైస్ షాపును దుకాణాన్ని ప్రారంభించి మాట్లాడారు. అవకాశాలను సృష్టించుకోవాలని, నాణ్యత ప్రమాణాలను పాటించి వినియోగ దారుల మన్ననలు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దుకాణం నిర్వహుకుడు జక్కలి స్వరూప, నాగారాజు, పెరుగు లావణ్య, లింగయ్య, పాండురంగా చారి, గోపి, జనార్ధన్, మల్లేష్, లింగరాజు, పాషా, తదితరులు పాల్గోన్నారు.



# కాజీపేట మండలంలో ఘనంగా పాపన్న వర్ధంతి

కాజీపేట, ఏప్రిల్ 2, మనం న్యూస్: బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 313 వర్ధంతిని కాజీపేట మండలంలో ఘనంగా నిర్వహించారు. కాజీపేట మండలం తరాలపల్లి గౌడ సంఘం అధ్యక్షులు చిర్రగోని రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 313 వర్ధంతి కార్యక్రమమును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తరాలపల్లి గౌడ గీత కార్మికులు, తరాలపల్లి మాజి సర్పంచ్, గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



**మడికొండలో.....** మడికొండ గ్రామంలో గౌడ సొసైటీ అధ్యక్షుడు బుర్ర రాజన్ బాబుగౌడ్ ఆధ్వర్యంలో పాపన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజన్ బాబుగౌడ్ పాపన్న చిత్రపటానికి పూలమాలవేసి సంఘం సభ్యులు నివాళులర్పించారు. పాపన్న చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని గ్రామ గ్రామాన పాపన్న విగ్రహ ప్రతిష్టాపనలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కుల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**కాజీపేటలో.......** కాజీపేట చౌరస్తాలో కల్లుగీత కార్మిక సంఘం సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 313 వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపా జిల్లా కమిటీ సభ్యులు బత్తిని రాజేందర్ గౌడ్ పాపన్న చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గౌని సాంబయ్య గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ముఖ్య సలహాదారు బుర్ర రాజన్ బాబుగౌడ్, గోపా జిల్లా సభ్యులు కోతి సాంబరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నాగర్‌కర్నూల్
### గద్వాల-కల్వకుర్తి

## ఏఎన్ఎంలను వెంటనే రెగ్యులర్ చేయాలి

### ఐక్యవేదిక డిమాండ్



హనుమకొండ టౌన్, ఏప్రిల్ 2, మనం న్యూస్ : తెలంగాణ వైద్య ఆరోగ్య సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ ఆదేశాను సారముగా హన్మకొండ ఏకశిల పార్క్ నందు ఆదివారం వరంగల్ జిల్లా 2 వ మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ మహిళ ఉద్యోగిని ల సమావేశము బానోత్ నెహ్రూ చంద్ నాయక్, రాష్ట్ర కోర్ కమిటీ మెంబర్ అధ్యక్షతన సమావేశము జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథితులుగా రాష్ట్ర కోర్ కమిటీ నాయకులు బత్తిని సుదర్శన్ గౌడ్ హాజరై మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలనీ, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు సర్వీస్ వెయిటేజ్ ఇచ్చి డాక్టర్స్ మాదిరిగా రెగ్యులర్ చేయాలనీ, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. త్వరలోనే ఉద్యోగుల సమస్యలపై వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు హరీష్ రావు దష్టికి తుసుకువెళ్ళి పరిష్కరించడానికి కషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోర్ కమిటీ నాయకులు రామా రాజేష్ ఖన్నా, ఏఎన్ఎం అసోసియేషన్ నాయకురాలు సుమతి, ఐక్య వేదిక జిల్లా నాయకులు కె వేణుగోపాల్ రావు, చుక్క రవికుమార్, ఎల్ వీరేందర్, గోవర్ధన్ రెడ్డి, కె సంపత్, కష్ణమూర్తి, సందీప్, ఏఎన్ఎం అసోసియేషన్ నాయకురాళ్ళు సాజీన, సామ్రాజ్యం, జి జ్యోతి, దేవయాని, రమాదేవి, రాణి పటేల్, విజయ, స్వరూప, రజిత, రజియ, విజయ, రమ్య, ప్రతిభ, హమీద, రజని, అపరంజి, సునీత, మంజుల, జయలత తదితరులు పాల్గొన్నారు.

## తొలి బహుజన విప్లవ

## వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



మోత్కూరు, ఏప్రిల్ 2 (మనం న్యూస్) : పేద వర్గాల కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా నిరంతరం శ్రమించిన తెలంగాణ తొలి బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహకమిటి అధ్యక్షుడు మెరుగు యాదగిరి,గీత సొసైటీ బుర్ర యాదయ్య అన్నారు ఆదివారం సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ 313 వ, వర్ధంతి సందర్భంగా బీసీ రిజర్వేషన్ సాధన సమితి సర్ధార్ సర్వాయి పాపన్న విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో మోత్కూరు లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు శతాబ్దాల క్రితమే నిరుపేద గౌడ కుటుంభంలో జన్మించిన సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ రజాకార్లు, భూస్వాములు పేద ప్రజలను ఇబ్బందులను త్రీవ ఇబ్బందులు గురి చేస్తున్న పాపన్న గౌడ్ పేద పక్షాన నిలబడి ప్రజల పక్షాన తెలంగాణ తొలి బహుజన విప్లవ వీరుడు సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు.ఆయన సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.. పాపన్న జయంతి, వర్ధంతి లను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బొడ్డుపల్లి కళ్యాణ్ , పురుగుల వెంకన్న వనం స్వామి కో.ఆప్షన్ సభ్యులు గనగాని నర్సింహ్మ బీసీ, గౌడ సంఘాల నాయకులు బీసు యాదగిరి కారుపోతుల శ్రీనివాస్, బయ్యని రాజు, సూదగాని ఆంజనేయులు నిమ్మల శ్రీనివాస్ యాదవ్ , బుర్ర సంతోష్, బుంగపట్ల యాకయ్య బుషిగంపల శ్రీకాంత్ గొడిశాల శ్రీను, బీసు రాంబాబు, నర్సింహ్మా చారి, శాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మహానంది జాతీయ పురస్కారాన్ని అందుకున్నా ఐలయ్య

ఖమ్మం, ఏప్రిల్ 2 (మనం న్యూస్) : ఖమ్మంకు చెందిన ఉపాధ్యాయుడు కవి,రచయిత పంజాల ఐలయ్య తెలుగు వెలుగు ఉగాది మహానంది జాతీయ పురస్కారాన్నిఅందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌త్యాగరాయ గాన సభ లో తెలుగు వెలుగు సాహిత్య వేదిక ఉగాది మహానంది జాతీయ పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు.తొలుత జ్యోతిప్రజ్వలన చేశారు.అనంతరం ఈ కార్యక్రమం లో ఐలయ్య కు హైదరాబాద్ సరస్వతి మాత ఉపాసకులు డాక్టర్ దైవజ్ఞ శర్మ ,గిన్నిస్ వరల్ రికార్డు గ్రహీత,వంగాల శాంతికృష్ణ ఆచార్య చేతుల మీదుగా జాతీయ పురస్కారం తో పాటు మహానంది జ్ఞాపిక ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు ,ఈ కార్యక్రమం లోపోలోజు భాస్కరాచార్యులు , తెలుగు వెలుగు సాహితీ వేదిక కార్యక్రమ నిర్వాహకులు బ్రహ్మశ్రీ పోలోజు రాజ్ కుమార్ప్రముఖ కవి, రచయిత జలమండలి,అధికారికొండా మోహన్ ,చైర్మన్, ఉగాది మహానంది జాతీయ పురస్కారాల నిర్వహణ కమిటి,రంగిశెట్టి రమేష్‌వేములవాడ మదన్మోహన్ ఆచార్యఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, తెలుగు వెలుగు సాహితీ వేదికఅప్పనపల్లి భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు

## నిర్లక్ష్యానికి మూల్యం ప్రాణం

### ఆటోలో నుంచి కింద పడి మృతి చెందిన మహిళ



మణుగూరు, ఏప్రిల్ 2 (మనం న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల పరిధిలోని విజయనగరం శివారు ప్రాంతంలో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ కిందపడి తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందింది వివరాల్లోకి వెళితే బుడగ జంగాల పోతిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన పుస్తం. భవాని 29 సంవత్సరాలు భర్త సురేష్ బోళ్ల వ్యాపారం చేస్తూ ఉండేది రోజు విధంగానే ఉదయం వ్యాపారం చేయుటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆటో డ్రైవర్ అక్తర్ పాష ఆటో ఎక్కి వస్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం వలన ఆటోలో ముందు కూర్చున్న భవాని విజయనగరం దగ్గరలో ప్రమాదవశాత్తుగా కింద పడడంతో తలకు బలమైన గాయం కావడం వలన వెంటనే ఆటో డ్రైవర్ మణుగూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కు తీసుకొని రాగా ఆమె అప్పుడే చనిపోయిందని తెలియజేశారు.

ఖమ్మం కొత్తగూడెం

# గంగపుత్ర (బెస్త) సంఘం జిల్లా కమిటీ నియామకం



ఖమ్మం, ఏప్రిల్ 2 (మనం న్యూస్): ఖమ్మం జిల్లా గంగపుత్ర బెస్త సంఘం అధ్యక్షునిగా కన్నం ప్రసన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి గా దేశ బోయిన మంగారావు, కోశాధికారిగా పెద్దపల్లి సుధాకర్ లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు దేశబోయిన తిరుపతయ్య, మైసా పాపారావు, పెద్దపల్లి సోమయ్యలు తెలిపారు. అనంతరం వారితో ప్రమాణస్వీకారం చేయించారు. తర్వాత జిల్లా అధ్యక్షులు జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఖమ్మం నగరంలోని అశోక ఫంక్షన్ హాల్ నందు జిల్లా గంగపుత్ర సంఘం సమావేశం జరిగింది.నూతన కమిటీని పలువురు నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కన్నం ప్రసన్న కృష్ణ మాట్లాడుతూ గంగపుత్రులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఐకమత్యంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. చేపల వృత్తే జీవనాధారంగా బతుకుతున్న మత్స్యకారులైన గంగపుత్రులకు ప్రభుత్వం అన్ని విధాలా భరోసా అందించాలని వారు కోరారు. చెరువులపై హక్కు గంగపుత్రులకి ఉంటుందని స్పష్టం చేశారు.గంగపుత్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా చింతల మల్లేశం, గుడిబోయిన దర్గయ్య, పెద్దపల్లి సోమయ్య, వడ్డేబోయిన వెంకన్న, మైస శంకర్, భైరి కొమ్మాలు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా చేతి కృష్ణ, కీర్తి శ్రీనివాస్, సింగు శ్రీనివాస్, పిల్లి సుదర్శన్, గుండా మల్లయ్య, లక్కం బక్కయ్య, సంయుక్త కార్యదర్శులుగా కందరబోయిన కొండలరావు, జిరిపురపు అంజయ్య, పెద్దపల్లి దుర్గేష్, వడ్డేబోయిన బిక్షపతి, కందరబోయిన రామచంద్రయ్య, భూతం సత్యనారాయణ, ప్రచార కార్యదర్శులుగా అంబటి మట్టయ్య, కుడుముల సత్యనారాయణ, నరుగుల మురళీకృష్ణ, దేశబోయిన నాగేశ్వరరావు, దేశ బోయిన శ్రీనివాసరావు, కంభం శేషయ్య మరియు గౌరవ సలహాదారులు గా పాకాల ఉపేందర్ దేశ బోయిన తిరుపతయ్య చెరుకు వెంకటేశ్వర్లు పిల్లి బయన్న లను నియమించారు.

అదేవిధంగా జిల్లా గంగపుత్ర యూత్ కమిటీ అధ్యక్షుడిగా చంద్రగిరి వేణు, ఉపాధ్యక్షులుగా చింతల వెంకన్న, అంబటి రఘుబాబు, ప్రధాన కార్యదర్శిగా దేశబోయిన సురేష్, సంయుక్త కార్యదర్శులుగా సింగారపు సాయి, పూస కిరణ్ ప్రచార కార్యదర్శిగా జీజుల రోహిత్, పెద్దపల్లి శ్రావణ్, మరియు కోశాధికారిగా మోసం యుగంధర్ లను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కన్నం ప్రసన్న కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గంగపుత్ర సంఘం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక ఎమ్మెల్యే రేగా



మణుగూరు, ఏప్రిల్ 2 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ , పినపాక శాసనసభ్యులు , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు నియోజకవర్గ పర్యటనలో సంఘటన చోటు చేసుకుంది.పర్యటనలో తనతోపాటు ఉన్న బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ నాయకులు అన్వర్ పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్నాడు ఈ నేపథ్యంలో నమాజ్ సమయం కావడంతో రోడ్డు పైననే నమాజ్ చేశాడు. అయితే నమాజ్ ముగిసేవరకు అక్కడే ఉన్న రేగా కాంతారావు తీరు పట్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రశంసలు కురిపిస్తున్నారు. ఎమ్మెల్యే అయి ఉండి కూడా మిత్రుని కోసం నమాజ్ ముగిసే వరకు ఉన్న రేగా కాంతరావు మత సామరస్యానికి నిదర్శనం అని అంటున్న నియోజక వర్గం ప్రజలు, నాయకులు తదితరులు.

## టిడిపి నాయకుడు నాయుడు చెన్నారావు మృతి



దమ్మపేట, ఏప్రిల్ 2 (మనం న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం దమ్మపేట గ్రా మానికి చెందిన తెలుగుదేశం సీని యర్ పార్టీ నాయకులు నాయుడు చెన్నారావు గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందడం జరిగింది చెన్నారావు భౌతిక గాయాన్ని పలువురు నివాళులర్పించారు చెన్నారావు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది వీరిలో స్థానిక ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు నాగేశ్వరరావు కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు జిల్లా రైతుబంధు అధ్యక్షులు రావు జోగేశ్వరరావు పైడి వెంకటేశ్వరరావు వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు దొడ్డకుల రాజేశ్వరరావు మండల పశు వైద్యాధికారి మన్యం రమేష్ బాబు పోతినేని శ్రీరామ వెంకటరావు మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కె.వి సత్యనారాయణ సర్పంచి దారా యుగంధర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పసుమర్తి రాంబద్రరావు యువ నాయకులు చామర్తి గోపి శాస్త్రి మాజీ సర్పంచ్ ఆంగోతు బాలాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సి కె నాగార్జున మున్నూరు కాపు మండల అధ్యక్షులు సినశెట్టి సత్యనారాయణ సిన చిట్టి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు

## దమ్మపేట వేద పండితులకు విద్యాభూషణ బిరుదు ప్రధానం



దమ్మపేట, ఏప్రిల్ 2 (మనం న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం దమ్మపేట గ్రామానికి చెందిన వేద పండితులు కామవరపు విజయ మారుతి శర్మకు ఒంగోలులో సంతపేటలోని షిరిడి సాయిబాబా మందిర ప్రాంగణంలో శుభ కృత నామ సంవత్సర పంచాంగ రచన రజిత ఉత్సవ వేడుకలలో భాగంగా దమ్మపేట గ్రామానికి చెందిన ప్రముఖ జ్యోతిష్య వాస్తు ఆగమ వేదపండితుల విజయ మారుతి శర్మకు స్మార్త విద్యా భూషణ బిరుదు ప్రదానం చేయడం జరిగింది ఒంగోలులో జరిగినటువంటి తేజస్వి జ్యోతిష వాస్తు వేద పరిశోధన కేంద్రం వారి ఆధ్వర్యంలో ఏప్రిల్ 2వ తేదీ ఆదివారం ఉదయం 9గంటలకు ఒంగోలు సంతపేటలోని షిర్డీ సాయిబాబా మందిర ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగినట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో నిర్వహణ కమిటీ ప్రతినిధులు నీలం పూర్ణమోహన్, ప్రసాద్ శర్మ, సంస్థ అధ్యక్షులు దైవజ్ఞ డాక్టర్ జూటూరి భానుమూర్తి సిద్ధాంతి గారు తిరుపతి,శ్రీశైలం విజయవాడ వివిధ ప్రముఖ దేవాలయాల ఆస్థాన సిద్ధాంతులు కేసీఆర్ గారి ఆస్థాన పురోహితులు అయిన ఫణిశశాంక్ శర్మగారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖ పంచాంగ కర్తలు వేదపండితులు జ్యోతిష, వాస్తు పండితులను సత్కరించుకున్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 372వ వర్ధంతి




భద్రాచలం, ఏప్రిల్ 2 (మనం న్యూస్): బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 372 వర్ధంతి వారోత్స వాలు తెలంగాణ వ్యాప్తం గా జరుపుకున్నారు అని నాయకులు రవి తెలిపారు. భద్రాచలంలోని శాంతిన గర్ కాలనీ లో ఉన్న ఆర్టీవో ఆఫీస్ సిబ్బంది ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి ఉత్సవాలను ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఏ పాషా, గంధ్రకోటి రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## సికిల్ సెల్ ఎనీమియా పేషంట్‌కి ప్రసవం

**- తల్లి బిడ్డలను కాపాడిన డాక్టర్ అలీన శాంతి**



భద్రాచలం, ఏప్రిల్ 2 (మనం న్యూస్): చర్ల మండలంలోని గుమ్మగూడెం గ్రామానికి చెందిన పి నాగమణి సికిల్ సెల్ అనేమియా వ్యాధితో బాధపడుతోంది .గత నాలుగు రోజుల క్రితం ప్రెగ్నెన్సీ తో ప్రాణాపాయ స్థితిలో ఉన్న పి నాగమణి పరిస్థితి విషమించడంతో వైద్యులు ఖమ్మం గాని హైదరాబాదు గాని తీసుకు వెళ్ళమని సూచించారు.విషయం తెలుసుకున్న డాక్టర్ అలీన శాంతి భద్రాచలం కిమ్స్ హాస్పటల్లో నార్మల్ డెలివరీ చేశారు .నాగమణి పండంటి బాబుకు జన్మనిచ్చారు. ప్రస్తుతం తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నారని డాక్టర్ అలీన శాంతి తెలిపారు .గిరిజన ప్రాంతంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో డాక్టర్ అలీన ముందు ఉంటారని పలువురు ప్రశంసించారు .

## కూసుమంచి శివాలయంలో చోరీ



కూసుమంచి, ఏప్రిల్ 2 (మనం న్యూస్): కూసుమంచి మండల కేంద్రంలోని పుణ్యక్షేత్రమైన శ్రీశ్రీశ్రీ గణపేశ్వరాలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం తలుపులు పగల గొట్టి గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించారు. దేవాలయంలోని హుండీ, కార్యాలయం తాళాలను పగులగొట్టారు. భక్తులు వేసిన కానుకలు దొంగిలించారు. సుమారు రూ.5వేల వరకు దొంగిలించి ఉండవచ్చునని ఆలయ నిర్వాహకులు భావిస్తున్నారు. నిత్య పూజలకై తెల్ల వారు ఝామున దేవాలయానికి వచ్చిన పూజారీ ఆలయం తలుపులు, హుండీ తాళం పగుల గొట్టి ఉండటాన్ని గుర్తించి, ఆలయ నిర్వహకులకు సమాచారం అందించారు. కూసుమంచి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ రామలింగారెడ్డి, ఫోరెన్సిక్ నిపుణులు, సంఘటనా స్థలాన్ని సందర్షించి వివరాలు సేకరించారు. ఉండి పగలగొట్టి అందులో ఉన్న డబ్బులను దొంగలించారు. ఈ దృశ్యాలు సీసీ పుటేజ్ లో రికార్డ్ అయ్యాయి. దేవాలయంలో అమర్చిన సిసి కెమెరాలు చోరీకి పాల్పడ్డ దృశ్యాలు నమోదయ్యాయి. గుడి ఆవరణలో ఉన్న సిసి పుటేజీ ద్వారా ఫోరెన్సిక్ నిపుణులు పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

## ఘనంగా సర్వాయి పాపన్న వర్ధంతి



ఖమ్మం, ఏప్రిల్ 2 (మనం బ్యూరో): సర్వాయి పాపన్న 313 వర్ధంతి ని పురస్కరించుకుని ఆదివారం లకారం ట్యాంక్ బండ్ వద్ద నున్న సర్వా యి పాపన్న విగ్రహానికి అదనపు కలెక్టర్ ఎన్. మధుసూదన్, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ తో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివా ళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం సర్వాయి పాపన్న వర్ధంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. పాపన్న పోరాట పటిమను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోని రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు. బహుజన రాజ్యం కోరకు గోల్కొండ కోటను అధిరోహించి గోల్కొండ సింహసనాన్ని వశపరుచుకున్న బడుగు బలహీన వర్గాల నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న అని గుర్తు చేసారు. ప్రతి ఒక్కరు సర్దార్ సర్వాయి పాపన్న ను ఆదర్శంగా తీసుకోని వారి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.బి. సి. సంక్షేమ అధికారి జ్యోతి, ఎక్సయిజ్ సూపరింటెండెంట్ నాగేందర్ రెడ్డి, బిసి సంఘాల నాయకులు కత్తి నెహ్రూ, అమరనేని వెంకన్న, లింగాల రవికుమార్, సుగుణరావు, లింగయ్య, అంజయ్య, శ్రీనివాసరావు, రామారావు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయిలో సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు



ఖమ్మం, ఏప్రిల్ 2 (మనం న్యూస్): నాసా ఆధ్వర్యంలో నిర్వహించిన నాసా స్పేస్‌సెటిల్ మెంట్ కాంటెస్ట్‌లో స్థానిక మమత ఆసుపత్రి రోడ్‌నందుగల శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రపంచ స్థాయిలో తృతీయ స్థానంలో గా వారికి ఆదివారం ప్రశంసా పత్రాలను అందించారు. పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానుద్దేశించి శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 6వ తరగతికి చెందిన హేమకేష్, మర్రికంటి రామదీక్షిత్, యం. స్నేహిత, శ్రీదత్త శిద్ధ వశీకర్, జడ్. స్నేహిత 7వ తరగతికి చెందిన చరిత, 8వ తరగతికి చెందిన యం. కావ్య శ్రీ, 9వ తరగతికి చెందిన టి. గణేష్, పి. జితేంద్ర విద్యాసంవత్సరంలో నాసా స్పేస్‌సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో ఒక బృందంగా ఏర్పడి మిషన్ జీయో పెట్రా అనే నమూనాను రూపొందించారని, ఈ నమూనా ప్రపంచస్థాయిలో తృతీయ స్థానం సాధించిందన్నారు. కేవలం తరగతి గదిలో విద్యాబోధనకే పరిమితం కాకుండా సాంకేతిక విప్లవానికి నాందిగా ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న విద్యార్థులను, ఇందుకు సహకరించిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. అనంతరం తృతీయస్థానం సాధించి విద్యార్థులకు విద్యాసంస్థల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య ప్రశంసా పత్రాలను అందజేస్తూ ఈ ప్రాజెక్ట్ లో యాస్ట్రో రిసార్ట్ చ అనే కాలనీని జిరో గ్రావిటిని సృష్టించి, ఆక్సిజన్ తయారు చేసుకొనే విధంగా మల్చుకోని మానవుడు నివాస యోగ్యంగ తయారుచేయబడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల డి.జి.యం. చేతన్ మాథుర్, ప్రిన్సిపాల్ టిఎల్ఎన్.శర్మ, వైస్ ప్రిన్సిపాల్స్ రామకృష్ణా రెడ్డి, సురేష్, డిన్స్, కె.వి.ఆర్, రాశేఖర్ రెడ్డి, విష్ణు, నవీన్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, జగదీష్, రమేష్, శ్రీనివాస్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా మట్టల ఆదివారం



కల్లూరు, ఏప్రిల్ 2 (మనం న్యూస్): తపస్ కాల ఆరాధన శ్రమల కాలం చివరి ఘట్టం ఎంతో ప్రాముఖ్యమైన మ్రాను కొమ్మల ఆదివారం పురస్కరించుకొని పట్టణంలోని పురవీధులలో హోసన్న నినాదాలతో భారీ ర్యాలీని లిటిల్ ఫ్లవర్ చర్చ్ విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ విన్సెంట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని కప్పల బంధం రోడ్ లో ఉన్న క్రీస్తు రాజు మందిరం నుండి అంబేద్కర్ నగర్ జాతీయ రహదారి మీదుగా లిటిల్ ఫ్లవర్ చర్చి వరకు భారీ ర్యాలీతో క్రైస్తవులు హోసన్న నినాదాలతో జయహో యేసు రాజా, జయహో యేసు రాజా అంటూ మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు పడిన ఇబ్బందులకు గుర్తుగా శ్రమల వారంగా క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రమలవారంగా భావించి గొప్పగా చేసే కార్యక్రమం అని అన్నారు. అనంతరం దివ్య బల్లి పూజను సమర్పించారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ స్కూల్ మేనేజర్ రెవరెండ్ ఫాదర్ లూర్దు, విచారణ సహాయ గురువులు దేవదానం, కన్నె స్త్రీలు ,ప్యారిస్ కమిటీ, మరియ దళం, యువకులు, దీక్ష పరులు, ఉపదేశకులు, సంఘస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు కల్లూరు కవికి ఆహ్వానం




కల్లూరు, ఏప్రిల్ 2 (మనం న్యూస్): సాదు కలం పేరుతో ఎన్నో కవిత్వాలను రచించి, ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొని వందల కొద్ది ప్రశంసా పత్రాలను పొంది, ఆనతి కాలంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మండలంలో క్రిష్ణయ్య బంజర పంచాయతీలో వీరబ్రహ్మేంద్ర నగర్ కాలనీ కి చెందిన ఎం వి వి ప్రసాద్ కు మరో అరుదైన ఆహ్వానం అందింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుపతిలోని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 9,10 తేదీలలో శ్రీశ్రీ కళావేధిక వారి ఆధ్వర్యంలో మహతి ఆడిటోరియం నందు నిర్విరామంగా 48 గంటల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానం పంపించడం జరిగింది. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలలో పాల్గొనుటకు తెలంగాణ నుండి ఖమ్మం జిల్లా కల్లూరు వాసి సహజ కవి ఎం వి వి ప్రసాద్ (సాధు) పాల్గొనటం గర్వించదగ్గ విషయమని మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు అభినందించారు. తన కవిత్వంతో ప్రసాదు ఎన్నో వందల ప్రశంసాపత్రాలు, మరెన్నో సన్మానాలు అందుకున్నారని, అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో తన ప్రతిభను కనబరిచి తమ మండలానికి పేరు, ప్రతిష్టలు తీసుకు రావాలని కోరారు. అంతటి అరుదైన ఆహ్వానం అందటం చాలా సంతోషకరమని సహజ కవి ఎంవివి ప్రసాద్ అన్నారు. తిరుపతి వెంకన్న సాక్షిగా తన ప్రతిభను ప్రదర్శించి, బ్రహోత్తర కార్యక్రమంను విజయవంతం చేయాలని, తనకు ఆహ్వానం పంపినా శ్రీ శ్రీ కళావేధిక అంతర్జాతీయ చైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్ కి కన్వీనర్ కొల్లి రమావతి కి, సర్వోత్తమనాయుడు కి అభినందనలు తెలియజేశారు.

## నిరంకుశ రాచరిక పోకడలకు వ్యతిరేకంగా: మంత్రి



సూర్యాపేట, ఏప్రిల్ 02 మనం ప్రతినిధి: నిరంకుశ రాచరిక పోకడలకు వ్యతిరేకంగా సమాజంలోని బహుజన సమూహాలను ఏకం చేసిన ఘనుడు సర్వాయిపాపన్న అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టరేట్ కార్యలయంలో సర్వాయి పాపన్న గౌడ్ 313వ వర్థంతి వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...... తెలంగాణ వీరత్వానికి, పరాక్రమానికి ప్రతిక పాపన్న అని, అన్ని వర్గాలను ఏకం చేసి అప్పటి నియంతృత్వ, నిరంకుశ శక్తులకు వ్యతిరేకంగా పోరాడడని పేర్కొన్నారు. ఆత్మగౌరవం కొరకు వివక్ష, దురాభిమానాలకు వ్యతిరేకంగా పోరాడిన ఘనుడు పాపన్న అని అన్నారు. పాపన్న జయంతి, వర్థంతి కార్యక్రమాలను ప్రభుత్వమే నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సర్వాయిపాపన్న చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎస్ వెంకట్రావు, అధనపు కలెక్టర్ హేమంత్ కేశవ్, జడ్పీ వైస్ చైర్మన్ వెంకటనారాయణ, గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, కౌన్సిలర్లు రాపర్తి శ్రీనివాస్, అభయ్, భరత్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

## చెస్ పోటీలను ప్రారంభించిన మేయర్ సునీల్ రావు



కరీంనగర్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): తెలంగాణ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ 33 వ డివిజన్ భగవతి ఆర్వీన్ ట్రీ పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా అండర్ 17 బాల బాలికల రాష్ట్ర స్థాయి చెస్ ఎంపిక పోటీలను కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్ రావు, భగవతి విద్యాసంస్థల చైర్మన్ రమణరావుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ చెస్ క్రీడ ద్వారా విద్యార్థిని విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. మేధా శక్తిని పెంచడంలో చెస్ క్రీడలు ఎంతో దోహద పడుతాయని తెలిపారు. నేటి యువత, విద్యార్థిలోకం శారీరక, మానసిక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడానికి ఇండోర్ క్రీడలతో పాటు అథ్లెటిక్స్‌లోనూ పాల్గొని మంచి నైపుణ్యం సాధించాలన్నారు. శారీరకంగా బాగుంటేనే విద్యార్థులు విద్యారంగంలో కూడ ముందుగు సాగుతారన్నారు. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైన ఆత్మవిశ్వాసం తో వాటిని ఎదుర్కొనే శక్తి విద్యార్థులకు క్రీడల ద్వారానే లభిస్తాయని ఆయన తెలిపారు. ప్రపంచ స్థాయి చెస్ పోటీల్లో పాల్గొని చాలా మంది క్రీడాకారులు మన దేశానికి మంచి పేరు తెచ్చారని వారిని విద్యార్థులు ఆదర్శంగా తీస్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ భాద్యులుప్రద్యుమ్నరావు,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## పచ్చని తెలంగాణను కొల్లగొట్టేందుకే బండి, రేవంత్, షర్మిలలు ఏకమయ్యారు



కొత్తపల్లి, ఏప్రిల్ 2 (మనం న్యూస్: పచ్చని తెలంగాణను కొల్లగొట్టేందుకే బండి సంజయ్, రేవంత్ రెడ్డి, షర్మిలలు ఏకమయ్యారని రాష్ట్ర బిసి సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజల నుంచి వస్తోన్న ఆదరణను చూసి ఓర్వలేకనే కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలంతా ఐకమత్యంగా ఉండి బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. సమైక్య పాలనలో 75 సంవత్సరాలుగా పేరుకుపోయిన దరిద్రాన్ని తొలగిస్తున్నామన్నారు. తెలంగాణ లో ముఖ్యమంత్రి గా కెసిఆర్ ఉన్నారు కాబట్టే మన వనరులను మనం సంరక్షించుకొని వాడుకునే పరిస్థితి ఉందన్నారు. పచ్చని తెలంగాణను చూసి విపక్షాలకు కడుపు మంట, కళ్ళ మంట ప్రారంభమయిందని, మన వనరులను కొల్లగొట్టాలని, రాజ్యాధికారం కావాలని మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీల అధిష్టానం ఢిల్లీలో ఉందని అక్కడి నుండి కంట్రోల్ చేస్తూ ఇక్కడి వనరులను దోచుకోవడానికి చూస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నారని ఆయన చేతులకు కార్యకర్తలంతా బలం కావాలన్నారు.

## ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తు గడువు పెంపు

### కలెక్టర్ పి ప్రావీణ్య

వరంగల్, ఏప్రిల్ 2, మనం న్యూస్ : జీఓ 58, 59 ల కింద నిరభ్యంతర ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు ఏప్రిల్ 30 వ తేదీ వరకు మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పి ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏళ్లుగా ఆక్రమణలో ఉన్న నివాసిత ప్లాట్ల క్రమబద్ధీకరణకు జీఓ 58, 59 ల కింద ఇప్పటి వరకు 2014 జూన్ 2 కటాఫ్ తేదీ ఉండగా, దానిని 2020 జూన్ 2 వరకు పొడిగిస్తూ ప్రభుత్వంగతమార్చి17న జీఓ29 నిజారీ చేసిందన్నారు. ఇప్పుడు ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 30 వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కలెక్టర్ పేర్కొన్నారు. లబ్ధిదారులు మీ-సేవ కేంద్రాలద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.

## మంత్రి గంగులను కలిసిన డిఎంహెచ్ఓ



కరీంనగర్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సాజిదా అతహరి బిసి సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమ లాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం కరీంనగర్‌లోని మీ సేవాకార్యాలయంలో మంత్రిని కలిసిన ఆమె పూల మొక్కను అందించారు.

# చరిత్రలో ప్రజల నమ్మకాన్ని ఎవరూ ఏమార్చలేరు

**-కార్యకర్తలతో మమేకం అయ్యేందుకే ఆత్మీయ సమ్మేళనం**

**-తెలంగాణలో సర్కారు దవాఖానల స్థాయి పెంపు**

**-తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాల మంత్రి సింగిరెడ్డి నిరాంజన్ రెడ్డి**



వనపర్తి ప్రతినిధి ఏప్రిల్ 02( మనం న్యూస్): చరిత్రలో ప్రజల నమ్మకాన్ని ఎవరూ ఏమార్చలేరని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకద్ర నియోజకవర్గం మదనాపురం మండలకేంద్రంలో నిర్వహి ంచిన బీఆర్ఎస్ కుటుంబసభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ లో ప్రతి గడపకూ ఏదో ఒక ప్రభుత్వ పథకం అందుతున్నదని రైతుబంధు, రైతుభీమా, కేసీఆర్ కిట్, 24 గంటల ఉచిత కరంటు, ఆసరా ఫించన్లు, అమ్మవడి, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, దళితబంధు ప్రతి ఒక్కరికి ఏదో ఒక పథకం కింద లబ్ది చేకూరుతున్నదని తెలిపారు.ఒకనాడు సర్కారు దవాఖాన లో అడుగుపెట్టడానికి ప్రజలు భయపడేవా రని నేడు కొన్ని జిల్లాల కలెక్టర్లు ప్రజలలో ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకాన్ని పెంచేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పు చేయించుకుంటున్నార న్నారు.



**తెలంగాణలో సర్కారు దవాఖాన్ల స్థాయి పెరిగిందని**

విద్యారంగంలో 29 వేల పాఠశాలలను మనఊరు మనబడి పథకం కింద ఆధునీకరిస్తున్నామని అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నామని అన్నివర్గాల విద్యార్థులకు సంక్షేమ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని బడి ఈడు పిల్లలు చదువుకు దూరం కావద్దని ప్రైవేటులో డబ్బులు పెట్టి కొనుక్కో వద్దు అన్నది ప్రభుత్వ ఆకాంక్ష అని చెప్పారు.గత పాలకులకు పొలాలకు నీళ్లివ్వాలి, ప్రజల చేతికి పని దొరకాలి, విద్య, వైద్య రంగాలు బలోపేతం చేయాలన్న ఆలోచన లేదని ఓట్లు వేయించుకుని 5 ఏండ్లు మాయమై మళ్లీ ఓట్లప్పుడు మాయమాటలు చెప్పి ఓట్లేయించుకుని కనుమరుగయ్యేదని కానీ నేడు తరం మారింది. ప్రజల ఆలోచన మారిందని ఎవరు ఎంత మొక్కినా ప్రజలు పని జరిగిందని నమ్మితేనే ఓట్లేస్తారని గ్రామాలకు నీళ్లొచ్చినయా పంటలు పండుతున్నయా ప్రతి ఊరిలో ఫించన్లు వచ్చినయా లేదా అన్నది కళ్ల ముందు కనుపిస్తున్నదని పేర్కొన్నారు. వివిధ పథకాల ద్వారా 9 ఏళ్లలో గ్రామాలకు వచ్చిన నిధులు వందల కోట్లు ఉంటాయని గ్రామాల్లో ప్రజలు మునుపటి కంటే మెరుగైన స్థితిలో జీవనం సాగిస్తున్నారని గ్రామాల్లో పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగయిందని హరితహారంతో చెట్ల పెంపకం మూలంగా గ్రామాలు పచ్చగా కనిపిస్తున్నాయని ఈ పరిస్థితిలో మరింత మార్పురావాలని ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలని అప్పుల్లేని జీవనం సాగించాలని కార్యకర్తలతో మమేకం అయ్యేందుకే ఆత్మీయ సమ్మేళనం అని తెలియచేసారు.







# హ్యాట్రిక్ దిశగా ఎమ్మెల్యే కిషోర్ అడుగులు



శాలిగౌరారం, ఏప్రిల్ 2 (మనం న్యూస్) : రానున్న ఎన్నికలలో తుంగతుర్తి ఎమ్మెల్యేగా గాదర్ కిషోర్ కుమార్ కి మూడవసారి పట్టం కట్టేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆదివారం రోజు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాన్ని చూస్తే అర్థమవుతుంది.రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశానుసారం , కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం రోజు నల్లగొండ జిల్లా , శాలిగౌరారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే డా.గాదరి కిశోర్ కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఐతగోని వెంకన్న గౌడ్ అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగాతుంగతుర్తి శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్ , రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ , నల్లగొండ జిల్లా జెడ్పీచైర్మన్ బండా నరేందర్ రెడ్డి హాజర య్యారు. బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు, మహిళలు బతుకమ్మలతో, బోనాలతో, కోలా టాలు, సవార్లు, డప్పు దరువుల సందడితో, పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి ప్రజా ప్రతినిధులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ.. తుంగతుర్తినియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఎమ్మెల్యే కిశోర్ ఎన్నో అభివృద్ధి పనులు చేశారని , రానున్న రోజులలో మిగతా పార్టీలతో కబడ్డీ ఆడతామని , తెలంగాణ రాష్ట్రం బంగారు తెలంగాణ అయిందని అందుకనే టిఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్ పార్టీగా పేరు మార్చారని , దేశ రాజకీయాలలో బీఆర్ఎస్ పార్టీ తమ సత్తా చాటాలని అన్నారు.అనంతరం ఎమ్మెల్యే కిషోర్ మాట్లాడుతూ..గుజరాత్ రాష్ట్రానికి 12 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన మోడీ కాలంలో కేవలం 600 రూపాయల పెన్షన్ మాత్రమే ఇచ్చేవారిని , అదే తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ 2016 రూపాయల పెన్షన్ ఇస్తున్నారని , దేశంలో 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని అన్నారు. శాలిగౌరారం మండలంలో 6988 పెన్షన్ ద్వారా లబ్ధి పొందుతున్నారని , నేటికీ 1811 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు. మండలంలో 110 మందికి దళిత బంధు అందజేస్తామని , సొంతంగా జాగా ఉన్న 300 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయల చొప్పున అందజేస్తామని చెప్పారు. నేటికీ 190 కోట్ల 57 లక్షల రూపాయలను రైతు బీమా చెల్లించామని , అన్ని రంగాలలో తుంగతుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధితో ముందుకు తీసుక వెళుతున్నామని అన్నారు.బీఆర్ఎస్ పార్టీపై ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని ధీటుగా ఎదుర్కోవాలని నాయకులు పిలుపునిచ్చారు.

**పార్టీలోకి భారీ చేరికలు**

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపధ్యక్షుడు నూక సత్తయ్య , టీపీసీసీ అధికార ప్రతినిధి నూక కిరణ్ యాదవ్ , వల్లాల గ్రామ సర్పంచ్ ఇంతియాజ్ , అడ్లూరు మాజీ సర్పంచ్ బండి భద్రయ్య , శాలిగౌరారం ఎంపిటిసి జోగు సైదమ్మ శ్రీనివాస్ , యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండమీది రమేష్ తో పాటు 500 మంది నాయకులు బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఆకర్షితులై ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ , ఎమ్మెల్యే కిశోర్ కుమార్ , జెడ్పీచైర్మన్ బండా నరేందర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంట లక్ష్మమ్మ రాములు , జెడ్పిటిసి ఎర్రణీల యాదగిరి , ప్యాక్స్ చైర్మన్ తాళ్లూరి మురళి , వైస్ ఎంపీపీ కందుల అనిత , రైతు బంధు సమితి కోఆర్డినేటర్ గుండా శ్రీనివాస్ , మండల ప్రధాన కార్యదర్శి హతిష్ రెడ్డి , ప్యాక్స్ వైస్ చైర్మన్ చామల మహేందర్ రెడ్డి , మార్కెట్ వైస్ చైర్మన్‌శేఖర్‌బాబు, నాయకులు మామిడి సర్వయ్య, కట్ట వెంకట్ రెడ్డి , మురారి శెట్టి కృష్ణమూర్తి , దుబ్బ వెంకన్న , గ్రామ సర్పంచ్లు , ఎంపీటీసీలు , ప్రజాప్రతినిధులు ,నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఫ్రీడమ్ ఫైటర్ సర్దార్ పాపన్న గౌడ్ కలెక్టర్ పి ప్రావీణ్య



వరంగల్, ఏప్రిల్ 2, మనం ప్రతినిధి : ఫ్రీడమ్ ఫైటర్ సర్దార్ పాపన్న గౌడ్ ది వరంగల్ జిల్లా కావడం గర్వకారణం అని, ఆయనను మనమందరం తప్పనిసరిగా స్మరించుకోవాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్దార్ పాపన్న గౌడ్ 313 వ వర్ధంతి వేడుకలు సందర్భంగా



జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ పాపన్న గౌడ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ అశ్విని తానాజీ వాకాడే, సంబంధిత గౌడ సంఘ నాయకులు రమేష్ గౌడ్, సుధాకర్, బొమ్మెర కుమార్ స్వామి, బిసి సంక్షేమ అధికారి శంకర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి, సంబంధిత జిల్లా అధికారులతో కలిసి ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన గావించి సర్దార్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వం

**-ప్రతిపక్షాల కుట్రలను తిప్పి కొట్టాలి.....**

**-ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటా....**

**-పండగలా బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు....**

**-డప్పులు, కోలాటాలు, నత్యాలతో ఉత్సాహంగా పాల్గొంటున్న పార్టీ శ్రేణులు....**



వరంగల్, ఏప్రిల్ 2, మనం ప్రతినిధి : అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యత కల్పిస్తూ, రాష్ట్రాన్ని అభివద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని బిఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ 55 వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే అరూరి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భీమారంలోని డివిఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోలాటం ఆడి, డప్పు కొట్టి సందడి చేశారు. తెలంగాణ రాష్ట్రానికి కేసీఆరే శ్రీరామ రక్ష అని ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి దానికి అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు శాయశక్తుల కషి చేస్తున్నాని వెల్లడించారు. 55 వ డివిజన్ భీమారంలో 38 కోట్లతో అభివద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. పార్టీ కోసం నిబద్ధతతో పని చేస్తున్న కార్యకర్తల కషి వెలకట్టలేనిదని అన్నారు.ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. ఇతర రాజకీయ పార్టీలు కేవలం ఎన్నికలు, రాజకీయ ప్రయోజనాలకే పకులడుతున్నాయని విమర్శించారు. తెలంగాణా రాష్ట్రానికీ మరో సారి కెసిఆర్ నాయకత్వం అవసరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బందు సమితి అధ్యక్షురాలు లలితా యాదవ్, కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు, డివిజన్ ప్రెసిడెంట్ అటికం రవీందర్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.









# నిజామాబాద్

## కమనీయం రాములోరి రథోత్సవం



కొండపాక, ఏప్రిల్ 02, మనం న్యూస్‌: కొండపాక మండలం కుకునూ రుపల్లి గ్రామంలోని సీతారామచంద్ర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఆలయ భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారా ముల గరుడసేవ రతోత్సవ ఊరేగింపు కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధల నడు మ కన్నుల పండువగా జరిగింది. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 5 గంటల వరకు సాగింది. కుకునూరుపల్లి గ్రామస్తులు రథోత్సవం సంద ర్భంగా మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్లతో రథోత్సవాన్ని ఊరేగించారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పండుగ వాతావరణం నెలకొంది. స్వామి వారిని గ్రామస్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధుల గుండా రథాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవిందర్, బారతీయ జాగృతి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు అనంతుల ప్రశాంత్, ఉప సర్పంచ్ బాలా గౌడ్, మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్, ఉప్పల రాజు, పాండు తదితరులు పాల్గొన్నారు.

## మాత్‌పల్లిలో జోడో యాత్ర



కొండపాక, ఏప్రిల్ 02, మనం న్యూస్‌: కుకునూరుపల్లి మండలంలోనితద మాత్‌పల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా దనాయకులు ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రలో జోడో యాత్ర ఇంచార్జ్ ప్రమోద్‌కుమార్, కుకునూరుపల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ వీరేశం. ఎర్రవల్లి ఎంపిటిసి ప్రణవి, శ్రీనివాస్‌రెడ్డి, కో ఆపరేటివ్ డైరెకట్ చారి, కాంగ్రెస్ నాయకులు కొండపాక పార్టీ అధ్యక్షులు లింగారావు, నాయకుఉలు రెడ్డమైన రవిందర్, వెంకట్ గౌడ్, బూరుగు యాదగిరి, సత్యం గౌడ్, మాత్‌పల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు దొంతి లింగం, వివిమండల పార్టీ అధ్యక్షులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, మండల పార్టీ అధ్యక్షులు విరూపాక శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేటి నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం



నిజామాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 2 (మనం న్యూస్): జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి సోమవారం నుంచి ఉదయం 9:30 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా 138 పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన అన్నారు. జిల్లా వ్యాప్తంగా 21588 విద్యార్థిని,10675 విద్యార్థులు10913 పరీక్షలు రాస్తున్నారు .అన్ని పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. విద్యార్థులు తమ తమ హాల్ టికెట్లను పరీక్ష కేంద్రాలకు కచ్చితంగా తీసుకురావాలని ఆయన సూచించారు. ఇంటర్నెట్లో డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్ లపై సంతకాలు లేకున్నా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హాల్ టికెట్ యాక్సెప్ట్ చేయాలని ఆయన ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల సౌకర్యం పరీక్ష కేంద్రాలలో మంచినీటి సౌకర్యంతో పాటు వైద్య ఆరోగ్యశాఖ లోని ఏఎన్ఎం లకు అందుబాటులో ఉంచడమే కాకుండా వివిధ రకాల మందులను అందుబాటులోకి ఉంచడం జరిగిందని ఆయన సూచించారు. పరీక్ష కేంద్రాలలో మాస్ కాపీ కు ఎలాంటి తావు లేదని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా విద్యార్థి మాస్కార్పింగ్ పాల్పడితే విద్యార్థితో పాటు ఇన్విజిలేటర్ పై సెక్షన్25/97 యాక్ట్ కింద శిక్ష దారులుగా గుర్తించబడతారని ఆయన హెచ్చరించారు. విద్యార్థులకు ఏమైనా అనుమానాలు ఉంటే మాత్రం ఈ 9030282 993 గల నెంబర్ కు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆయన సూచించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 138 కేంద్రాలకు సందర్శించడం జరిగిందని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలక్కుండా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గ ప్రసాద్ తెలియజేశారు.

# తలుపులెప్పుడూ తెరిచే ఉంటాయి

- కష్టంలో, ఆపదలో తోడుంటా
- వచ్చేది మన ప్రభుత్వమే
- ప్రతిపక్షాలది పసలేని ఆరోపణలు
- మంత్రి హరీష్‌రావు





సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 02, మనం న్యూస్‌: మీకోసం ఇంటి తలుపులెప్పుడూ తెరిచే ఉంటాయని, మీ కష్టంతోనే ఇంతవాళ్లమయ్యామని, ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా ఒక అన్నలా, తమ్ముడిలా, తండ్రిలా, ఇంటి పెద్దలా బాధ్యత తీసుకుంటానని మంత్రి హరీష్‌రావు అన్నారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, మీ అందరి సహకారంతోనే రెండుమార్లు అధికారంలోకి వచ్చామని, రాబోయేది మళ్లీ మన ప్రభుత్వమేనని, ఎవరూ అధైర్య పడవద్దు.. కష్టపడే ప్రతి కార్యకర్తకు సరైన సమయానికి గుర్తింపు లభిస్తుందని, నేనున్నానంటూ వారిలో ఆత్మవిశ్వాసం నింపారు. ఆదివారంనాడు నారాయణరావుపేట మండలం బిఆర్ఎస్ పారీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పెద్ద సంఖ్యలో హాజరైన కార్యకర్తలు తెరాస బలగాని చూసి కాసింత ఉద్వేగంగా మాట్లాడారు. మాకోసం మీరుంటే, మీకోసం ప్రభుత్వం ఉందని, ఎప్పటికీ మిమ్ములను మరువబోదన్నారు. చెప్పిన ప్రతీ పని చేసే ప్రభుత్వం మనదని, ప్రతిపక్షాల కల్లబొల్లి మాటలకు కాలం చెల్లిందన్నారు. మండుటెండల్లో ఒక వైపు కాళేశ్వరం ద్వారా గోదావరి నీళ్లు మత్తళ్లు దుంకుతుంటే ఢిల్లీలో కూర్చొని ఒకడు కాళేశ్వరం దండుగ అని మాట్లాడుతుండడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఆకాశం వైపు వరుణ దేవుడి కోసం చూసే రోజులు పోయి ఏడాదికి రెండు పంటలు పండించుకునే అన్నీ నీళ్లు కళ్లముందు ఉన్నాయన్నారు. మహారాష్ట్ర నుండి వచ్చిన రైతులు మన ప్రాజెక్టును చూసి దేశంలోని రైతులంతా కేసీఆర్ వెంటే నడిచేందుకు సంఘటితమవుతుంటే బీజేపి మాత్రం పసలేని ఆరోపణలు చేస్తూ పనిగట్టుకొని విషం చిమ్ముతూ పచ్చగా ఉన్న తెలంగాణలో కులాల చిచ్చు పెట్టాలని చూస్తుందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ గొప్పలకు పోయే బీజేపి అధికారంలో ఉన్న మహారాష్ట్రంలో నాలుగు రోజులకు ఒకసారి నీళ్లిస్తుంటే కొత్తగా ఏర్పడిన తెలంగాణలో మిషన్‌భగీరథ ద్వారా ఇంటింటికి నల్లాల ద్వారా నీళ్లిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం సంపద పెంచి పేదలకు పంచుతుంటే బీజేపి సర్కార్ పేదలపై అనేక రకా పన్నులు వేస్తూ 16 వేల కోట్ల అదానీ అప్పులు మాఫీ చేసిందన్నారు 30 ఏళ్లుగా నారాయణరావుపేట మండలం కోసం ఇక్కడి ప్రజలంతా ఆశగా ఉంటే ఆ కల నిజం చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. అద్భుతంగా పని చేసే ప్రజాప్రతినిధులు ఈ మండలంలో ఉన్నారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించే అవార్డుల్లో ఈ మండలం లేకుండా ఒక్క అవార్డు ఉండదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు ఏ నాడూ పట్టించుకోలేదని, ఇప్పుడు ఇందిరమ్మ రాజ్యమంటూ ఓట్ల కోసం పాట్లుపడుతున్నారన్నారు. గర్భినీల కోసం రెండు మార్లు ఇచ్చే న్యూట్రీషన్ కిట్‌ను ఈనెల 16వ తేదీన ప్రారంభం చేయనుండగా, ఖాళీ జాగ ఉంటే ఇల్లు కట్టుకునే పథకాన్ని కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. గతంలో గంజి కేంద్రాలు, ఆకలి కేంద్రాలకు నెలవుగా ఉన్న తెలంగాణ నేడ గోదావరి మూలంగా సగం దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా అవతరించిందన్నా. దళితుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సెక్రటరియేట్‌కు అంబేద్కర్ పేరు పెట్టుకొని వారి స్ఫూర్తితో మరిన్ని సంక్షేమ పథకాల వైపు అడుగులు వేయనున్నట్లు తెలిపారు. పేపర్ లీకేజీ ప్రతిపక్షాలు బయట పెట్టలేదని, ప్రభుత్వమే గుర్తించి దోషులను శిక్షి ంచిందన్నారు. ఆరు నెలల్లో 80 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ప్రతిపక్షాల మాటలు నిరుద్యోగులు నమ్మి నడి సంద్రంలో మునగొద్దన్నారు. అంతకుముందు బుగ్గరాజేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, జెడ్పి ఛైర్మన్ రోజాశర్మ, సుడా ఛైర్మన్ మారెడ్డి రవిందర్‌రెడ్డి, నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కుంబాల ఎల్లారెడ్డి, దీకొండ భాస్కర్, గుర్రాలగొంది సర్పంచ్ ఆంజనేయులు, ఆకుల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష మంది కార్యకర్తలతో

# బోధన్‌లో భారీ బహిరంగ సభ

బోధన్ ఏప్రిల్ 02 (మనం న్యూస్): కే కే సి జాతీయ అధ్యక్షుడు ఉదిత్ రాజ్ ఆదేశాల మేరకు త్వరలో తెలంగాణ కేకేసి విభాగానికి సంబంధించిన బహిరంగ సభను బోధన్ నియోజకవర్గంలో లక్ష మంది కార్యకర్తలతో నిర్వహిస్తామని కేకేసి నేషనల్ కోఆర్డినేటర్ తెలంగాణ ప్రదేశ్ కేకేసి ఇంఛార్జి కెప్టెన్ కరుణాకర్ రెడ్డి తెలియజేశారు. ఆదివారం ఎడపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కెప్టెన్ మాట్లాడుతూ కేకేసి విభాగానికి తెలంగాణ నేషనల్ కోఆర్డినేటర్ గా,తెలంగాణ ప్రదేశ్ కేకేసి ఇన్ఛార్జిగా నియమించినందుకు రాహుల్ గాంధీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాహుల్ గాంధీ పై పార్లమెంటులో అనర్హత వేటు వేయడం బీజేపీ అభద్రతాభావాన్ని తెలియజేస్తుందని అన్నారు. దేశంలో ఎగవేత దారులు అందరూ మోడీ ప్రభుత్వం లోనే ఉన్నారని అన్నారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన కుటుంబం పై మోడీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని తెలిపారు. రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడో యాత్ర కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెస్తుందని అన్నారు.బీజేపీ పార్టీ మతసామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ప్రజలను కులమతాలవారీగా విభజిస్తున్నారని తెలిపారు. కేకేసి విభాగం తెలంగాణ అన్ని జిల్లాలలో విస్తరింపజేసి కేకేసి విభాగానికి సంబంధించిన అన్ని రంగాలలో సమన్వయకర్తలను నియమించి ప్రజా సమస్యలపై పోరాడుతామని కార్మికులకు వారి హక్కులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.కేకేసి విభాగానికి తెలంగాణ ప్రదేశ్ కేకేసి అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్ ఆదేశాల మేరకు స్టేట్ కేకేసి కోఆర్డినేటర్ గా శంకర్ నాయుడు ను నియమించినట్లు తెలిపారు. భాస్కర్ రాజు మాజీ ఎంపీపీ ని కేకేసి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా,ఎస్ రమేష్ రెడ్డి (ఆర్మూర్ ) నిజామాబాద్ కేకేసి పార్లమెంట్ కాన్స్టెన్సీ కోఆర్డినేటర్ గా, ఖాజా ఫయాజుద్దీన్ను నిజామాబాద్ డిస్ట్రిక్ట్ స్ట్రీట్ వెండర్స్ అధ్యక్షునిగా,బుడ్డ పోశెట్టి బోధన్ నియోజకవర్గం కోఆర్డినేటర్ గా, మెగావాత్



సరిదాస్ ఉపాధి హామీ బోధన్ నియోజకవర్గం కోఆర్డినేటర్ గా, రాజా గౌడ్ బోధన్ పట్టణ కోఆర్డినేటర్ గా,బేగరి సాయిలు బోధన్ మండల కోఆర్డినేటర్ గా, బి శ్రీనివాస్ రెంజల్ మండల కోఆర్డినేటర్ గా, సున్నపు వడ్డెన్న ఎడపల్లి మండల కోఆర్డినేటర్ గా, గైని క్రిష్ణ,గణపురం రవి లను నవిపేట మండల కోఆర్డినేటర్ గా, చీల ప్రకాష్ సాలూర మండల కోఆర్డినేటర్ గా, వాగ్మా రే ప్రకాష్ బోధన్ నియోజకవర్గం సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా,దండెం సాయిలు ఎడపల్లి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా ప్రకటించడం జరి గిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కరుణన్న యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట

## హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌ను ఆశీర్వదించాలి



కొండపాక, ఏప్రిల్ 02, మనం న్యూస్‌: బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి మరోసారి సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా ఆశీర్వదించడానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని జిల్లా బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేనం ఇంచార్జ్ , మాజీ చీఫ్ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కొండపాక మండలం తెరాస పార్టీ ఆత్మీయ సమ్మేళనం మండల పరిధిలోని దుద్దెడ వైష్ణవి గార్డెన్స్‌లో మండల పార్టీ అధ్యక్షులు నూనె కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే పార్టీ బిఆర్ఎస్ పార్టీ అన్నారు. బీజేపి, కాంగ్రెస్ నాయకుల బూటకపు ప్రచారాలను , బోగస్ ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. రానున్న రోజుల్లో ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను చూసి పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుండి బిఆర్ఎస్‌లో చేర డం శుభ పరిణామమమన్నారు. గజ్వేల్ నియోజకవర్గం నుండి రానున్న ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపించడానికి కృషి చేయాలన్నారు.

**- నిరుత్సాహంతో కార్యకర్తల ఆవేదన.. స్వల్ప గలాలా**

బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా పని చేసిన కార్యకర్తలు ఆవేదనకు గురై స్వల్ప గలాటా సృష్టించారు. వారిని సముదాయించడానికి ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి ప్రయత్నించారు. కార్యకర్తలకు రానున్న రోజుల్లో సముచిత స్థానంతో గౌరవించడం జరుగుతుందన్నారు. ఉద్యమం నుండి పనిచేసుతన్న తమను పట్టించుకోవడం లేదని వాగ్వాదానికి దిగారు. సంక్షేమ పథకాలు అందడలో ప్రజలు సంతోషంగా లేరిన కళ్యానలక్ష్మి, దళితబంధు, డబుల్ బెడరూమ్ వంటి పథకాలు జెండా మోసిన కార్యకర్తలకు అందకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవిందర్, కొండపాక ఛైర్మన్ ఎల్‌నక్షరెడ్డి, మాజీ హౌజింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ మడుపు భూంరెడ్డి, జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ఆరెపల్లి మహదేవ్‌గౌడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ జర్నలిస్ట్ అవార్డ్ పొందిన గంట భాగేష్



భీమ్గల్ ఏప్రిల్ 2 (మనం న్యూస్): డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్వర్యంలో ప్రజా సమస్యల మీద పత్రికల్లో ప్రచురితమైన కథనాల పోటీలో భీమ్గల్ పట్టణానికి చెందిన నేటి దినపత్రిక సూర్య జర్నలిస్ట్ గంట భాగేష్ రాసిన 'భరోసా లేని బతుకులు' అనే కథనానికి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డ్ పొందారు.హైదరాబాద్ లోని నాగోల్ అనంతుల ధర్మారెడ్డి గార్డెన్స్ లో నిర్వహించిన డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ మహాసభల్లో జాతీయ పకృతి విపత్తుల నివారణ సంస్థ మాజీ చైర్మన్, బిజెపి జాతీయ నాయకులు మర్రి శశిధర్ రెడ్డి చేతుల మీదుగా అవార్డ్ అందుకున్నారు.ఈ కార్యక్రమానికి హైకోర్టు సినియర్ అడ్వకేట్ రాపోలు భాస్కర్,సీనియర్ జర్నలిస్ట్ మనసాని కృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గంట భాగేష్ మాట్లాడుతూ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డ్ పొందినందుకు సంతోషంగా ఉందనీ ప్రతిభ గల జర్నలిస్టులను గుర్తించడం సంతోషదాయకమైన విషయమని తెలిపారు.గంట భాగేష్ కు అవార్డ్ రావడం పట్ల బంధువులు, స్నేహితులు లింబాద్రి, సతీష్, గోవర్ధన్, శ్రేయోభిలషులు, సన్నిహితులు, తోటి జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## బలగం సినిమా వికసించిన గ్రామ ప్రజలు



భీంగల్‌ఏప్రిల్2 (మనంన్యూస్): భీంగల్ పట్టణంలోని బోధిరే గల్లీలో బోర్ర హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బలగం సినిమా ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది .ఈ సినిమాను 400కు పైగా ప్రజలు ఒకేచోట కూర్చొని తిలకించారు. సినిమా చూస్తూ కొంతమంది కన్నీళ్లు పెట్టుకోవడం కూడా జరిగింది. ఇంట్లో అందరూ ఉన్న ఒకరినొకరు పలకరించుకునే రోజులు పోతున్నాయి .పిల్లలు సెల్ ఫోన్లలో కాలం గడుపుతూ పెద్దలు టీవీలలో నిమగ్నమై పోతున్నారు .ఇంకా ఎవరైనా ఉద్యోగం చేసేవారు ఉంటే ల్యాప్టాప్ లతో బిజీగా గడుపుతున్నారు. కుటుంబమంతా ఒకే చోట కూర్చుని భోజనం చేయలేని పరిస్థితులలో బలగం సినిమాతో అందరినీ ఒకేచోట కూర్చుని సినిమాను తిలకిస్తున్నారు యూత్ సభ్యులు మాట్లాడుతూ: ఇటువంటి సినిమాలు సమాజానికి ఉపయోగపడే సినిమాలు తీయాలని కోరుకుంటున్నారు ప్రజలందరూ కూర్చోట సినిమాను తిలకించటం చాలా సంతోషకరముగాఉందని యూత్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు చేగంటి వంశీ ,బోధిరే నవీన్ కౌన్సిలర్ బోధిరే నరసయ్య ,సుమన్,లింబాద్రి ,తిరుపతి ,హరీష్, పవన్ ,గంగాధర్ రఘు , తదితర యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- బీ.సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా వర్ధంతి వేడుకలు



నిజామాబాద్, ప్రతినిధి మార్చి 02 (మనం న్యూస్):-- సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తి అందరికీ అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలను ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు, శాసన మండలి సభ్యుడు వి.గంగాధర్ గౌడ్, నగర మేయర్ నీతూ కిరణ్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్పర్సన్ ఆకుల లలిత తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జెడ్పి చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు, ఎమ్మెల్సీ వీ.గంగాధర్ గౌడ్ లు మాట్లాడుతూ, పోరాట యోధుడు పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను అధికారికంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అన్యాయాన్ని ఎదురించేందుకు సర్వాయి పాపన్న గౌడ్ కనబర్చిన పోరాట తెగువ అనన్యసామాన్యమైనదని కొనియాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు కుల వృత్తులు, చేతి వృత్తుల వారిని అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. మొఘల్ రాజుల కాలంలో దౌర్జన్యాలు, అణిచివేతలకు వ్యతిరేకంగా సమర శంఖం పూరించిన ధీశాలి సర్వాయి పాపన్న మహారాజ్ అని కీర్తిస్తూ, ఘనంగా నివాళులర్పించారు. పాపన్న గౌడ్ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకుని గౌడ కులస్థులు ఏకతాటిపైకి చేరి తమ హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన గౌడ కులస్థుల కృషిని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ వారి అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అయితే ఇంకనూ గీత వృత్తిలో కొనసాగుతున్న వారి సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందని, వాటి సాధన కోసం గౌడ సోదరులు ఐకమత్యంతో కృషి చేయాలన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, రాచరిక వ్యవస్థ కొనసాగుతున్న ఆ రోజుల్లో కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న ఓ సాధారణ వ్యక్తి కుల వృత్తిపై పన్ను విధించడాన్ని వ్యతిరేకిస్తూ అసామాన ధైర్య సాహసాలతో పోరాటం చేయడం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని సర్వాయి పాపన్న తెగువను కొనియాడారు. నాటి దౌర్జన్యాలను ఎండగడుతూ వేలాది మందితో సైన్యాన్ని సమీకరించుకుని పన్నుల వ్యవస్థ లేని గొప్ప పరిపాలనను అందించారని కొనియాడారు. గోల్కొండ కోటను సైతం జయించి, జనరంజకంగా పాలించడం సర్వాయి పాపన్న ధైర్య సాహసాలను చాటుతోందన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ మార్గదర్శకత్వం ఎంతో అనుసరణీయమని, ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో అందరూ సమానులేననే భావన పెంపొందేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. గీత కార్మికులు సమిష్టిగా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కలెక్టర్ హితవు పలికారు. అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్, నిజామాబాద్ ఆర్డీఓ రవి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, విద్యావేత్త సత్యనారాయణ గౌడ్, బీసీ యువజన విభాగం నేత శ్రీనివాస్ గౌడ్, పాపన్న గౌడ్ ఉత్సవ కమిటీ చైర్మన్ చెరుకు లక్ష్మణ్ గౌడ్, అధిక సంఖ్యలో గీత వృత్తిదారులు పాల్గొన్నారు.

# సన్‌రైజర్స్‌పై రాజస్థాన్ ఘన విజయం

### 72 పరుగుల తేడాతో విజయం

### దుమ్మురేపిన రాజస్థాన్ బౌలర్లు

హైదరాబాద్: ఐపీఎల్-16 సీజన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓటమితో ఆరంభించింది. ఉప్పల్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్‌పై రాజస్థాన్ 72 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీ స్కోరు సాధించింది. కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 131 పరుగులే చేసింది. సమద్ (32) టాప్ స్కోరర్. మయాంక్ అగర్వాల్ (27) పరుగులు చేశాడు. రాజస్థాన్



బౌలర్లలో చాహల్ 4, ట్రెంట్ బౌల్ట్ 2, అశ్విన్, జేసన్ హోల్డర్ ఒక్కో వికెట్ పడగొట్టారు. 204 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్‌కు తొలి ఓవర్‌లోనే గట్టి షాక్ తగిలింది. అభిషేక్ శర్మ (0), రాహుల్ త్రిపాఠి (0)లను ట్రెంట్ బౌల్ట్ పెవిలియన్‌కు పంపాడు. మయాంక్ అగర్వాల్, హ్యారీ బ్రూక్ మరో వికెట్ పడకుండా నిలకడగా ఆడారు. చాహల్ వేసిన ఏడో ఓవర్లో చివరి బంతికి బ్రూక్ (13) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. కొద్దిసేపటికే హోల్డర్ ఓవర్‌లో వాషింగ్టన్ సుందర్ (1) హెట్‌మైయిర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. అశ్విన్ వేసిన తర్వాతి ఓవర్‌లోనే గ్లెన్ ఫిలిప్స్ (8) ఆసిఫ్‌కు చిక్కాడు. చాహల్ వేసిన 11 ఓవర్‌ల మయాంక్ అగర్వాల్ బట్లర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాటపట్టాడు. దీంతో హైదరాబాద్ 52/6 పీకల్లోతు కష్టాల్లో పడింది. చాహల్ వేసిన 14వ ఓవర్‌లో చివరి బంతికి అదిల్ రషీద్ (18) స్టంపౌటయ్యాడు. ఆఖరిలో సమద్ (32), ఉమ్రాన్ మాలిక్ (19) ధాటిగా ఆడినా ఫలితం లేకపోయింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ బ్యాటర్లలో జోస్ బట్లర్ (54; 22 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సులు) విధ్వంసానికి తోడు యశస్వీ జైస్వాల్ (54; 37 బంతుల్లో 9 ఫోర్లు), శాంసన్ (55; 32 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు) కూడా అర్ధ శతకాలతో మెరిశారు. హైదరాబాద్ బౌలర్లలో ఫజల్ హక్ ఫారూఖి, నటరాజన్ తలో రెండు వికెట్లు పడగొట్టగా.. ఉమ్రాన్ మాలిక్ ఒక వికెట్ తీశాడు.

## ఐపీఎల్‌లో చరిత్ర సృష్టించిన జయదేవ్ ఉనాద్కత్

### తొలి భారత క్రికెటర్‌గా రికార్డు



న్యూఢిల్లీ: ఐపీఎల్ చరిత్రలో భారత పేసర్ జయదేవ్ ఉనాద్కత్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్లో అత్యధిక జట్ల తరపున ఆడిన ఆటగాడిగా జయదేవ్ నిలిచాడు. ఇప్పటివరకూ ఇతడు ఐపీఎల్లో మొత్తం 7 జట్ల తరపున ఆడాడు. తొలుత 2010లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఇతడు ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. అనంతరం 2013లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకి ప్రాతినిథ్యం వహించాడు. ఆ జట్టు తరపున ఆ ఒక్క సీజన్ మాత్రమే ఆడిన అతడు.. 2014లో ఢిల్లీ డేర్ డెవిల్స్ తరపున రంగంలోకి దిగాడు. 2016 సీజన్ వరకూ ఆ జట్టుకి ప్రాతినిథ్యం వహించాడు. ఆ తర్వాత 2017లో పుణే సూపర్ జెయింట్స్, 2018లో రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిథ్యం వహించాడు. రాజస్థాన్ జట్టుకి కీలక బౌలర్‌గా అవతరించడంతో.. నాలుగు సీజన్ల పాటు రాజస్థాన్ యాజమాన్యం అతడ్ని రిటెయిన్ చేసింది. అంటే.. నాలుగు సీజన్ల పాటు రాజస్థాన్ తరపున అతగడు ఆడాడు. అయితే.. ఐపీఎల్-2022కు ముందు రాజస్థాన్ అతడ్ని రిలీజ్ చేసింది. అప్పుడు నిర్వహించిన మెగా వేలంలో.. ముంబై ఇండియన్స్ జట్టు అతడ్ని కొనుగోలు చేసింది. అయితే.. అతడు పెద్దగా ఇంపాక్ట్ చూపకపోవడంతో, ముంబై కూడా అతడిని ఐపీఎల్-2023 సీజన్‌కు ముందు విడిచిపెట్టింది. ఐపీఎల్-2023 మినీ వేలంలో లక్నో జట్టు అతడ్ని సొంతం చేసుకుంది. ఇలా అతడు ఏడు జట్ల తరపున ఆడిన భారత ఆటగాడిగా రికార్డ్ నెలకొల్పాడు. అయితే.. ఈ జాబితాలో అగ్రస్థానంలో మాత్రం ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఆరోన్ ఫించ్ ఉన్నాడు. ఇప్పటివరకూ ఫించ్ ఐపీఎల్‌లో మొత్తం 8 జట్లకు ప్రాతినిథ్యం వహించాడు.

## పగ తీర్చుకున్న శ్రీలంక..

### షాక్‌లో న్యూజిలాండ్ టీమ్



ఆక్లాండ్: ఆక్లాండ్ వేదికగా శ్రీలంక, న్యూజిలాండ్ మధ్య తొలి టీ20 థ్రిల్లర్ సినిమాను తలపించింది. సూపర్ ఓవర్‌కు దారి తీసిన ఈ మ్యాచ్‌లో అంతిమంగా విజయం శ్రీలంకనే వరించింది. 197 విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో సరిగ్గా 196 పరుగులు మాత్రమే చేసింది. దీంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది. సూపర్ ఓవర్‌ను వేసే బాధ్యత లంక కెప్టెన్ స్పిన్నర్ తీక్షణకు అప్పజెప్పాడు. సూపర్ ఓవర్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ రెండు వికెట్ల నష్టానికి కేవలం 8 పరుగులు మాత్రమే చేసింది. ఇక 9 పరుగుల లక్ష్యంతో దిగిన శ్రీలంక.. మూడు బంతుల్లోనే ఛేదించింది. లంక బ్యాటర్ అసలంక సిక్స్, ఫోర్‌తో మ్యాచ్ ఫినిష్ చేశాడు. దీంతో మూడు టీ20ల సిరీస్‌లో శ్రీలంక 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

**అసలంక, పెరీరా సూపర్ ఇన్నింగ్స్**

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. లంక బ్యాటర్లలో కుశాల్ పెరీరా(45 బంతుల్లో 53), అసలంక(41 బంతుల్లో 67) అద్భుత ఇన్నింగ్స్ ఆడారు. అనంతరం 197 పరుగుల లక్ష్య ఛేధనలో కివీస్ కూడా ధీటుగా బదులిచ్చింది. డారిల్ మిచెల్(66), ఆఖరిలో సోధి(4 బంతుల్లో 10 పరుగులు) కీలక ఇన్నింగ్స్ ఆడటంతో న్యూజిలాండ్ మ్యాచ్‌ను టైగా ముగించింది.అయితే సూపర్ ఓవర్‌లో మాత్రం విజయం లంకవైపే నిలిచింది. ఇక ఈ ఏడాది కివీస్ పర్యటనకు వెళ్లిన శ్రీలంకకు ఇదే తొలి విజయం. ఈ విజయంతో వన్డే సిరీస్ ఓటమికి లంక బదులు తీర్చుకున్నట్లైంది. ఇక ఇరు జట్ల మధ్య రెండో టీ20 డునెడిన్ వేదికగా ఏప్రిల్ 5న జరగనుంది.

## సురేశ్ రైనా అత్తామామల హత్యకేసు నిందితుడి ఎన్‌కౌంటర్



ముజఫర్‌నగర్: మాజీ క్రికెటర్ సురేశ్ రైనా కుటుంబీకుల హత్య కేసులో నిందితు డిని పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్.. ముజఫర్‌నగర్‌లోని షాపుర్‌లో శనివారం జరిగింది. 2020 ఆగస్టు 19న పఠాన్‌కోట్ లోని క్రికెటర్ సురేశ్ రైనా అత్త, మామ ఇంట్లో రషీద్ చోరీకి పాల్పడ్డాడు. నిందితులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన సురేశ్ రైనా మామ అశోక్ కుమార్, అత్త ఆశా, బావమరిది కౌశల్ కుమార్‌లను రషీద్ తీవ్రంగా గాయపరిచాడు. అశోక్ అక్కడికక్కడే మృతి చెందగా.. ఆశా, కౌశల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.ఈ కేసులో ఇద్దరు నిందితులను గతేడాది సెప్టెంబరులో పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా రషీద్ పేరు బయటకొచ్చింది. అప్పటికే రషీద్ పరారీలో ఉన్నాడు. 'శనివారం కొందరు నేరస్థులు షాపుర్‌కు వచ్చినట్లు ఇన్‌ఫార్మర్ నుంచి మాకు సమాచారం అందింది. దీంతో పోలీసులు, ఎస్వోజీ బృందం అప్రమత్తమైంది. సోరం-గోయ్‌లా రహదారిపై దుండగులు పోలీసులపై కాల్పులు జరిపారు. పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపగా నిందితుడు రషీద్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే షాపుర్‌లోని సీహెచ్‌సీకి తరలించాం. అప్పటికే నిందితుడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు'' అని పోలీసులు తెలిపారు.

## క్రికెట్ దిగ్గజం సలీమ్ దురానీ కన్నుమూత



న్యూఢిల్లీ: టీమ్‌ఇండియా క్రికెట్ దిగ్గజం సలీమ్ దురానీ కన్ను మూశారు. అనారోగ్య కారణాలతో తుది శ్వాస విడిచినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో తన సోదరుడు జహంగీర్ దురానీతో సలీమ్ ఉంటు న్నారు. తొడ ఎముక విరగడంతో ఈ ఏడాది జనవరిలో శస్త్రచికిత్స జరిగింది. అయితే ఇటీవల క్యాన్సర్ బారిన పడటంతో పరిస్థితి విషమంగా మారింది. ఇవాళ కన్నుమూశారు.కాబూల్‌లో 1934లో జన్మించిన సలీమ్ 1960 నుంచి 1973 వరకు భారత్ తరపున టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. 29 టెస్టులు ఆడి.. 50 ఇన్నింగ్స్‌లలో ఒక సెంచరీ, ఏడు హాఫ్ సెంచరీలతో 1,202 పరుగులు సాధించాడు. 1961-62 సీజన్‌లో ఇంగ్లాండ్‌ను ఐదు టెస్టుల సిరీస్‌లో 2-0 తేడాతో భారత్ ఓడించడంలో సలీమ్ దురానీ కీలక పాత్ర పోషించాడు. తన ఆటతోనే కాకుండా డ్రెస్సింగ్ స్టైల్, ఆడంబరమైన జీవనశైలితో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. అఫ్గాన్‌లో జన్మించి భారత్‌లో టెస్టు క్రికెట్ ఆడిన ఏకైక ఆటగాడు సలీమ్ దురానీ. ఆయన మృతిపై టీమ్‌ఇండియా మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి సంతాపం తెలియజేశాడు. ''భారత క్రికెట్ చరిత్రలో అత్యంత కలర్‌ఫుల్ ఆటగాడు సలీమ్ దురానీ. అతడి ఆత్మకు శాంతి కలగాలి. ఓం శాంతి'' అని ట్వీట్ చేశాడు. అలాగే ప్రధాని మోదీ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## మన ఐపీఎల్‌కే ఆ క్రేజ్..

### అప్పుడు వాళ్లను వీర బాదుడు బాదుతాను అన్నాను.. కానీ : సెహ్వాగ్



న్యూఢిల్లీ:ప్రపంచంలో ఎక్కడా లేని క్రేజ్ మన ఐపీఎల్‌కే ఉంది. ప్రపంచవ్యాప్తంగా టాప్ ప్లేయర్లు ఇందులో ఆడేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. ప్రతీ సీజన్‌కు ఎంతో ఆదరణను పెంచుకుంటూ వస్తోన్న ఈ టోర్నీ.. టీమ్‌ఇండియాలోనే కాకుండా ప్రపంచ క్రికెట్‌లోనూ ఎన్నో మార్పులు తీసుకువచ్చింది. అయితే.. ఈ టోర్నీ ప్రారంభమైనప్పుడు ఇంత ఆదరణ వస్తుందని ఎవరూ ఊహించలేదు. తొలి ఐపీఎల్ ఆడిన సమయంలో తన అనుభవాలను మాజీ డ్యాషింగ్ ఓపెనర్ సెహ్వాగ్ తాజాగా ఓ క్రీడా ఛానల్తో పంచుకున్నాడు. ''ఐపీఎల్‌కు ముందు మేమంతా టీమ్‌ఇండియా కోసం ఆడేవాళ్లం. అయితే ఈ టోర్నీ ప్రారంభమయ్యాక.. ఆటగాళ్లు విడిపోయి ఆయా జట్లకు ఆడేవారు. నా జట్టులో కొంత మంది ఆడితే.. మరికొంతమంది వేరే జట్లకు ఆడేవారు. ముఖ్యంగా చెప్పాలంటే.. జహీర్ ఖాన్, ఆశిష్ నెహ్రా, హర్భజన్ నాకు క్లోజ్ ఫ్రెండ్స్. 'నెట్స్‌లో ఎంతో ప్రాక్టీస్ చేశావు కదా.. ఐపీఎల్లో మ్యాచ్‌కు రా.. నిన్ను వీర బాదుడు బాదుతా' అని నేను వారితో సరదాగా అనే వాడిని'' అని సెహ్వాగ్ చెప్పాడు.అయితే ఐపీఎల్‌లో అలాంటిదేమి జరగలేదని సెహ్వాగ్ వివరించాడు. 'జహీర్ ఖాన్ నన్ను ఔట్ చేశాడు. నెహ్రా, హర్భజన్ కూడా నా వికెట్ తీశారు. అయితే.. నేను వారిపై మంచి ఇన్నింగ్స్ ఆడాను. ఐపీఎల్ వచ్చాక పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయి. సొంత జట్టు సభ్యులపైనే ఆడాల్సి వచ్చింది' అని తెలిపాడు.ఇక ప్రేక్షకుల గురించి మాట్లాడుతూ.. ఢిల్లీలో ఢిల్లీ జట్టుకు మద్దతిచ్చే బదులు.. అభిమానులు సచిన్, ద్రవిడ్, గంగూలీ, ధోనీల కోసం కేకలు వేసేవారని అప్పటి పరిస్థితులను గుర్తు చేసుకున్నాడు ఈ మాజీ డ్యాషింగ్ ఓపెనర్.ప్రస్తుతం ఐపీఎల్ 16వ సీజన్ జరుగుతోంది. కరోనా పరిస్థితుల తర్వాత.. తొలిసారి ప్రేక్షకుల మధ్య హోం గ్రౌండ్స్‌లో మ్యాచ్‌లు జరుగుతున్నాయి. గతేడాది ఛాంపియన్ గుజరాత్ టైటాన్స్ తొలి మ్యాచ్‌లోనే సీఎస్కేను మట్టికరిపించి బోణీ కొట్టింది.

## టోర్నీలోని మిగతా మ్యాచుల్లో కేన్ విలియమ్సన్ ఆడడు

### గుజరాత్ టైటాన్స్ ప్రకటన



న్యూఢిల్లీ: గతేడాది ఛాంపియన్‌గా నిలిచి ఐపీఎల్ 16వ సీజన్ను ఘనంగా ప్రారంభించిన గుజరాత్ టైటాన్స్‌కు షాక్ తగిలింది. మినీ వేలంలో కొనుగోలు చేసిన కేన్ విలియమ్సన్ గాయం కారణంగా మిగతా టోర్నీకి దూరమవుతున్నట్లు గుజరాత్ టైటాన్స్ యాజమాన్యం ప్రకటించింది. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో జరిగిన టోర్నీ తొలి మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు కేన్ కాలికి గాయమైంది. దీంతో బ్యాటింగ్‌కు రాకపోవడంతో అతడి స్థానంలో సాయి సుదర్శన్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఎంపిక చేసుకుని బ్యాటింగ్ ఆడించింది. ఇప్పుడు వైద్య పరీక్షల అనంతరం గాయంపై గుజరాత్ కీలక ప్రకటన చేసింది.''టాటా ఐపీఎల్ 2023 సీజన్‌కు కేన్ విలియమ్సన్ దూరమవుతున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గాయపడటంతో అతడికి విశ్రాంతి అవసరమని వైద్యబృందం తెలిపింది. త్వరలోనే కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాం'' అని గుజరాత్ టైటాన్స్ పేర్కొంది. మినీ వేలంలో కేన్‌ను గుజరాత్ రూ. 2 కోట్లకు దక్కించుకుంది. గతేడాది వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు నాయకత్వం వహించిన కేన్‌ను ఈసారి గుజరాత్ సొంతం చేసుకుంది. మిడిలార్డర్‌లోకీలకమవుతాడని భావించినప్పటికీ గాయం కారణంగా వైదొలగడం గుజరాత్‌కు షాకింగ్ లాంటి నిర్ణయమవుతుందని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు.

## నేను అందంగా లేనని ట్రోల్స్ చేశారు : ఉపాసన



ముంబయి: పెళ్లైన కొత్తలో తాను ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నట్లు నటుడు రామ్‌చరణ్ సతీమణి ఉపాసన చెప్పారు. శరీరాకృతిపరంగా తనపై పలువురు నెగెటివ్ కామెంట్స్ చేశారని అన్నారు. ట్రోల్స్ ఎదురైనప్పటికీ తాను ఏమాత్రం కుంగుబాటుకు గురికాలేదని.. ప్రస్తుతం తానొక ఛాంపియన్‌గా ఫీలవుతు న్నానని తెలిపారు. తాజాగా ముంబయిలో ఓ మీడియాతో మాట్లాడిన ఉప్సీ.. చరణ్‌తో తన రిలేషన్ గురించి ఆసక్తికర విషయాలు తెలిపారు. ''చరణ్ నేనూ కామన్ ఫ్రెండ్స్ వల్ల పరిచయమయ్యాం. మొదటి నుంచి తను నన్ను ఏదో ఒక విషయంలో ఛాలెంజ్ చేస్తూనే ఉండేవాడు. నేను కూడా తనకి సవాళ్లు విసిరేదాన్ని. అలా, మేమిద్దరం మరింత ఉన్నతంగా ఎదిగాం. మా మధ్య ప్రేమ మొదలైంది.మేమిద్దరం ప్రాక్టికల్గా ఆలోచిస్తుంటాం. 'నువ్వు ప్రేమలో పడటం కాదు.. ప్రేమలో వికసిస్తుంటావు' అని చరణ్ నాతో చెప్పాడు. ఆ మాట విని నేనెంతో ఆనందించా. రాను రాను చరణ్ చెప్పిన మాట నిజమేన నిపించింది. ఎందుకంటే ప్రతిరోజూ నా జీవిత భాగస్వామి నుంచి ఏదో ఒక విషయం నేర్చుకుం టూనే ఉన్నాను.నా ఆంటీ, సోదరి మా పెళ్లి విషయంలో కీలకపాత్ర పోషించారు. ఎందుకంటే మా ఇద్దరివి భిన్నమైన కుటుంబనేపథ్యాలు. నమ్మకం, ప్రశంసలు, కొన్ని సమయాల్లో రాజీలు పడుతూ మా బంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నాం'' ''చిన్నప్పటి నుంచి ప్రతి ఒక్కరూ నన్ను ఏదో ఒక విషయంలో జడ్జ్ చేస్తూనే ఉండే వారు. సమాజంలో ఉన్న ప్రతిఒక్కరూ ఇలాంటివి ఎదుర్కొన్నవారే. శరీరాకృతి, బ్యాక్‌గ్రౌండ్ ఇలా పలు విషయాల్లో విమర్శలు ఎదుర్కొం టాం. పెళ్లైన కొత్తలో నేనూ బాడీ షేమింగ్ ఎదుర్కొన్నా. నేను అందంగా లేనని, బాగా లావుగా ఉన్నానని, డబ్బు కోసమే చరణ్ నన్ను పెళ్లి చేసుకున్నాడని మాట్లాడారు. ఇలాంటి విమర్శలు చేసిన వాళ్లను నేను నిందించాల నుకోవడం లేదు. ఎందుకంటే, వాళ్లకు నాగురించి ఏమీ తెలియదు. అందుకే వాళ్లు అలా మాట్లాడి ఉండొచ్చు. గడిచిన పదేళ్లలో వాళ్లకు నా గురించి తెలిసింది. దానివల్ల ఇప్పుడువాళ్లకు నాపై అభిప్రాయం మారిపోయింది. విమర్శలను మనం తీసుకునే విధానంలో ఉంటుంది. ట్రోల్స్ వచ్చాయని నేను కుంగిపోలేదు. వాటిని జయించా. ఇప్పుడు నా విషయంలో నేను ఎంతో ఆనందంగా ఉన్నా. ఈ రోజు నేనొక ఛాంపి యన్గా ఫీలవుతున్నా. ఎందుకంటే ఆ విమర్శలను ఎలా ఎదుర్కొన్నానో నాకు మాత్రమే తెలుసు. నేను మరింత ధైర్యవంతురాలినయ్యాను'' అని ఉపాసన వివరించారు.

## ఆ బాధ నుంచి నేనింకా కోలుకోలేదు..



విడాకులు, మయోసైటిస్.. ఇలా తన జీవితంలో ఎదురైన క్లిష్ట పరిస్థితులపై ఇటీవల తరచూ స్పందిస్తున్నారు నటి సమంత. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె వైవాహిక బంధానికి స్వస్తి పలికిన నాటి రోజులను మరోసారి గుర్తు చేసుకున్నారు. ఆ రోజులను ఆమె చీకటి క్షణాలుగా పేర్కొన్నారు. ఆ బాధ నుంచి తానింకా పూర్తిగా కోలుకోలేదంటూ వ్యాఖ్యానించారు. 'శాకుంతలం' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు సామ్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో భాగంగా.. విడాకులు తీసుకున్నప్పుడు తనపై వచ్చిన ట్రోల్స్ గురించి అడగ్గా.. ''ఆ సమయంలో నేను.. నా మనసుకు నచ్చినట్లు రియాక్ట్ అయ్యానంతే. అప్పుడు నాకు మద్దతుగా నిలిచినవారికి ధన్యవాదాలు'' అని సమంత తెలిపారు.

**కన్నీళ్లు చూశా..!**

''స్వతంత్ర భావాలు కలిగిన బలమైన మహిళగా మీరందరూ నన్ను అభివర్ణించవచ్చు. కానీ, నన్ను నేను అలా అనుకోవడం లేదు. నేనూ ఎన్నో కష్టాలు, కన్నీళ్లు, బాధలనూ చూశా. 'నాకు మంచే జరుగుతుందా?' అంటూ రోజూ మా అమ్మని అడుగుతూనే ఉండేదాన్ని. క్లిష్టమైన పరిస్థితులు ఎదురైనప్పుడు చీకటి రోజులు చూశా. పిచ్చి పిచ్చి ఆలోచనలు వస్తుండేవి. ఆ ఆలోచనలు నన్ను నాశనం చేయకూడదని నిర్ణయించుకున్నా. ముందుకు అడుగు వేశా. కుటుంబసభ్యులు, స్నేహితులు నా వెంటే ఉన్నారు. వాళ్ల వల్లే నేను ఇప్పుడు ఇక్కడ ఉన్నాను. అయితే, ఆ బాధ నుంచి నేనింకా పూర్తిగా కోలుకోలేదు. ముందుతో పోలిస్తే చీకటి రోజులు ఎంతో తగ్గాయనే నమ్ముతున్నా. క్లిష్టమైన పరిణామాలు ఎదుర్కొన్న తర్వాతే మనలోని ధైర్యం పెరుగు తుంది. ఎప్పటికీ ఆ క్షణాలు అలాగే ఉండిపోవని తెలుసుకోవాలి'' అని సమంత వివరించారు.

మనం సినిమా

## 'నాటు నాటు'కు ఆలియా భట్, రష్మిక స్టెప్పులు



ముంబయిలో నీతా ముకేశ్ అంబానీ కల్చరల్ సెంటర్ ప్రారంభో త్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బాలీవుడ్‌తో పాటు హాలీవుడ్ స్టార్స్ సైతం హాజరయ్యారు. రెండో రోజు కూడా ఆదే స్థాయిలో పలువురు బాలీవుడ్ తారలు వేదికపై సందడి చేశారు. వారికి ఇష్టమైన పాటలకు స్టెప్పులు వేస్తూ హల్ చల్ చేశారు. వరుణ్ ధావన్, షారుఖ్ ఖాన్, రణవీర్ సింగ్, ఆలియా భట్, రష్మిక మందన్న ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు సాంగ్‌కు స్టెప్పులతో అదరగొట్టారు. దీంతో ఈ వీడియో సోషల్ మీడియోలో తెగ వైరల్‌గా మారింది.ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు సాంగ్‌కు రష్మికతో కలిసి ఆలియా భట్ స్టెప్పులతో అదరగొట్టేసింది. ఒకే వేదికపై ఇద్దరు స్టార్ హీరోయిన్స్ డ్యాన్స్ చేయడంతో అభిమానులు చప్పట్లతో హోరెత్తించారు. పలువురు బాలీవుడ్ తారలు సైతం వేదికపై డ్యాన్స్ చేశారు. రణవీర్ సింగ్ సైతం ప్రియాంక చోప్రాతో కలిసి స్టెప్పులేశారు. వరుణ్ ధావన్ డ్యాన్స్ చేస్తూ జిగి హడిద్ ను చేతులపై ఎత్తుకుని సందడి చేశారు. రెండు రోజుల పాటు సాగిన ఈ ఈవెంట్ లో పెనెలోప్ క్రజ్, టామ్ హాలండ్, జెండయా, సల్మాన్ ఖాన్, హృతిక్ రోషన్, సబా ఆజాద్, దుల్కర్ సల్మాన్, కరణ్ జోహార్, కరీనా కపూర్, సైఫ్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.ఆలియా భట్, రష్మిక మందాన చేసిన డ్యాన్స్ కు నెటిజన్స్ తెగ ఎంజాయ్ చేస్తున్నారు. ఇద్దరు స్టార్ హీరోయిన్స్ ఇలా కలిసి చేయడం సంతోషంగా ఉందంటూ విభిన్న రకాల కామెంట్స్ చేస్తున్నారు. సౌత్, నార్త్ హీరోయిన్స్ ఒకే ఈవెంట్ లో డ్యాన్స్ చేశారంటూ మరికొందరు సోషల్ మీడియాలో పోస్ట్ లు పెడుతున్నారు.

## 'బలగం' చూసి కన్నీళ్లు పెట్టుకున్న గ్రామస్థులు



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలకు అద్దంపడుతూ తెరకెక్కిన సరికొత్త చిత్రం 'బలగం'. చిన్న సినిమాగా విడుదలైన ఇది.. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా తెలంగా ణలో భారీ ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలోనే పాత రోజులను గుర్తు చేస్తూ.. తెలంగాణలోని పలు పల్లెటూర్లలో ఈ సినిమాని వీధుల్లో తెరలు కట్టి ప్రదర్శిస్తున్నారు. తాజాగా ఓ ఊరిలో ఈ చిత్రాన్ని తెర కట్టి ప్రదర్శించగా.. దానిని చూసిన గ్రామస్థులందరూ భావోద్వేగానికి గురయ్యారు. సినిమా క్లైమాక్స్‌కు వచ్చేసరికి ప్రతి ఒక్కరూ కన్నీరు పెట్టుకుంటూ కనిపించారు. దీనికి సంబంధించిన వీడియోను ఓ నెటిజన్ ట్విటర్ వేదికగా షేర్ చేశాడు. 'బలగం' జనాల్లోకి వెళ్లిందని అన్నాడు. దీనిపై సినిమా హీరో ప్రియదర్శి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'జబర్దస్త్' కమెడియన్‌గా గుర్తింపు తెచ్చుకున్న వేణు ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ప్రియదర్శి - కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా నటించారు. దిల్‌రాజు ప్రొడెక్షన్స్ పతాక ంపై హన్షిత్, హర్షిత దీనిని నిర్మించారు. విడుదలైన కొన్నిరోజుల్లోనే ఇది రెండు అంతర్జాతీయ అవార్డులను సైతం సొంతం చేసుకుంది. బెస్ట్ ఫీచర్ ఫిల్మ్, బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ సినిమాటోగ్రఫీ విభాగాల్లో లాస్‌ఏంజిల్స్ సినిమాటోగ్రఫీ అవార్డులను ఇది అందుకుంది.

## సీనియర్ నటుడు కాస్ట్యూమ్స్ కృష్ణ కన్నుమూత



ప్రముఖ సినీ నటుడు కాస్ట్యూమ్స్ కృష్ణ తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. చెన్నైలోని తన స్వగృహంలోని కన్నుమూశారు. ప్రముఖ సినీ నటుడు, నిర్మాత కాస్ట్యూమ్స్ కృష్ణ కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. ఆదివారం చెన్నైలోని తన స్వగృహంలోని తుది శ్వాస విడిచారు. విజయనగరం జిల్లా లక్కవరపు కోటకు చెందిన కృష్ణ.. కోడి రామకృష్ణ దర్శకత్వంలోని 'భారత్ బంద్' చిత్రంతో నటుడిగా వెండితెరకు పరిచయం అయ్యారు. ఆ తర్వాత విలన్, సహాయ పాత్రల్లో నటించి మెప్పించారు. అంతే కాకుండా చాలా సినిమాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా కూడా పనిచేశారు. సినీ పరిశ్రమలో మంచి గుర్తింపు పొందిన కాస్ట్యూమ్స్ కృష్ణ అసలు పేరు మాదాసు కృష్ణ. 1980ల్లో వచ్చిన ఎన్టీఆర్, ఏఎన్నార్, చిరంజీవి, వాణిశ్రీ, జయసుధ, జయప్రద, శ్రీదేవి లాంటి అగ్ర నటీనటులకు కాస్ట్యూమ్స్ అందించారు. నిర్మాతగానూ తన అదృష్టం పరీక్షించుకున్న కాస్ట్యూమ్స్ కృష్ణ.. ఇప్పటి వరకు 8 చిత్రాలను నిర్మించారు. దీంతో పాటు 'అల్లరి మొగుడు', 'దేవుళ్లు', 'విలన్', 'మా ఆయన బంగారం', 'శాంభవి ఐపీఎస్', 'పుట్టింటికి రా చెల్లి' లాంటి హిట్ సినిమాల్లో నటించారు కాస్ట్యూమ్స్ కృష్ణ. కాగా, పెళ్లిపందిరి చిత్రం తర్వాత సినిమాలకు దూరంగా ఉన్నారు కాస్ట్యూమ్స్ కృష్ణ.కాస్ట్యూమ్ డిజైనర్‌గా బిజీగా ఉన్న కృష్ణలో ఓ నటుడిని చూశారు దివంగత సీనియర్ దర్శకుడు కోడిరామకృష్ణ. ఆయనకు నటించాలనే ఆసక్తి లేకపోయినప్పటికీ ఎలాగో ఒప్పించారు. అలా కాస్ట్యూమ్స్ కృష్ణ భారత్ బంద్ సినిమాలో విలన్గా నటించారు. తొలి చిత్రంలోనే తనదైన విలనిజంతో ఆయన ఆకట్టుకున్నారు. తర్వాత నటుడిగా మళ్లీ



ఆయన వెనుదిరిగి చూసుకోలేదు. నటుడిగా ఉన్న సమయంలోనే నిర్మాతగానూ మారారు. కృష్ణతో అశ్వద్ధామ, అరుంధతి (పాత ఇసనిమా), పెళ్లి పందిరి వంటి సినిమాలను నిర్మించారు.కాస్ట్యూమ్స్ కృష్ణ మృతి పట్ల టాలీవుడ్ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. కాస్ట్యూమ్స్ కృష్ణ మరణ వార్త విని బాధ కలిగిందని.. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానంటూ నిర్మాత దిల్ రాజు ట్వీట్ చేశారు. సినీ ఇండస్ట్రీలో వరుస విషాదాలు జరుగుతున్నాయి. ఇటీవల మలయాళ నటుడు ఇన్నోసెంట్(75) కన్నుమూశారు. మార్చి 3వ తేదీ నుంచి కేరళ.. కొచ్చిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన తుదిశ్వాస విడిచారు. కరోనా ఇన్ఫెక్షన్, శ్వాసకోశ వ్యాధులు, వివిధ అవయవాల వైఫల్యం వల్ల ఇన్నోసెంట్ మరణించినట్లు ఆసుపత్రి వర్గాలు ఓ ప్రకటనలో వెల్లడించాయి. అంతకుముందు.. ఫిబ్రవరి 2న తెలుగు చిత్ర పరిశ్రమ దిగ్గజ దర్శకుడు, కళా తపస్వి కె.విశ్వనాథ్ కన్నుమూశారు.

## పొలిటికల్ ఎంట్రీపై క్లారిటీ ఇచ్చిన 'కాంతార' హీరో



'కాంతార' సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు హీరో రిషబ్ శెట్టి. భాషతో సంబంధం లేకుండా భారీగా ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సొంతం చేసుకున్నాడు. తాజాగా ఈ క్రేజీ హీరోకు సంబంధించిన ఓ వార్త కన్నడ నాట చర్చనీయాంశంగా మారింది. రిషబ్ త్వరలోనే రాజకీయాల్లోకి రానున్నాడనే వార్త గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. తాజాగా ఈ విషయంపై కాంతార హీరో క్లారిటీ ఇచ్చాడు.ట్విట్టర్‌లో రిషబ్ ఫొటో షేర్ చేసిన ఓ జర్నలిస్ట్ 'రిషబ్ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు.. ఇది ఈ రోజు అతిపెద్ద వార్త' అని రాసి రిషబ్‌ను ట్యాగ్ చేశారు. ఆ ట్వీట్‌కు రిషబ్ రిప్లై ఇస్తూ.. ''నేను రాజకీయాల్లోకి రానున్నానంటూ వస్తోన్న వార్త నిజం కాదు. ఇది రూమర్ మాత్రమే. నేను పాలిటిక్స్‌లోకి రావడం లేదు'' అని స్పష్టం చేశారు. ఇప్పటికే కొంతమంది తన పార్టీలో చేరారని కూడా రాస్తున్నారంటూ నవ్వుతున్న ఎమోజీలను రిషబ్ పోస్ట్ చేశారు. 'మీరు రాజకీయాల్లోకి రండీ మేము మద్దతు ఇస్తామని' కొందరు అభిమానులు కామెంట్స్ పెట్టగా.. రిషబ్ వారికి కూడా రిప్లై ఇచ్చారు. తనకు రాజకీయపరమైన మద్దతు వద్దన్నారు. తన సినిమాలను ఆదరిస్తే చాలని చెప్పారు. తనపై ఇంత ప్రేమాభిమానాలు చూపుతోన్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం ఈ ట్వీట్లు సోషల్‌మీడియాలో వైరలవుతు న్నాయి. చిన్న సినిమాగా విడుదలై కోట్లు వసూళ్లు చేసిన 'కాంతార' సినిమా రెండో భాగం కోసం సినీ ప్రియులు ఎదురుచూస్తున్నారు. ఇటీవల ఈ సీక్వెల్‌పై రిషబ్ మాట్లాడారు. రెండో భాగం సీక్వెల్ కాదని ప్రీక్వెల్ అని పేర్కొన్నారు. దానికి ముందు జరిగిన సంఘటనలను రెండో భాగంలో చూపనున్నట్లు చెప్పారు. అలాగే పంజుర్లికి సంబంధించిన సన్నివేశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ ప్రీక్వెల్‌ను 2024లో విడుదల చేసే అవకాశమున్నట్లు చెప్పారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500 037.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, CHIEF EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.